ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
fb.com/vaartha Digital

జస్టిస్ వర్మ ఇంట్లో కరెన్సీ కట్టలు నిజమే: కమిటీ
అమెరికా స్టూడెంట్ వీసా జారీ ప్రక్రియ షురూ
5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50

# బనకచర్లను అడ్డుకోండి

## కేంద్రాన్ని కోరిన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్


న్యూఢిల్లీలో గురువారం జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

### ఆ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధం
### జిడబ్ల్యుడిటి, పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఎపి
### పాలమూరు, సమ్మక్క-సారక్క, తుమ్మిడి హెట్టి ప్రాజెక్టులకు అనుమతివ్వండి
### మూసీ పునరుజ్జీవానికి నిధులు కేటాయించండి
### ఇచ్చంపల్లి- 'సాగర్' అనుసంధానంపై చర్చకు సిద్ధం
### జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్19:** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలియజేశారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు >>2

## అన్యాయం జరిగితే 'సుప్రీం'కు వెళ్తాం
### త్వరలో ఇద్దరు సిఎంల భేటీకి అవకాశం: ఢిల్లీలో మీడియాతో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జూన్ 19,ప్రభాతవార్త:** గోదావరి–బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు అని కేంద్రప్రభుత్వం అనుమతి ఇస్తే దానిని అడ్డుకోవడానికి సుప్రీం >>2

# తెలంగాణ వాదం వింతగా ఉంది..

### సముద్రంలో కలిసే నీటిపై వివాదమెందుకు?
### రెండు రాష్ట్రాలు ఆ నీటిని వాడుకోవచ్చు
### ఎపి సిఎం చంద్రబాబు




**విజయవాడ, జూన్19, ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో కలిసే నీళ్ల వాడకంపై వివాదం ఎందుకు తెలంగాణా లేవనేత్తుందో అర్ధంగాని అంశమని ఏపీ చంద్రబాబు వ్యాఖ్యానించారు.గురువారం మీడియాతో ఇష్టాగోష్టిలో బనకచర్లపై అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు.బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణా లేవనెత్తిన అభ్యంతరంపై ముఖ్యమంత్రి సముద్రంలో కలిసే జలాలను రెండు రాష్ట్రాలూ కలిసి వాడుకుందామని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "గోదావరిలో నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుతున్నాయి. పోలవరం తప్ప మిగతావి అనుమతి రాని ప్రాజెక్టులే. విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. గోదావరి ప్రవాహంలో చిట్టచివరి రాష్ట్రంగా వచ్చిన నీటిని మరోబేసిన్‌కు తరలిస్తున్నాం. గతంలోకృష్ణా బ్యారేజ్‌పై ఇరురాష్ట్రాల సిబ్బంది గొడవ పడ్డారు. గవర్నర్ వద్ద కూర్చొని గతంలో సమస్య పరిష్కరించుకున్నాం. కృష్ణాలో తక్కువ ఉన్న నీటిపై గొడవ పడితే లాభం లేదు. ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులను అలాగే >>2

## 5 ఎకరాల దాకా రైతు భరోసా జమ
### -మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రైతు భరోసా నిమిత్తం నాల్గవ రోజు రైతుల ఖాతాల్లో మరో 1189.43 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో గురువారం రోజున 5 ఎకరాలకు వరకు రైతు భరోసా నిధులు జమ చేసినట్టు చెప్పారు. దీంతో మరో 19.82 లక్షల ఎకరాలకు సంబంధించిన 4.43 లక్షల మంది రైతులు లబ్ధిపొందనున్నారని, రైతుభరోసా కోసం ఇప్పటి వరకు మొత్తం 6404.70 కోట్ల రూపాయలను విడుదల చేయగా, తద్వారా రాష్ట్రంలోని 62.47 లక్షల మంది రైతులకు పెట్టుబడి సహాయం అందించినట్లు వివరించారు. 9 రోజుల్లో 9 వేల కోట్లను రైతుల ఖాతాలలో జమ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో రోజు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్టు తెలిపారు.ఎకరాలతో సంబంధంలేకుండా సాగు యోగ్యమైన అన్నిభూములకు రైతు భరోసా సహాయాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

# పోలవరం నుంచి శ్రీశైలం రివర్స్ పంపింగ్ మేలు




### రెండు తెలుగు రాష్ట్రాలకు అదే లాభదాయకం
### రూ.25వేల కోట్లతో సాగర్ నుంచి శ్రీశైలానికి గోదావరి జలాలు
### భూ సేకరణవంటి ప్రతిబంధకాలు లేని ప్రాజెక్టు
### తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల కొత్త ప్రతిపాదన

**హైదరాబాద్,జూన్ 19,ప్రభాతవార్త:** జాతీయ నదుల అనుసంధానంలోనూ కీలక భూమిక వహించే పోలవరంబనకచర్ల అనుసంధాన పథకానికి రాయలసీమకు మాత్రమే గేట్‌వేగా పరిమితం చేయకుండా ఉభయతెలుగురాష్ట్రాలకు వరప్రదాయినిగా ఉపయోగించుకొనే అవకాశం ఉంది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌ల మధ్య చిచ్చు రాజేసిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంకు రూ.81,900 కోట్ల వ్యయమవుతుందన్నది ప్రాథమిక అంచకట్టారు. పోలవరం నుంచి శ్రీశైలంకు రివర్స్ నీటిని తరలిస్తే ఉభయ రాష్ట్రాల మధ్య శాశ్వతంగా నీటి యుద్దాలకు ముగింపు పలకడమే కాకుండా పసిడిపంటలతో తులతూగే అవకాశం ఉంది. పోలవరం నుంచి శ్రీశైలంకు గోదావరి నీటిని రివర్స్‌పంపింగ్ ద్వారా ఎత్తిపోయడం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మేలుజరుగుతుందని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు శ్యాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శులు వెంకటేశం అభిప్రాయపడుతున్నారు. పోలవరం నుంచి గోదవరి వరదజలాలు రోజుకు 3నుంచి 4 టిఎంసిలు పులిచింతల, నాగార్జునసాగర్ టేయిల్‌పాండ్,ఎస్ఎస్‌పి జలాశయాలను ఉపయోగించుకొని శ్రీశైలం వరకు రివర్స్‌పంపింగ్ ద్వారా తరలించి ఉభయ తెలుగురాష్ట్రాల నీటి అవసరాలను తీర్చుకోవచ్చని వారు తెలిపారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కర్నాటక రాష్ట్రం లాల్‌బహద్దూర్ డ్యామ్ 5మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఎత్తును పెంచుకోవడాని 125 టిఎంసిలు అదనంగా నిల్వచేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్లు గుర్తుచేశారు. శ్రీశైలంకు తగ్గే కృష్ణానది వరద జలాలను ప్రత్యామ్నయంగా గోదావరి జలాలు సప్లమెంటరీ ఫీడింగ్‌గా >>2



## భారత్- పాక్ యుద్ధాన్ని నేను ఆపలేదు..
### వారిద్దరే పరిష్కరించుకున్నారు..
### మాటమార్చిన ట్రంప్

**వాషింగ్టన్,జూన్ 19:** భారత్ పాక్ యుద్ధాన్ని ఆపింది తాను కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఎట్టకేలకు నిజం అంగీకరించారు. భారత్ ఫాక్‌కు చెందిన ఇద్దరు మేధావులైన నేతలు ఇరుదేశాలమధ్య ఉద్రిక్తతలను పరిష్కరించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఈ ఒప్పందంలో అమెరికా ప్రమేయం ఏమీ లేదని అన్నారు. ఈ యుద్ధం విరమింపచేయడంలో తన జోక్యం ఏమీ లేదని భారత్‌పాక్ దేశాలే ఉద్రిక్తతలు పరిష్కరించుకున్నాయని అన్నారు. పాకిస్థాన్ ఆర్మీచీఫ్ ఆసిమ్ >>2

# బనకచర్లకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా?



### ఆయన పెట్టిన మీటింగ్ అలాగే ఉంది..
### సాగునీటి ప్రాజెక్టులపై సిఎంకు శ్రద్ధ లేదు
### ఆయన చెప్పేవన్నీ అసత్యాలే: హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్19:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం శ్రద్ధ లేదని బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బేసిక్ నాలెడ్జ్ లేకుండా ఎందుకు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిలో విషయం తక్కువ విషం ఎక్కువ అని వ్యాఖ్యానించారు. బనకచర్ల విషయంలో మొద్దునిద్ర లేపింది బిఆర్ఎస్ పార్టీ. నేను రెండు సార్లు ప్రెస్ మీట్ పెట్టి వాయిస్తే పాత డేట్లు వేసి ఉత్తరాలు విడుదల చేశారు అని పేర్కొన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డి మీటింగ్ పెట్టినట్లు ఉందని అఖిల పక్ష సమావేశంపై మాట్లాడారు. గోదావరిలో 968 టిఎంసీలు తెలంగాణ హక్కు వెయ్యి టిఎంసీలు కావాలని చంద్రబాబును అడగటం ఏంటీ? కృష్ణాలో 763 టిఎంసీల కోసం వాదిస్తుంటే 500 టిఎంసీలు అడటమేంటీ? ఆంధ్ర జలదోపిడీని అడ్డుకోమంటే సిఎం అబద్దాలు చెప్పారని పేర్కొన్నారు. గోదావరి కృష్ణా జలాలు మీ అయ్య సొమ్మా..? నువ్వు తెలంగాణకు కాపలాదారు మాత్రమే. రాష్ట్ర హక్కులను చంద్రబాబుకు రాసిస్తా.. ఆంధ్ర ప్రదేశ్‌కు రాసిస్తా అంటే రాష్ట్ర ప్రజలు ఊరుకోరు. ఎవరు చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు అని ప్రశ్నించారు.తప్పుడు సమాచారం ఇస్తే జైల్లో వేస్తామని హెచ్చరికలు పొందిన వ్యక్తి ఈ రోజు రేవంత్‌రెడ్డికి సలహాదారు, తెలంగాణ ప్రయోజనాలు దెబ్బ కొడుతూ ఏపీకి వత్తాసు పలుకుతున్నాడు, భగవంతుడికి భక్తుడికి అనుసంధానం అంబికా దర్బార్ బత్తి అంటున్నాడు రేవంత్. ఈరోజు చంద్రబాబు >>2



### ఖమేనీ అంతమే తమ లక్ష్యమన్న నెతన్యాహు
### ఇజ్రాయెల్ హెచ్చరికలకు ట్రంప్ వత్తాసు
### దూసుకు వస్తున్న క్షిపణులతో రణరంగంలా మారిన పశ్చిమాసియా

# ఇక భీకర సమరమే

### ఇరాన్ యురేనియం నిల్వలే ఇజ్రాయెల్ టార్గెట్

**టెహ్రాన్,జూన్ 19:** ఇరాన్ ఇజ్రాయల్‌లమధ్య దాడులు తీవ్రం అయ్యాయి. యుద్ధం తీవ్రతరంచేసినట్లుగా ఇపుడున్న సైనిక ఘర్షణలు చెపుతున్నాయి. ఇరాన్‌లోని అణుస్థావరాలు, అణుశాస్త్రవేత్తలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులుచేస్తే ఇరాన్ కూడా తామేమీ తక్కువ కాదంటూ ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచర్య సంస్థ మొస్సాద్ కేంద్రకార్యాలయంపై దాడులుచేసామని ప్రకటించింది. అంతేకాకుండా కొత్తతరహా క్షిపణి,డ్రోన్లతో ఏకకాలంలో దాడులు ప్రారంభించామని హైఫా, టెల్ అవీవ్‌లే లక్ష్యంగా దాడులుచేసినట్లు ప్రకటించుకుంటున్నది. తీవ్రం అవుతున్న ఈ యుద్ధభేరిని విరమింపచేసేందుకు అటు రష్యా, ఇటు అమెరికా రెండూ కూడా తహతహలాడుతున్నాయి. తాను మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్దమేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌ప్రకటించడాన్ని అమెరికా అధ్యక్షుడు వ్యంగ్యంగా విమర్శించారు. ముందు మీరు ఉక్రెయిన్ యుద్ధవిరమణ చేయండి ఆతర్వాత ఇరాన్ ఇజ్రాయెల్‌కు రావచ్చు అని వ్యంగ్యాస్త్రాలు సంధించడంతో చూస్తే శాంతి చర్చలు జరిగే సూచనలు ఎక్కడా కనిపించడంలేదు. ఇరాన్ అధ్యక్షుడు అయొతుల్లా ఖమేనీ ఇక జీవించి ఉండేందుకు అర్హుడు కాదని, ఖమైనీ అంతమే ఇజ్రాయెల్ అక్ష్యంటూ నేరుగా ఇజ్రాయెల్ ఉప విదేశాంగమంత్రి ప్రకటించడాన్ని చూస్తుంటే ఇజ్రాయెల్ అమెరికా పరోక్ష సాయంతో ఈ దాడులు మరింత తీవ్రంచేస్తుందనేది తెలుస్తోంది. ఇప్పటివరకూ వందలాదిగా సంభవిస్తున్న మరణాలు ఇక వేలు లక్షల్లోకి మారనున్నాయని ఈ దేశాల పాలకులు వైఖరులు స్పష్టంచేస్తున్నాయి. ఇజ్రాయెల్‌సైన్యంకూడా ఇరాన్ ఒక క్షిపణిని ప్రయోగించి అనేక వార్‌హెడ్‌లు జోడించిందని, బాలిస్టిక్ క్షిపణులకంటే తీవ్రత ఎక్కువ ఉంటుందని కూడా ప్రకటించింది. ఇజ్రాయెల్ ఐడిఎఫ్ బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ మాట్లాడుతూ ఇరాన్ సుమారు 450బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిందని, ఇజ్రాయెల్‌పై 1000కిపైగా డ్రోన్లప్రయోగించిందని ప్రకటించారు. అయితే >>2

## భారీ వర్ష సూచన
### లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తం
### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** నైరుతి ఋతుపవనాలు బలపడటం, ఉపరితల ద్రోణి ప్రభావం వల్ల తెలంగాణలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో ఆరు రోజుల పాటు ఈ వర్షాలు పడతాయని, ఇదే సమయంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. నేటి నుంచి ఈనెల 24 వరకు తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం >>2

## తెలంగాణ రైజింగ్-2047 విజన్ భేష్
### సిఎం రేవంత్‌కు యుకె మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు
### లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్న తెలంగాణ, టిబిఐజిసి ప్రతినిధులు


ఢిల్లీలో యుకె మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో భేటీ అయిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్19:** తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్–2047 విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997–2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘ కాలం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన, వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టిబిఐజిసి)ను స్థాపించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులు, యువత,మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి టోనీబ్లెయిర్‌కు తెలియజేశారు. మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు >>2



అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాల్లో భాగంగా డెహ్రాడూన్‌లో గురువారం యోగా సాధన చేస్తున్న ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి

## 'సుప్రీం'కు వెళ్తాం

>> కోర్టుకు వెళ్ళుతామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. బనకచర్ల ప్రాజెక్టు పై గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్‌పాటిల్ కు అభ్యంతరాలను తెలియజేసిన అనంతరం ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బనకచర్లపై తెలంగాణ ఆందోళనలను కేంద్ర మంత్రికి వివరించాం. ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రజలు, రైతుల్లో ఆందోళనలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారని పేర్కొన్నారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా చూడమని కోరామని తెలిపారు.ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ లింక్ తో పెన్నా బేసిన్ కు నీరు తీసుకెళ్లొచ్చని తెలిపారు. ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధాన అంశంపై చర్చకు సిద్ధమని చెప్పామని అన్నారు. త్వరలో ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంల భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పాటిల్ హామీ ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణాలోని పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఇంకా అనుమతులు లభించలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకే త్వరగా అనుమతులిస్తు న్నారని కేంద్రమంత్రి వద్ద ఆరోపించామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరామని తెలిపారు. రాష్ట్ర ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. పాలమూరురంగారెడ్డి, సమ్మక్క సారక్క, తుమ్మిడిహట్టికి కేటాయింపులుకోరామని ఉత్తమ్ తెలిపారు.

## ఇక భీకర సమరమే

>> ఇజ్రాయెల్‌కూడా తాము ఇరాన్‌లోని మూడొంతుల క్షిపణి లాంచర్లను ధ్వంసంచేసామని చెపుతోంది. ఆసుపత్రిపై దాడులుచేసి యుద్ధ నేరాలకు పాల్పడుతోందని, యుద్ధ నియమాలను ఉల్లంఘిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. అయితే ఇరాన్ ఐఆర్జీసీ మాత్రం తాము అసుపత్రిపై దాడులుచేయలేదని, ఆసుపత్రి సమీపంలో ఉన్న ఇజ్రాయెల్ గూఢచర్య కమాండ్ సెంటర్‌ను ధ్వంసంచేసామని వివరణ ఇచ్చింది. అలాగే ఇరాన్‌లోని ముషెహర్ అణు ఇంధన ప్లాంట్‌పై దాడిచేయడాన్ని రష్యా తీవ్రంగా పరిగణిస్తూ హెచ్చరికలుచేసింది. ఈ దాడి చెర్నోబిల్ అణుకేంద్రంపై దాడి తరహాలో ఉందని అక్కడ మా రష్యా సిబ్బంది అధికారులే పనిచేస్తున్నారని గుర్తుచేసింది. రష్యా విదేశాంగ ప్రతినిది మారియా జఖరోవా మాట్లాడుతూ బుషెహర్ అణు ఇంధన ప్లాంట్‌లో రష్యా స్పెషలిస్టుల రక్షణ మాబాధ్యత అని పేర్కొంది. ఈలోపు యూరోప్ దేశాలమద్దతు కూడగట్టేందుకు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి జెనీవాలో భేటీ అవుతున్నారు. అరాక్ న్యూక్లియర్‌కేంద్రాన్ని కూడా ధ్వంసంచేసామని ఇజ్రాయెల్ తాజాగాప్రకటించుకుంది. మిలిటరీ ఇంటెలిజెన్స్ ప్రాంతాలకు చేరువగా ఉండవద్దని ఇరాన్ అటు తమ దేశ పౌరులతోపాటు ఇజ్రాయెల్ వాసులను కూడా హెచ్చరించింది. దెబ్బతిన్న సరోకా మెడికల్ కేంద్రాన్ని ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సందర్శించారు. ఇప్పటికే అమెరికా ఎంతో సాయం చేసిందని, ఇరాన్‌తో యుద్ధం మొదలయిన తర్వాత అమెరికా తనవంతుగా ముందుకువస్తోందని, గగనతలాన్ని పరిరక్షిస్తోందని అభినందించారు. అమెరికా ప్రత్యేకప్రతినిది స్టీవ్ విట్‌కాఫ్ ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి లు అనేక పర్యాయాలు దౌత్యపరమైన చర్చలుజరిపినా ఫలితం కనిపించడంలేదు. సరికదా దాడులు మరింత తీవ్రం అయ్యాయి. ఇపుడు అమెరికా కూడా ఇజ్రాయెల్‌కు వత్తాసు పలుకుతూ ఇరాన్ మరింతగా ప్రత్యక్ష నరకం చవిచూస్తుందని హెచ్చరించారు. అలాగే ఇజ్రాయెల్ అయితే అయతొల్లాఖమైనీ అంతమే మా లక్ష్యం అంటూ త్వరవలోనే మాసైన్యం అపనిచేస్తుందని ప్రకటించుకుంది. 40 యుద్ధవిమానాలు, వంద బాంబులతో ఇజ్రాయెల్ ఏకకాలంలో ఇరాన్‌పై దాడులుచేసింది. కీలకమైన అణుస్థావరాలను కూడా లక్ష్యంగాచేసుకుని దాడులుచేసింది.

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్ భేష్

>> వెల్లడించారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను యూకే మాజీ ప్రధానమంత్రికి సీఎం తెలియజేశారు.తెలంగాణ రైజింగ్-2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ,ఈ విజన్‌ను 2025,డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సీఎం తెలిపారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు.

'భారత్ ఫ్యూచర్ సిటీ','యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ', 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ' వంటి ప్రాజెక్టులపై టోనీబ్లెయిర్ ఆసక్తి చూపారు. ఇరు నేతలు గంటకుపైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టిబిఐజిసి ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని (లెటర్ ఆఫ్ ఇంటెంట్) పరస్పరం మార్చుకున్నారు. సమావేశంలో నీటి పారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఏ.పి.జితేందర్ రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్‌రంజన్, పారిశ్రామిక విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్దన్ రెడ్డి, టిబిఐజిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారీ వర్ష సూచన

>> ఉందని చెప్పారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 24వ వరకు ప్రభావిత జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిడుగులు కూడా పడే ఛాన్స్ ఉన్నందున బయట ప్రయాణాలు తగ్గించుకోవాలని సురక్షిత ప్రాంతాల్లో ఉండటం మంచిదని విజ్ఞప్తి చేశారు. కాగా గడిచిన 24 గంటల్లో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడిలో అత్యధికంగా 1.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చెదురుమెదురుగా వర్షాలు కురిశాయన్నారు. ఈ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, రైతులు తమ పంటలకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గోదావరి పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లోని బాబ్లీకి నిండు కుండులా తొణికిస లాడుతుంది. మరోవైపు ఆదిలాబాద్ నుంచి భూపాలపల్లి నుంచి ఖమ్మం వరకు ప్రాజెక్టులు అప్పుడే పొంగిపొర్లుతున్నాయి. ఇక రైతులు కూడా సకాలంలో కురిసిన వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యుద్ధాన్ని నేను ఆపలేదు..

>> మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చిన అనంతరం ఓవర్ ఆఫీసులో వీరిద్దరూ మీడియా ముందుకువచ్చారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ చాలా తెలివైనిద్దరు వ్యక్తులు యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించారు. లేదంటే ఆపరిస్థితులు అణుయుద్ధానికి దారితీసేవే. ఆ రెండూ అణుశక్తికలిగిన దేశాలు. అందుకే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయన్నారు. అంతేకాకుండా భారత్ ఫాకిస్థాన్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందాలపై తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. భారత్ పాకిస్థాన్‌మధ్య గతనెలలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయం ఏమీ లేదని మోడీ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. ఇది రెండుదేశాల సైన్యం చర్చలుజరిపి తీసుకున్న నిర్ణయమని మధ్యవరినత ఎవరూ లేరన్నారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు ఫోన్‌లో చెప్పానని మోడీ అన్నారు. తమ వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదని ఆయన స్పష్టంచేసారు. ఈ చర్చల తర్వాతకూడా ట్రంప్ మళ్లీ పాతపాటే పాడారు. మంచిది నేను యుద్ధాన్ని ఆపా. పాకిస్థాన్‌పై నాకు ప్రేమ ఉంది. మోడీ అత్యద్భుత వ్యక్తి అని భావిస్తున్నానని అన్నారు. ఆ తర్వాత 24 గంటలు గవవకముందే అమెరికా అధ్యక్షుడు యుద్ధాన్ని తాను ఆపలేదని ఇద్దరు మేధావులైన ప్రముఖులే పరిష్కరించుకున్నారన్నారు.

## తెలంగాణ వాదం వింతగా ఉంది..

>> కొనసాగిద్దాం. కొత్త ట్రిబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేనే చాలా ప్రాజెక్టులు మొదలు పెట్టాను. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులు నేనే మొదలు పెట్టాను. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వివాదం వస్తే అసెంబ్లీలో పోరాడాం. కాళేశ్వరం గురించి ఎప్పుడూ నేను అభ్యంతరం చెప్పలేదు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి వాడుకునే నీటిపై ఎందుకు వివాదాలు పెట్టుకోవాలి. సముద్రంలో కలిసే నీటి వాడకంపై చట్టబద్ధత కావాలంటే కేంద్రంతో చర్చిద్దాం. సముద్రంలో కలిసే నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంతవరకు సమంజసం? రెండు రాష్ట్రాల జల వివాదాల వల్ల ఎలాంటి లాభం లేదు. వివాదం సృష్టిస్తే ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. ఈ అంశంపై పోరాటాలు అక్కర్లేదు. ప్రాజెక్టులు కట్టి నీళ్ల తీసుకోండి" ఎవరు వద్దన్నారని ముఖ్యమంత్రి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తన లక్ష్యమని ఎపి సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## వారం - వర్జ్యం

తేది : 20-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
నవమి ఉ.9.47
రేవతి రా.9.42
వర్జ్యం సా.4.06-5.35
దు.8.13-9.04, 2) మ.12.36-1.28
శుభసమయం : ఉ.5.15-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం** : పెండింగ్‌లో పడిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృషభం**: సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**మిథునం**: బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం** : వృత్తి - వ్యాపారాలలో లాభాలు పొందుతారు. తండ్రిద్వారా ఆస్తి లాభాలు పొందుతారు.

**సింహం** :కాంట్రాక్టులు లాభిస్తాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. వివాదాలకు దూరంగా వుండండి.

**కన్య** : దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు. రుణ ఒత్తిడులనుండి బయటపడతారు.

**తుల** : అందరిలోను ప్రత్యేక గుర్తింపు పొందుతారు. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం**: సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు**: జీవిత భాగస్వామి సలహాతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం**: రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ఊహించని సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**కుంభం** : శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు.

**మీనం** : భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పోలవరం నుంచి శ్రీశైలం రివర్స్ పంపింగ్ మేలు

>> ఉపయోగించుకోవడానికి వీలవుతోందని వారు పేర్కొన్నారు. శ్రీశైలం,నాగార్జునసాగర్‌లో లోటు ఏర్పడే జలాలు గోదావరి జలాలతో పూడ్చుకొనే అవకాశం ఉందని వారు వివరించారు. పోలవరం నుంచి సంవత్సరానికి వందరోజులు రోజుకు 3నుంచి నాలుగు టిఎంసిలు తీసుకొని రావొచ్చని దీనికి గాను పోలవరం కుడికాల్వకు మరో కాల్వకూడా సమాంతరంగా తవ్వి ఉపయోగించుకోవచ్చని వారు తెలిపారు. ఏలాంటి భూసేకరణ చేపట్టకుండా నాగార్జునసాగర్‌కు, శ్రీశైలంకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగర్జునసాగర్, శ్రీశైలంలో రివర్స్ టర్బ్సన్స్ కూడా ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో తెలంగాణ ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో గోదావరి జలాలు ఉభయరాష్ట్రాలు శ్రీశైలం వరకు తీసుకొచ్చి అన్ని బేసిన్‌లకు వాడుకొందామని అనేక సమావేశాలలో చర్చించారు. కృష్ణానదిలో తగ్గిపోతున్న వరదజలాలను పూడ్చుకోవడానికి నాలుగు సార్లు ఉభయరాష్ట్రాల ఇంజనీర్ల సమావేశం కూడా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసినజగన్ రెండు టిఎంసిలు పోలవరం నుంచి బనకచర్లద్వారా ఎత్తిపోసుకుంటామని రివర్స్ పంపింగ్ ప్రతిపాదనకు సమ్మతి తెలుపకుండా తిరస్కరించారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు కూడా అదే ప్రతిపాదనతో ముందుకు పోతున్నారు. ఈ పథకాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించతలపెట్టారు. 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, 80 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామికావసరాలకు 20 టీఎంసీలు, 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరద జలాలను ఈ ప్రాజెక్టుకు తరలిస్తారు. . కరువు సీమ రాయలసీమతో పాటు పల్నాడునూ సస్యశ్యామలం అవుతుందని భావిస్తున్నారు. పెన్నాబేసిన్‌కు నీటిని తరలించే బనకచర్ల పథకం మూడు దశల్లో చేపడుతారు.పోలవరం-బనకచర్ల మొదటి దశ కింద గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి మళ్లిస్తారు. ఇప్పటికే ఈ కుడి కాలువ ద్వారా పట్టిసీమ నుంచి 80 టీఎంసీలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నారు. ఈ కాలువ సామర్థ్యం రోజుకు 18,000 క్యూసెక్కుల నుంచి 35,000 క్యూసెక్కుల చొప్పున రెండు టీఎంసీల చొప్పున 100 రోజులు ఎత్తిపోస్తారు. ఇందుకు 290 మెగావాట్ల విద్యుత్ అవసరం. కుడికాలువ విస్తరణకు 9,000 ఎకరాల భూమి సేకరించాలి. అలాగే దీనికి సమాంతరంగా 40 కిలోమీటర్ల మేర కొత్త కాలువ నిర్మించాల్సి ఉంటుంది. ఈ దశకు రూ.13,800 కోట్లు వ్యయమవుతుందని అంచనావేశారు. బొల్లాపల్లి రిజర్వాయర్లోకి ఎత్తిపోయడం తో రెండో దశ మొదలవుతోంది. పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు వెన్నెముక బొల్లాపల్లి రిజర్వాయరు వ్యవహారిస్తుంది. దీని సామర్థం 173 టీఎంసీలు. రెండో దశలో ప్రకాశం బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఆరు దశల్లో ఈ రిజర్వాయరులోకి నీటిని ఎత్తిపోస్తారు. దీనికి మరో ప్రత్యామ్నాయం 1.2 కిలోమీటర్ల పొడవున టన్నెల్‌ను నిర్మించడం. అయితే మొదటి ప్రణాళికతోనే సాంకేతికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. దీని అమలుకు కేవలం 15 గ్రామాలకు సహాయ, పునరావాసం కల్పిస్తే సరిపోతుంది. పైగా జాతీయ స్థాయిలో నిర్మించే రిజర్వాయర్లకు ఒక టీఎంసీకి సగటున రూ.100 కోట్ల నుంచి 200 కోట్లు వ్యయమవుతుంటే,బొల్లాపల్లి రిజర్వాయరుకు టీఎంసీకి సగటున రూ.30 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. పైగా దీని ద్వారా 230 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కూడా జరుగుతుంది. ఈ రిజర్వాయరు నిర్మాణానికి రూ.35,760 కోట్ల వ్యయమవుతుందని అంచనా. మూడు ఎత్తిపోతలతో మూడో దశ ఉంటుంది.

మూడో దశలో బొల్లాపల్లి నుంచి రోజుకు రెండు టీఎంసీలను బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించేందుకు 3 ఎత్తిపోతల పథకాలను నిర్మించాల్సి ఉంటుంది. ఆ రిజర్వాయరు నుంచి సిద్ధాపురం చెరువుకు నీటిని తీసుకెళ్లి.. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల టన్నెల్ మార్గం గుండా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌లోకి తరలించాలి. సిద్ధాపురం నుంచి నీటిని తోడిన తర్వాత.. కాలువ ద్వారా 200 మెగావాట్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీలుంది. అలాగే నల్లమల సాగర్ నుంచి వెలిగొండ ప్రాజెక్టుకు కూడా 0.5 టీఎంసీని తరలించాలి. మూడో దశ పూర్తి చేసేందుకు రూ.32,350 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మొత్తంగా మూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్లు వ్యయమవుతాయి. తెలంగాణ విశ్రాంత ఇంజనీర్లు ప్రతిపాదన కేవలం 25వేల కోట్లతోనే పూర్తవుతోంది అంతే కాదు ఉభయ రాష్ట్రాలలోని కోట్లాది మందికి తాగునీరు మూడు కోట్ల ఎకరాల సాగుభూమికి స్థిరీకరణ ఏర్పడే అవకాశం కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తే తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహబంధం పెరుగుతోంది. అలా కాదని మొండిగా ముందుకు పోతే పెన్నా బెసిన్‌కు 200 టిఎంసిలు ఆంధ్రప్రదేశ్ తరలిస్తున్నదని కృష్ణానదిలో తెలంగాణ అదనంగా 200 టిఎంసిలు నీటిని డిమాండ్ చేస్తుందని తెలంగాణ విశాంత ఇంజనీర్లు అప్పుడే గొంతు విప్పారు. ఒకవేళ తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల ప్రతిపాదన ఒప్పుకొంటే ఈ ప్రాజెక్టు నిర్మాణబాధ్యత కేంద్రప్రభుత్వం తీసుకొంటుంది. ఇరురాష్ట్రాలకు ఆర్థికభారం ఉండదు అంతే కాదు పాలమూరు రంగారెడ్డి,డిండి,కల్వకుర్తి, నెట్టెంపాడు ఎస్ఎల్‌బిసి, ఉదయసముద్రం ప్రాజెక్టులకు నికరనీటి జలాలు ఉపయోగించుకొనే అవకాశం గోదావరి జలాల ఎత్తిపోతలతో వస్తుంది.


# బనకచర్లను అడ్డుకోండి

>> అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని,జీడబ్ల్యూడీటీ 1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు.2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మిం చాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు,కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్‌కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందా లని, బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి తెలియజేశారు.బనకచర్ల విషయంలో ఏ నిబంధనలు పాటించని ఆంధ్రప్రదేశ్ వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నా మని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జల్‌శక్తి మంత్రితో సీఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్ల కుండా చూడాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్త పట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజేశారు.

జీడబ్ల్యూడీటీ1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తుంటే పోలవరం-బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి-నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్ల తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామని సీఎం కేంద్ర మంత్రి పాటిల్ కు తెలియజేశారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేంద్ర మంత్రికి సీఎం స్పష్టం చేశారు.

**మేం 1500 టీఎంసీలకు వాడుకునేలా అనుమతులు ఇవ్వండి**

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేప్టటే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి,సమ్మక్క సారక్క,తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు.సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు.సమావేశంలో ఎంపీలు మల్లు రవి,రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పి.జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య మంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ అయిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్ తదితరులు

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

### కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్19:** హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు.రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్-౨ సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పి.జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.104 కోట్లతో వ్యవసాయ యాంత్రీకరణ

### ఎరువుల కొరత లేకుండా చూడాలి: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.104 కోట్ల వ్యయంతో వ్యవసాయ యాంత్రికరణను పథకాన్ని అమలు చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వెంటనే ప్రారంభించేల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, వాటిని సబ్సిడిపై అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కేటాయింపులు జరిపి, సరఫరా చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ పథకంలో ముఖ్యంగా సన్న, చిన్న కారు మరియు మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నమో డ్రోన్ దీదీ కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళసంఘాలకు అందించాల్సిందిగా సూచించారు. ఇక ఈ వానాకాలం సీజన్‌కు గాను నెల వారిగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఎరువులు, రాష్ట్రానికి సరఫరా సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలతో నిత్యం సంప్రదింపులు జరపాలని చెప్పారు. రాష్ట్రంలో ఎరువు కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని, అదే సమయంలో రాష్ట్రానికి కేటాయించిన ఎరువులు సకాలంలో వచ్చేటట్లు అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జులై వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతం ఆగస్టు మాసానికి సరిపడా ఎరువులను తెప్పించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నడూ లేని విధంగా ఈ సారి 1,55,257 టన్నుల జొన్నలను మార్క్ ఫెడ్ ద్వారా సేకరించడం జరిగిందన్నారు.

## బనకచర్లకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా?

>> అనే భగవంతుడికి రేవంత్ అనే భక్తుడికి మధ్య ఉన్న అంబికా దర్బార్ బత్తి ఆదిత్యనాథ్ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 3000 టీఎంసీ అనే బ్రహ్మ పదార్థం కేసీఆర్ కనిపెట్టిండు అంటడు. గోదావరి నుండి ఎన్ని నీళ్లు సముద్రంలో కలుస్తాయని 60 ఏళ్ల లెక్కలు సీడబ్ల్యూసీ చెప్పింది. దాని ప్రకారం ప్రతి ఏటా కనీసం 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. ఇదే విషయాన్ని కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో చెప్పారు. దీనికి కూడా రేవంత్ రెడ్డి వక్రీకరించారు అని చెప్పారు. బనకచర్ల ముచ్చట ఇక్కడ లేదు. తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు పది అబద్దాలు మాట్లాడడం రేవంత్ రెడ్డి అలవాటు. అపెక్స్ కమిటీ సమావేశం మినిట్స్‌లో బనకచర్లకు నీళ్ల తీసుకువెళ్లాలని ఎక్కడా లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు కృష్ణా నదిలో రెండు రాష్ట్రాలకు నీటి వినియోగం 1000 టీఎంసీలకు మించడం లేదు. ప్రతి సంవత్సరం 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని సెంట్రల్ వాటర్ కమిషన్ చెప్తుంది. ఈ నీటిని రెండు రాష్ట్రాలు ఎలా ఉపయోగించుకోవాలి అనే అంశంపై ఇద్దరు కూర్చొని మాట్లాడుకోవాలని రెండు రాష్ట్రాలకు లాభం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. అదే పేజీలో చెప్పిన ఇంకో అంశాన్ని మాత్రం కావాలని రేవంత్ చదవలేదు.

చాలా స్పష్టంగా గోదావరి, కృష్ణా నదుల అనుసంధాన విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లో ముందుకు పోకూడదని ఒకవేళ వెళ్తే తెలంగాణ అందుకు అంగీకరించదు అని చెప్పారు. దీని మాత్రం దాచి పెట్టిండు. 1000 టీఎంసీలు ఇచ్చి ఎన్నైనా పట్టుకోపో అంటున్నాడు. తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ల గురించి. ఎంతోమంది ఆత్మబలి దానాలు చేసుకున్నారు. నువ్వు ఉద్యమం చేయలేదు కాబట్టి నీకు తెలియదు. అడ్డదారిలో పార్టీలు మారుకుంటూ అధికారంలోకి వచ్చావు తప్ప ఉద్యమం చేయలేదు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ ఎన్నడూ అగ్రి చేయలేదు అసలు బనకచర్ల అనే చర్చ లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. జగన్‌తో ఏమి మాట్లాడామో ఎజెండా ఉంటే బయట పెట్టు. రెండు రాష్ట్రాలకు నదీజలాల గురించి కేసీఆర్ మాట్లాడారు. వాస్తవానికి ఆ ప్రస్తావన ముందుకు పోలేదు. జగన్ అంగీకరించలేదు. నది మార్గంగా నీళ్ల తేవాలని అప్పుడు అనుకున్నారు. దానివల్ల నాగార్జునసాగర్, శ్రీశైలం పరిధిలో నీళ్ల వస్తాయి అని. కానీ ఈరోజు వీళ్ల చేస్తున్నది నది మార్గంగా కాకుండా, తెలంగాణ టచ్ కాకుండా 200 టీఎంసీలు తన్నుకుపోతున్నారు. దీని ఆపాల్సిన బాధ్యత మన మీద లేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# మూడు రాష్ట్రాల్లో ప్రధాని మోడీ పర్యటన

**న్యూఢిల్లీ, జూన్ 19:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈనెల 20, 21 తేదీల్లో బిజీగా ఉండనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో ఆయన పర్యటిస్తారని ప్రధాని కార్యాలయం వెల్లడించింది.




ఈనెల 20న మోడీ బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడ పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇది కీలక దశగా భావిస్తున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో జరిగే కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో ఈనెల 21న యోగా దినోత్సవం జరగనుంది. ఇది 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కావడం విశేషం. ప్రధాని మోడీ స్వయంగా ఇందులో పాల్గొం టున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో ప్రజల మధ్యలో మోడీ యోగా చేస్తారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం మోడీ ప్రసంగించనున్నారు. ఈ యోగా వేడుకకు 5 లక్షల మందికి పైగా హాజరవుతారు. దేశవ్యాప్తంగా 3.5 లక్షల ప్రాంతాల్లో యోగా వేడుకలు జరుగుతాయి. 2015లో జూన్ 21వ తేదీని యోగా దినంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మోడీ యోగా వేడుకల్లో పాల్గొంటున్నారు. ఢిల్లీ, ఛండీఘడ్, మైసూరు వంటి ప్రదేశాల్లోనూ పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత లక్ష్యంగా చర్యలు

## హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్

## త్వరలో స్కూళ్ల సమీపంలో డ్రోన్ నిఘా

## జాయింట్ పోలీస్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్




సభలో ప్రసంగిస్తున్న సి.వి.ఆనంద్, హరిచందన, గోపాల్, రమేష్, రోహిణి, జోయెల్‌డేవిస్, మునిశేఖర్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 19, ప్రభాతవార్త :** 2025-26 నూతన విద్యా సంవత్సరానికిగాను వేసవి శెలవుల తర్వాత పునఃప్రారంభమైన హైద రాబాద్ నగరంలోని పాఠశాలల విద్యార్థుల భద్రత, శ్రేయస్సును బలోపేతం చేసే దిశగా పూర్తి చర్యలు చేపడుతున్నామని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్, డీజి సి.వి. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు రవీంద్రభారతిలో గురువారం ఆయా పాఠశాలల యాజమాన్యాలు, డ్రైవర్లలో నిర్వహించిన కీలక సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాఠశాలలు పునఃప్రారంభించినప్పుడు సాధారణంగా తలెత్తే భద్రతా సమస్యలను ముందుగానే పరిష్కరించాలన్నారు. గత 3 సంవత్సరాల్లో నిర్లక్ష్యం కారణంగా 8మంది విద్యార్థులు మరణించారని ఆవేదన వ్యక్తపరిచారు. విద్యార్థులు పాఠశాల బస్సుల్లోనే ప్రయాణించడం శ్రేయస్కరమని, యాజమాన్యం అన్నిరకాల భద్రతా చర్యలను అమలుచేయాలని స్పష్టం చేశారు. పాఠశాల ప్రాంగణానికి 200మీటర్ల పరిధిలో భద్రతా లోపాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో సీసీటీవి కెమెరాలను ఏర్పాటుచేసుకుని, భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. విద్యార్థులు ఎక్కే దిగేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఓవర్‌లోడ్ ఆటోల్లో పిల్లలను పంపరాదని స్పష్టం చేశారు. పాఠశాలల ప్రాంగణాల ముందు సైన్‌బోర్డులుండాలని చెప్పారు. ప్రధాన ప్రాంతాల్లో పాఠశాల సమూహాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రవాణా, ట్రాఫిక్ సిబ్బందితో ప్రత్యేక సమన్వయ బృందాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

పాఠశాలలకు సమీపంలో పాన్‌షాపులు, జ్యూస్ సెంటర్లు, మాదక ద్రవ్యాల అమ్మకాలు ఆందోళనకరంగా పరిణమించాయని, ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను నిషేధించాలని పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డి.జోయెల్ డేవిస్ మాట్లాడుతూ నగరంలో నానాటికీ పెరిగిపోతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది అందుబాటులో లేరన్నారు. త్వరలో పాఠశాలల సమీపంలో ప్రత్యేక డ్రోన్ నిఘా ప్రవేశపెడతామని తెలిపారు. పాఠశాలల సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ యాజమాన్యాలదేనని, అందుకు తమ సొంత భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి సిగ్నల్స్‌తోపాటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సమయాలను మార్చడం గురించి విద్యార్థుల్లో అవగాహన పెంచాలని సిఫార్సు చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే 25ఏళ్లు నిండేవరకు వాహనాల రిజిస్ట్రేషను రద్దు, డ్రైవింగ్ లైసెన్సు తిరస్కరించబడతాయని హెచ్చరిం చారు. పాఠశాల పిల్లలు రోడ్డుప్రమా దాలను నివారించడానికి ఒక ప్రామాణిక ఆపరేటింగ్ విధానం రూపొందించాల్సిన తక్షణ అవసరాన్ని హైదరాబాద్ కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ దాసరి హరిచందన నొక్కి వక్కాణించారు. పాఠశాలలు జీఓఎంఎస్ నంబరు 187(07-07-2017)ను ఖచ్చితంగా పాటించాలని, 6-14 సంవత్సరాల పిల్లలకు విద్యాహక్కు చట్టాన్ని సమర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ గోపాల్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్, ఆర్టీసి ఇడి మునిశేఖర్, సికిం కంటోన్మెంట్ బోర్డు డి.మధుకర్‌నాయక్, ప్రముఖులు రాజశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆర్.రోహిణి, లింగయ్య, ట్రాఫిక్ విభాగం రాహుల్ హెగ్డే, ఎస్.అశోక్‌కుమార్, ఆర్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో పాఠశాలలకు వెళ్లివచ్చే సమయంలో విద్యార్థుల భద్రత మెరుగుకై ప్రధాన దృష్టి, పాఠశాలల చుట్టూ ట్రాఫిక్ నిర్వహణ, సురక్షితమైన రవాణా వ్యవస్థలు, అన్ని వాటాదారుల్లో రహదారి భద్రతా అవగాహన పెంచడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. పాఠశాల పిల్లలు పాల్గొనే రోడ్డుప్రమాదాలను నివారించడానికి అవగాహన కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. చివరిగా పాఠశాల విద్యార్థుల భద్రతా విషయంలో హైదరాబాద్ నగరం ఆదర్శనగరంగా మార్చడంలో అన్ని పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, రవాణా వాటాదారులు చేతులు కలపాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పిలుపునిచ్చారు.




# హత్యకు గురైన మంత్రి ఇంట్లో ఐటి దాడులు, సోదాలు!

**భువనేశ్వర్, జూన్ 19:** 2023లో హత్యకు గురైన ఒడిశా మాజీ మంత్రి , సీనియర్ బీజేపీ నేత నబా కిశోర్ దాస్‌కు సంబంధించిన అక్రమార్జన కేసులో గురువారం ఆదాయం పన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 ప్రదేశాల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇవాళ ఉదయం 5 గంటలకు ఐటీ సెర్చ్ ఆపరేషన్ మొదలైంది. జార్సుగూడ, సంబల్‌పూర్, న్యూఢిల్లీల్లో ఉన్న దివంగత మాజీ మంత్రి నివాసాలతో పాటు బంధువులు, అనుబంధ వ్యాపారవేత్తల ఇండ్లల్లోనూ ఐటీ శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. భువనేశ్వర్‌లో ఉన్న మాజీ మంత్రి ఇళ్లు మాత్రం ప్రస్తుతం మూసివేశారు. నబా కిశోర్ దాస్‌తో లింకున్న హోటల్ నికీ, ఇతర ప్రాపర్టీలపై కూడా ఐటీ సెర్చ్ జరుగుతోంది. పన్ను ఎగవేతతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయి. మాజీ మంత్రి బొగ్గు, యాష్ ట్రాన్స్‌పోర్టేషన్ బిజినెస్‌లో ఉండేవారు. సుమారు 180 మంది ఐటీ ఆఫీసర్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సుమారు 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 60 వాహనాలు, సైంటిఫిక్ అనాలిస్ బృందం కూడా వారితో ఉన్నాయి. మాజీ మంత్రి కిశోర్ దాస్ కుమార్తె, జార్సుగూడ మాజీ ఎమ్మెల్యే దీపాలీ దాస్ ప్రస్తుతం ఆచూకీ లేరు. ఆమె ఆఫీసు మూసి ఉందారు. గతంలో దాస్ కుటుంబానికి ఐటీ నోటీసులు ఇచ్చినా..వాళ్లు సరైన రిప్లై ఇవ్వలేదు. దీంతో ఈసారి ఐటీశాఖ భారీ స్థాయిలో రెయిడ్స్ మొదలు పెట్టింది. 2023 జనవరి 29వ తేదీన ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న నబా కిశోర్‌దాస్‌ను అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తన రివాల్వర్‌తో కాల్చి చంపాడు.

# సంధ్యా కన్వెన్షన్ శ్రీధర్‌రావుపై కేసు నమోదు

## ప్రాణహాని ఉందంటూ గచ్చిబౌలి పిఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), జూన్ 19, ప్రభాతవార్త:** సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదయింది. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌రావుతోపాటు వెంకటేష్ మరో ముగ్గురి అనుచరులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ యాక్ట్ 115(2), 126(2), 324(5), 125 ఆర్/డబ్ల్యూ 3(5) ప్రకారం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. బుధవారం ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డుమార్కింగ్ నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చిన బాధితుడు కుశీచంద్ వద్దేపైకి హైడ్రా పోలీసుల సమక్షంలో అత్యంత వేగంగా కారు నడిపి తనను ఢీకొట్టబోయాడంటూ శ్రీధర్‌రావు అనుచరుడు వెంకటేష్‌పై కుశీచంద్ ఫిర్యాదు చేశాడు. అక్కడి నుండి తిరిగి వెళ్లిపోతుండగా రోడ్డుపై కేటిఎమ్ బైక్ నెంబర్ టీఎస్ 36.1085 వాహనంపై వచ్చి తన కారుపై రాళ్ల దాడి చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, అతని అనుచరుడైన వెంకటేష్ ఆదేశాల ప్రకారంగా తనపై దాడి చేశారని, సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు నుండి తనకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు కుశీచంద్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



మంద కృష్ణమాదిగ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

# దివ్యాంగుల హక్కుల సాధన కోసం పోరాడుతాం

## సమాజంపై బాధ్యతను పెంచిన పద్మశ్రీ

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద క ష్ణమాదిగ

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), జూన్ 19, ప్రభాతవార్త:** దివ్యాంగుల హక్కుల సాధన కోసం పోరాడుతామని, పద్మశ్రీ అవార్డు సమాజం పట్ల బాధ్యతను మరింత పెంచిందని ఎమ్మార్పీఎస్, విహెచ్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. పీడితప్రజల హక్కుల కోసం ఉద్యమ ప్రయాణం కొనసాగిస్తామన్నారు. గురువారం నాగోల్‌లో మంద కృష్ణ మాదిగకు దివ్యాంగులు సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ దంపతులకు భారీ పూలమాలవేసి శాలువాతో సత్కరించి, పట్టువస్త్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునేల మీద నిస్సహాయక స్థితిలో ఉన్న దివ్యాంగ సమాజాన్ని ఏకంచేసి పాలకుల మెడలు వంచి అనేక హక్కులు సాధించుకున్న చరిత్ర ఎమ్మార్పీఎస్, విహెచ్పీఎస్‌లకు ఉందని, భవిష్యత్‌లో దివ్యాంగులకు రావలసిన పెన్షన్లు, అన్నిరకాల హక్కులతోపాటు రాజకీయ భాగస్వామ్యం సాధించేంతవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్పీపీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాలరావు, వైస్‌చైర్మన్ అంధే రాంబాబు, జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశి, జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# నేడు హైదరాబాద్‌లో యోగా దినోత్సవం

## ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## విశాఖ యోగా వేడుకల్లో పాల్గొననున్న ప్రధాని మోడీ

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక లను ఘనంగా నిర్వహించ బోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొ న్నారు. గురువారం ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్న యోగా వేడుకల ఏర్పాట్లను కేంద్ర మంత్రి పరిశీలించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడిన మాట్లాడారు. జూన్ 20వ తేదీన ఎల్‌బి స్టేడియంలో నిర్వహించే యోగా వేడుకలకు సంబంధించి 24 గంటల ముందు కౌంట్ డౌన్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో ప్రముఖ యోగా సంస్థలు, విద్యా సంస్థలు, సామాజిక సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ,ఎంపీలు డా.కె.లక్ష్మణ్, కృష్ణయ్య, ఈటల రాజేందర్, డికె అరుణ, రఘునందన్ రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొం టారని తెలిపారు. స్టూడెంట్ ఆర్గనైజేషన్స్, ఎన్‌జిఓలు, డిఫెన్స్, పారామిలిటరీ అధికారులు పాల్గొన నున్నారని వివరించారు. యోగాకు సంబంధించిన ఆర్గనైజేషన్స్ అసోసి యేషన్ సభ్యులు, ప్రముఖ సినీ నటి ఖుష్బూ, సిని ప్రముఖులు మీనాక్షి చౌదరి, సాయి ధరమ్ తేజ్ పాల్గొంటున్నారని, మన దేశంలోనే కాకుండా సుమారు 200 దేశాలకుపైగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని యోగా సంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి మంత్రిత్వ శాఖల తరఫున 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో యోగా వేడుకల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇందులో లక్షలాది మంది ప్రజలు భాగస్వాములు కాబోతున్నారని, హైదరాబాద్‌లో గత ఐదారు సంవత్సరాల నుంచి పెద్దఎత్తున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా యోగా జెఏసి అనే సంస్థ కీలకపాత్ర పోషిస్తూ యోగా వేడుకల కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎల్‌బి స్టేడియంలో జరిగే యోగా వేడుకల్లో యోగా శిక్షకులం దరూ హాజరుకావాలని కోరారు. యోగా ద్వారా మన ఆరోగ్యానికి, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం. యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా దోహదమవుతుందన్నారు. అప్పుడే ఆ వ్యక్తులు సమాజానికి, దేశానికి ఉపయో గపడుతారు. 2047లో భారత్ వికసిత్ భారత్‌గా అభివృద్ధి చెందాలంటే ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలి. అప్పుడు వికసిత్ భారత్ సంకల్పాన్ని, లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు.



# 24 నుంచి పాలిసెట్-2025 కౌన్సెలింగ్

## 26 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

## 114 కాలేజీల్లో 28,590 సీట్లు అందుబాటులో..

## సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన


**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌ను ఈ నెల 24 నుంచి ప్రారంభించనున్నారు. 24 నుంచి 28 వరకు పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 26 నుంచి 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపట్ట నున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్య కమిషనర్, పాలీసెట్-2025 అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,280 సీట్లు అందుబాటులో ఉండగా.. 55 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,310 సీట్లు ఉన్నాయి. మొత్తం 114 పాలిటెక్నిక్ కాలేజీల్లో 28,590 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా కేసముద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రారంభం కానుండగా అందులో నాలుగు కోర్సుల్లో 240 సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే పటాన్‌చెర్వులో మరో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మూడు కోర్సుల్లో 180 సీట్లను అందుబాటులోకి తెచ్చారు. గత ఏడాది 57 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా..ఈ ఏడాది రెండు కాలేజీలు మూతపడటంతో 55 కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2025 ఫలితాల్లో 84.33 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. అందులో బాలికలు 88.54 శాతం ఉండగా.. బాలురు 80.69 శాతం అర్హత సాధించారు. 276 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించగా.. పరీక్షకి 98,858 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 53,085మంది బాలురు హాజరుకాగా.. అందులో 42,836 మంది (80.69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 45,773 మంది హాజరు కాగా వారిలో 40,528 మంది (88.54శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 26 నుంచి జులై 1 వరకు విద్యార్థులు తమకు ఏ కాలేజీలో సీటు కావాలో పేర్కొంటూ వెబ్ ఆప్షన్లను ఇవ్వాల్సి ఉంటుంది. జులై 4లోపు సీట్ల కేటాయింపును చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు జులై 4 నుంచి 6 వరకు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించారు. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను జులై 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. జులై 11న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 11, 12 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. వారికి జులై 15లోపు సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన వారు జులై 15, 16 తేదీల్లో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. జులై 15 నుంచి 17 వరకు సీటు పొందిన కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. జులై 18 లోపు కాలేజీల్లో జాయినింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. జులై 15 నుంచి అకడమిక్ సెషన్‌ను ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు. జులై 18 నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులను ప్రారంభించనున్నారు. జులై 23న స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషనన వెలువడనుంది. జులై 30లోపుగా స్పాట్ అడ్మిషన్లన ప్రక్రియను పూర్తి చేయాలని సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన షెడ్యూల్‌లో స్పష్టం చేశారు.

# ఆడపిల్లలపై కామెంట్లు చేస్తే క్రిమినల్ చర్యలు

## తాజాగా ఒక్కరోజే 15 మంది పాత నేరగాళ్ల అరెస్ట్

## టిజిసిఎస్బీ డైరెక్టర్ శిఖాగోయెల్ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** బాలికలపై అసభ్య పదజాలంతో దూషణ.. ఆన్‌లైనే కదా అని నోటికొచ్చినట్లు బూతు కామెంట్లు..ఇక చైల్డ్‌పోర్న్ ఫోటోలు మార్ఫింగ్ సైతం పాల్పడినా...క్రిమినల్ చర్యలు...ఊచలు లెక్కపెట్టాల్సిందే.. ఆడపిల్లల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతో వేధింపులకు పాల్పడిన పోకిరిలను పోలీసులు వెంటపడి వెతికిపట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరంతర నిఘా, కామెంట్ల పరిశీలన, ఫిర్యాదులతో నిందితులను సైతం అరెస్టులు చేస్తున్నారు. తాజాగా ఆన్‌లైన్ వేధింపులపై ఒక్కరోజే పదిహేను మంది పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) డీజీ శిఖాగోయెల్ తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క రోజు ప్రత్యేక ఆపరేషన్‌లో యాప్‌లో 57 మందిపై ఫిర్యాదులు రాగా రాష్ట్రంలోని హైదరాబాద్, జగద్గి రిగుట్ట, యాదగిరిగుట్ట, కరీంనగర్, వరంగల్, జగి త్యాల జిల్లాల్లో 15మంది పాత నేరస్తులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో 90శాతం బాలికలు వేధింపులకు గురవుతున్నారన్నారు. నాల్గునెలల్లో 294 ఫిర్యాదుల్లో 110మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. రెండేళ్ల క్రితం 37మందిని రిమాండ్ చేశామని ఆమె పేర్కొన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ) సైబర్ సెక్యూరిటి పోర్టల్, కేసు మానిటరింగ్ టూల్స్ అనుసంధానంగా సోషల్ మీడియా వేదికగా లైంగిక సమాచార కలాపాలపై నిఘా పెడుతుందన్నారు.డీప్ వెబ్, డార్క్ వెబ్ (ప్రైవేటు డేటా, చీకటి కలాపాలు) సమాచారాలను సైబర్ పెట్రోలింగ్ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలనలు చేపడుతోంది. ఐపీ అడ్రస్‌లు, ఫోన్ డేటా, ఆన్‌లైన్ వ్యవహారాలతో సర్చ్ చేసి నిందితులను గుర్తిస్తున్నామని వెల్లడించారు. నిందితులందరూ 19 నుంచి 50ఏళ్లలోపే వారేనని ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, విద్యార్థులు ఉన్నారని తెలిపారు.పిల్లల ఆన్‌లైన్ విషయంలో తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. కేసుల విషయంలో చొరవ చూపిన ఆయా శాఖల ఉన్నతస్థాయి అధికారులను ఆమె ఘనంగా అభినందించారు. ఐపీఎస్ అధికారులు హర్షవర్ధన్, డీఎస్పీలు ఎన్. వాసు, సూర్యప్రకాశ్, కె.వి.ఎం ప్రసాద్,వై. వెంకటేశ్వర్లు,నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సైబర్‌సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖాగోయెల్

# దోస్త్ రెండోవిడత సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంపు

## 25 వరకు అవకాశం..

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 రెండో విడతలో సీట్లు పొందిన వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి గడువును పొడిగించారు. ఈనెల 25 వరకు రెండో విడతలో సీట్లు పొందిన వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించారు. అలాగే మూడో విడతలో రిజిస్ట్రేషన్లు ఈ నెల 19 వరకు అవకాశం ఇవ్వగా దానిని కాస్త ఈ నెల 25 వరకు పొడిగించినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లకు 25 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసి వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 28న సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఫేజ్-3లో సీట్లు పొందిన వారు ఈ నెల 28 నుంచి 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఫేజ్-1, 2లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారు ఈ నెల 30లోపు కాలేజీల్లో చేరాలని.. అలాగే ఫేజ్-3లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారు జులై 1లోపుగా కాలేజీల్లో చేరాలని సూచించారు. జూన్ 30 సెమిస్టర్-1 క్లాసులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 35,952 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు రెండో విడతలోని వారు 46,883 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 43,568 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 3315 మందికి సీట్ల కేటాయింపు చేయలేదు.



# ముందు మీరు ఉక్రెయిన్‌తో సంధి చేసుకోండి

## పుతిన్ వ్యాఖ్యలపై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు

**వాషింగ్టన్, జూన్ 19:** ఇరాన్ ఇజ్రాయెల్‌మధ్య తారస్థాయికి చేరిన ఉద్రిక్తతలను తగ్గించేందుకు రెండుదేశాలమధ్య మధ్యవర్తిత్వంచేసేందుకు తాను సిద్ధమేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ పేర్కొనడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌జాన్‌ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పుతిన్ మధ్యవర్తిత్వ ప్రకటనపై ట్రంప్‌ను మీడియా వేసినప్రశ్నలకు మాట్లాడుతూ తాను పుతిన్‌తో మాట్లాడానని, ఇరాన్ ఇజ్రాయెల్‌మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి ఆయన ముందుకొచ్చారు.నేను ఆయనతో ఒకే మాట చెప్పాను. నాకు మీరు ఓసాయం చేయండి. ఉక్రెయిన్‌తో జరుగుతున్న సంఘర్షణపై ముందు మధ్యవర్తిత్వంచేసుకోండి. ఆ తర్వాత దీనిగురించి ఆలోచిద్దాం అని చెప్పినట్లు ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయొతుల్లా ఖమేనీని హతమార్చడంపై స్పందించేందుకు పుతిన్ నిరాకరించారు. ఇజ్రాయెల్‌తో యుద్ధంనేపథ్యంలో రష్యానుంచి ఇరాన్ ఏమన్నా సాయం కోరిందా అన్న ప్రశ్నకు పతిన్ మాట్లాడుతూ తమ స్నేహితులు ఇప్పటివరకూ ఎలాంటి సాయం కోరలేదన్నారు. ఇరాన్ ఇజ్రాయెల్‌మధ్య జరిగే యుద్ధంలో అమెరికా జోక్యంచేసుకుంటుంటే తీవ్రస్థాయి పరిణామాలుంటాయని రష్యా ఉప విదేశాంగమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌కు సైనిక సాయం చేయడం లేదా దాడుల్లో భాగం అయితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుందని హెచ్చరించారు.

# ఇంగ్లండ్‌కు వెళ్లిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్1 9:** ఇంగ్లండ్‌లోని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆధ్వర్యం లో ఈ నెల 20,21 తేదీల్లో జరిగే సదస్సులో కేటీఆర్ పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆయన ఇంగ్లండ్‌కు వెళ్లారు. ప్రతిష్టా త్మకంగా నిర్వహించనున్న ఈ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్‌లో భారత అభివృ ద్ధికి అత్యాధునిక సాంకేతికతలు (ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఫర్ డెవలప్ మెంట్ ఇన్ ఇండియా) అనే ప్రధాన అంశంపై చర్చ జరగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేం దుకు తీసుకున్న చర్యలు, అభివృద్ధి దిశగా అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, ప్రజా సేవలను మెరుగుపరచడంలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై ఆయన ప్రసంగించనున్నారు

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G లిమిటెడ్
ఆపరేషన్ : సూర్యాపేట సర్కిల్
బహిరంగ టెండర్ ప్రకటన సం. 01/2025-26 (పొడిగింపు-I)
సూర్యాపేట సర్కిల్‌లో వివిధ సివిల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు కోరబడుతున్నవి. బహిరంగ - టెండర్‌కు షెడ్యూల్ తేదీలు స్పెసిఫికేషన్ సం.01/25-26, 03/25-26 మరియు 04/25-26 యొక్క టెండర్ నోటీస్ 0-01/2025-26 ఆఫ్ SE/OP/సూర్యాపేట. తేదీలు ఈ క్రింది విధంగా: 1. బిడ్ డౌన్‌లోడ్ 20.06.2025 15.00 గం. నుండి ప్రారంభం. 2. బిడ్ హార్డ్ కాపీలు DD's మరియు BG's తోసహా దాఖలుకు చివరి తేదీ మరియు సమయం: 27.06.2025 15.00 గం. వరకు. 3. బిడ్ తెరచు తేదీ, సమయం: 27.06.2025 16.00 గం. వద్ద. వివరాలు www.tgsouthernpower.com వద్ద అందుబాటులో ఉన్నాయి. ఫోన్ నం.8712472748. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.3793-PP/CL/Advt/1/2025-26, తేది: 19.06.2025

వార్త

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

-రామకృష్ణ పరమహంస

# మాటలతో ధరలు తగ్గవు!

అదుపు లేకుండా పెరిగిన, పెరుగుతున్న ధరలకు ఉక్కుపాదం మోపుతాం, నల్లబజారు వ్యాపారులపై ఎస్మాచట్టాన్ని ప్రయోగిస్తామంటూ పాలకులు చేస్తున్న హెచ్చరికలు, ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ధరలు పెరగడాన్ని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమంగా నిల్వలు చేసేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదరించడం ఒక రివాజుగా మారిపోయింది. అయితే ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్‌మార్కెటీరులను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా అక్రమార్కులు గడగడలాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ రానురాను పరిస్థితులు మారిపోతున్నాయి. దళారుల ఆధిపత్యమే కొనసాగే దుర్భరస్థితి రోజురోజుకూ దాపురించింది. అందుకే పాలకుల అరుపులు తప్ప చర్యలు నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. హెచ్చరికలు తప్ప ఆచరణ లేకుండాపోతున్నది. గతంలో ఉన్న భయభక్తులు నేడు కన్పించడం లేదు. రాజకీయ ఒత్తిడితోనో లేక చట్టాల్లో ఉన్న లొసుగులతోనో ఇవేమీకాకపోతే లంచాలు ఇచ్చి అయినా కేసుల నుంచి బయటపడవచ్చునని ధీమా కొందరు దళారులలో రానురాను పెరిగిపోతున్నది. జరుగుతున్న పరిస్థితులు కూడా ఈ అనుమానాలకుబలం చేకూరుస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు, అక్రమ వ్యాపారాలతో మమేకం కావడం, కొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకులే వారి బంధుమిత్రుల పేరుతో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇదేమీ కొత్తకాకపోయినా ఈ సంప్రదాయం రానురాను పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. రాజకీయాన్ని వ్యాపారంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత వరకు ఉందని చెప్పక తప్పదు. పెట్టుబడి, సంపాదన, తిరిగి పెట్టుబడిగా రాజకీయం ఒక విషవలయంగా మారింది. దీంతో కొందరు బడా వ్యాపారులతో మరికొందరు రాజకీయ నాయకులకు అవినాభావ సంబంధాలు ఏర్పడుతున్నాయి. కావడి ఎన్ని వంకలు తిరిగినా చివరికి ఇంటికి చేరాలన్నట్టే ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేసులు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా, ఉక్కుపాదం మోపుతామని ప్రకటించినా ఏమీ చేయలేరనే ధీమా ఈ అక్రమ వ్యాపారుల్లో పెరిగిపోతున్నది. కృత్రిమ కొరత సృష్టించడం, ఇష్టానుసారంగా పెంచడం పరిపాటి అయిపోయింది. ప్రపంచీకరణతోపాటు మార్కెట్ మాయాజాలం కొత్తగా వచ్చిన జీఎస్టీ విధానం ఇవన్నీ కలిపి సామాన్యుడు అందుకోలేనంతగా ధరలు పెరిగిపోతున్నాయి. రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్నప్పుడు ధరలు పెరగడం అటుంచి తగ్గించే ప్రయత్నం చేస్తారు. రైతులందరూ తమ సరుకులను అమ్ముకున్న తర్వాత ధరలను పెంచే కార్యక్రమం ఆరంభమవుతుంది. కొరతను ఎంతగా సృష్టించగలిగితే అంతగా ధరలు పెంచుకోగలుగుతున్నారు. బియ్యం, నూనెలతోపాటు, ఉప్పు, పప్పు, ఒకటేమిటి ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులన్నీ పెరిగిపోయాయి. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో కానీ, దేశవ్యాప్తంగా కూడా గత మూడేళ్లుగా వరి పంట విస్తారంగా పండుతున్నది. దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. అయినాబియ్యం ధర ఆకాశాన్ని అంటుతుంది. రైతులు అమ్ముకునేటప్పుడు అన్ని కలిపినా క్వింటాలుకు మూడు నుంచి నాలుగువేల రూపాయల లోపునే ఉంటున్నాయి.కానీ మార్కెట్లో వచ్చేసరికి క్వింటాలుకు ఆరువేల రూపాయలకు దాటిపోతున్నది. ఇవేకాదు అన్ని వస్తువుల పరిస్థితి అలానే ఉంది. ఈ రోజు ఉన్న ధర రేపు ఉండడంలేదు. కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సాగువిస్తీర్ణం తగ్గుతున్న మాట వాస్తవం కావొచ్చు. కానీ పెరుగుతున్న ధరలకు పొంతన లేకుండాపోతున్నది. తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలను అదుపు చేసేందుకు కొన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితాలు కన్పించడం లేదు. మొత్తం మీద అటు కూరగాయాలు, అటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇందువల్ల ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తెలియని నల్లధనస్వాములకు ఇబ్బంది ఉండకపోవచ్చు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గతంలో కూడా ఈ నిత్యావసర వస్తువుల ధరలను అందుబాటులో ఉంచేందుకు అప్పటి పాలకులు గట్టి ప్రయత్నమే చేశారు. భారతదేశానికి సంబంధించి 1851లో తీవ్ర క్షామం ఏర్పడి సరుకులు లభించక, లభించినా కొనే ఆర్థిక స్తోమత లేకపోవడంతో అనేకమంది ఆకలితో అసువులు బాయడంతో ఆనాటి బ్రిటిష్‌ప్రభుత్వం కమిటీని వేసింది. ఆహార కొరతలకు మూలకారణమైన కరవులు ఎందుకు వస్తున్నాయి? వాటిని ఎలా నివారించాలి? ఆహార ధాన్యాలను సరసమైన ధరల్లో ప్రజలకు ఎలా ఉంచాలో తదితర అంశాలపై ఆ కమిటీ అధ్యయనం చేసి కొన్ని సూచనలు చేసింది. 1943లో ఏర్పడిన తీవ్ర క్షామంతో భారత్‌లో ఎన్నో లక్షల మంది అసువులు బాయగా ఒక్క బెంగాల్‌లోనే ముప్పైలక్షల మంది చనిపోయారు. అప్పటి నుండి పేదలను ఆదుకునేందుకు సరసమైన ధరలకు సరుకులు అందించే కార్యక్రమం కొనసాగుతూనేవున్నది. ఆ వ్యవస్థలు కూడా నిర్వీర్యమయ్యేవిధంగా రూలు పెరుగుతున్న ధరలు అద్దంపడుతున్నాయి. ఏదిఏమైనా పెరిగిన,పెరుగుతున్న ధరలను నియంత్రించడానికి త్రికరణశుద్ధిగా ప్రయత్నించాల్సిన అవసరం ఉంది.

సంపదకి అహంకారం తోడైతే, అన్ని దుర్గుణాలు వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.



గోల్డ్‌స్మిత్

హింసకు హేతువు అహంకారం, అహంకారమే స్వపరభేదాలను సృష్టిస్తుంది. ఈ విభేదాలు హింసకు దారితీస్తాయి.



శ్రీ రమణ మహర్షి

# రైతు సమస్యలకు పరిష్కారం లభిస్తుందా?

**గత ప్రభుత్వం రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్‌కు మంగళంపాడి రైతుల నుంచి కరెంట్ చార్జీలు వసూలు చేసే కుట్ర చేస్తున్నదని, తాము అధికారంలోకి వస్తేమీటర్లు తొలగిస్తామని చెప్పిన కూటమి, అధికారంలోకి వచ్చిన తర్వాత మీటర్ల తొలగింపు గురించి మాట్లాడటం లేదు. అందుకు కారణం మీటర్ల బిగింపు నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిది కావటం. ఏపీలోని ఉత్తరాంధ్రలో ప్రతిమండలంలో పారిశ్రామిక హబ్లుపేరుతో చంద్రబాబు ప్రభుత్వం వందలాది ఎకరాలు సేకరిస్తున్నది. ఇంకా రకరకాల పేర్లతో భూసేకరణ జరుగుతున్నది. అమరావతి రాజధాని కోసంగతంలో సేకరించిన 34వేల ఎకరాలుకాక కొత్తగా మరో 44వేలఎకరాల రైతుల భూములసేకరణకు సిద్ధమైయింది. రాష్ట్రప్రభుత్వాలేవీ రైతాంగ సమస్యలు పరిష్కరించే విధానాలు అమలు జరపలేదు. కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందా? ఈవాస్తవాన్ని రైతాంగం గ్రహించి తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం ఉద్యమించాలి.**

బొల్లిముంతసాంబశివరావు

ఆంధ్రప్రదేశ్లో ఖరీఫ్ సీజన్ మొదలైంది. సేద్యానికి కావాల్సిన సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, పంట రుణాలు, గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యాలు, ప్రకృతి సృష్టించే పంట నష్టాలు వంటి సమస్యలు ప్రతిసంవత్సరం రైతాంగం ఎదుర్కొంటూ ఉన్నారు. ఈ సమస్యలు పరిష్కారం వైపు ఏ ప్రభుత్వాలు చిత్తశుద్ధి లేకపోవటమేకాకుండా, రైతాంగ వ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్నాయి. ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చి జూన్ నాటికి ఏడాది అవుతుంది. ఈ కాలంలో కూటమి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలనే అమలు జరిపింది. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని, సంపదలు సృష్టించి పేదరికం తొలగిస్తానని చెప్పిన చంద్రబాబు, సంపద సృష్టి పక్కన పెట్టి పేదరిక నిర్మూలనకు 54 పథకాలను ముందుకు తెచ్చారు. రైతాంగానికి ప్రధానంగా కావాల్సింది సాగు నీరు. ప్రస్తుత ఏ ఆయకట్టు చివరి భూమివరకు నీరందించే పరిస్థితి లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. 100నుంచి 200 కోట్ల ఖర్చుతో పూర్తయ్యే పథకాలున్నాయి.వెలిగొండ, హంద్రీ నీవా, వంశధార, నాగావళి, గుంటూరు ఛానల్ పొడిగింపు ఇంకా చిన్న, మధ్యతరహా నీటి పథకాలను పూర్తి చేయలేదు. హంద్రీనీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టుల ప్రధాన కాల్వల్లో నీరు ప్రవహిస్తున్నా, పిల్ల కాలువల నిర్మాణం లేక రైతుల పొలాలకు నీరు చేరటం లేదు. అతి తక్కువ ఖర్చుతో వీటిని పూర్తి చేయకుండా 81వేలకోట్లతో గోదావరి బనకచర్ల పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రతిపాదించింది. 2014 నుంచి2019 వరకు పరిపాలించిన చంద్రబాబు ప్రభుత్వం తక్కువ ఖర్చుతో పూర్తి ప్రాజెక్టులు చేపట్టలేదు. కారణం పంట కాల్వలు తవ్వరాదు అన్నదే ప్రపంచ షరతు. ఆ భూముల్లో ఆరుతడి పంటలు, ఉద్యాన వన పంటలు పండిస్తూ, నీటిని విదేశీకంపెనీలకు మళ్లించాలన్నదే ప్రపంచబ్యాంకు ఉద్దేశం. దీనికి అనుగుణంగానే ఆనాటి టిడిపి ప్రభుత్వం 2015ఫిబ్రవరిలో జీవో22 తెచ్చింది. ఈజీవో ద్వారా ప్రపంచబ్యాంకు షరతులను చంద్రబాబు ప్రభుత్వం అమలు జరుపుతున్నతీరును అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో వెయ్యి దాకా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలుఉన్నాయి. వీటినిప్రభుత్వాలు పట్టించుకోకపోవటం వల్లచాలా పథకాలు మూతపడి ఉన్నాయి. 2021వరదల్లో అన్నమయ్య ప్రాజెక్టు ఆన తెగిపోయింది. దాన్ని ఇప్పటికీ తిరిగి నిర్మించలేదు. ఈ ప్రాజెక్ట్ 1981 ప్రారంభమై 2001 పూర్తి అయ్యింది. దీని కరకట్టను మట్టితో నిర్మించారు. కరకట్టను మట్టితో ఏర్పాటు చేయటం ఆనాటి ప్రభుత్వ తప్పిదం. 30 సంవత్సరాల క్రితం శ్రీశైలం ప్రాజెక్టుకు పడిన భారీ గుంతను ఇప్పటికీ పూడ్చలేదు. అప్పటి నుంచి సర్వేలు చేయటం, నివేదికలు ఇవ్వటం తప్ప పూడ్చివేత పనులు చేపట్టలేదు. 2005లో ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రకటించిన జలయజ్ఞంలో వేళ్లమీద లెక్కపెట్ట గల పథకాలు మాత్రమే పూర్తి అయ్యాయి. అందుకు కేటాయించిన నిధుల్లో కాంట్రాక్టర్ల, రాజకీయనాయకుల వద్దకే చేరాయి. పోలవరం ప్రాజెక్టు ప్రారంభించి 20 సంవత్సరాలు గడిచినా ఇంకా పూర్తికాలేదు. ప్రాజెక్టు కింద వేలాది ఎకరాలు కోల్పోయిన ఆదివాసులకు, గిరిజనేతరులకు ఈనాటికి నష్టపరిహారం అందలేదు. రైతులుగా బతికిన వారు కూలీలుగా వలసలు పోతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి టిడిపి, వైసీపీ నాయకత్వం లొంగిపోయింది. నేడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించటానికి అంగీకరించింది. ఫలితంగా అదనపు



సాగునీరు సాధ్యం కాదు. ప్రాజెక్టు వెడల అదనపు ప్రయోజనం ఉండదు. ప్రజల ముఖ్యంగా గిరిజనుల జీవితాలు మాత్రం నాశనమయ్యాయి. సేద్యానికి అవసరమైన విత్తనాల, ఎరువుల,పురుగుమందుల, డీజిల్‌ధరలు పెరగటంతో రైతాంగానికి సేద్యపుఖర్చు నిరంతరం పెరుగుతూ ఉండటంతో, పెట్టుబడి సమకూర్చుకోవటం రైతులకు సమస్యగామారింది. ముఖ్యంగా చిన్న,సన్నకారు రైతులకు పంటపెట్టుబడి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంస్థాగత రుణాలు 40 శాతం రైతులకు మించి అందటంలేదు. పావలావడ్డీకే పంట రుణాల పథకం చాలాకొద్దిమంది రైతులకే పరిమితం ఉంది. పంట రుణాలు అందించే చర్యలు తెలుసుకోకుండా గత వైసీపీ ప్రభుత్వ పంట ఖర్చుల కోసం ముందస్తు పెట్టుబడిపేరుతో కేంద్రప్రభుత్వం ఇచ్చే దాన్ని కలుపుకుని ప్రతి సంవత్సరం 13,500రూపాయలను మూడువిడతలగా రైతులకు ఇవ్వటం జరిగింది. 2024 ఎన్నికల్లో ప్రచారంలో కూటమి పార్టీలు ప్రతిసంవత్సరం 20 వేలు ఇస్తామని ప్రకటించాయి. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా రైతు భరోసా పథకం కింద రాష్ట్రప్రభుత్వం ఒక్క రూపాయి రైతుకు ఇవ్వలేదు. అంటే 2024-25 సంవత్సరం రైతు భరోసా పథకం డబ్బులు ఇకరైతులకు అందవు. ఈవిధంగా పథకాన్ని మాటలకే పరిమితం చేస్తున్నది. పంటల బీమా పథకానికి ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన వాటాను కూటమి ప్రభుత్వం చెల్లించకపోవటం వలన రైతాంగం పంట నష్టపరిహారం పొందలేని పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతులు దశాబ్దాలకాలంగా తీవ్రమైనసమస్యలు ఎదుర్కొంటున్నారు.కౌలు భారాలను భరిస్తూ అధికపెట్టుబడితో పంటలు పండించినా న్యాయమైన మద్దతు ధరలు లభించక నష్టపోతున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురౌతున్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ, పంటనష్ట పరిహారాలు, పంటల భీమా పరిహారం, సంస్థాగత రుణాలు అందటం లేదు. తాము అధికారంలోకి వస్తే పంటముందస్తు పెట్టుబడి కౌలు రైతులకు కూడా అందిస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. నేడు చంద్రబాబుప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కౌలురైతులకు వర్తించదని ప్రకటించి, కౌలు రైతులను వంచించింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందక అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో కౌలు రైతులసంఖ్య గణనీయంగాఉంది. తాము అధికారంలోకి వస్తే పంటలకు గిట్టుబాటుధర కల్పించి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేస్తామని, అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని కూటమిపార్టీలు చెప్పాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల స్థిరీకరణ నిధికి 300 కోట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం కేటాయించింది. కోట్లే తక్కువ అనుకుంటే,అంతకన్నా చాలాతక్కువ కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఈనిధితో ధరలస్థిరీకరణ ఎలా సాధ్యం. రైతులనుంచి ధాన్యం కొనుగోళ్లు చేసిన 48 గంటల్లో వారిబ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయటం జరుగుతుందని చెప్పినా ఆచరణలో అమలు జరగలేదు.చాలామంది రైతుల ఖాతాల్లోకి ఇప్పటికి డబ్బులు రాలేదు. రైతులనుంచి ధాన్యం కొనుగోళ్లు కూడా మొదట కొంతమేర జరిగి నేడు అసలు కొనుగోళ్లే ఆగిపోయాయి. ప్రభుత్వ సంస్థలు, మిల్లు యజమానులు కుమ్మక్కుతో అనేక వంకలు పెట్టి మద్దతు ధర తగ్గించటంలేదా అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. అలాంటి వారిపై ఎలాంటి చర్యలుతీసుకోలేదు.జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్‌కు మంగళంపాడి రైతుల నుంచి కరెంట్ చార్జీలు వసూలు చేసే కుట్ర చేస్తున్నదని, తాము అధికారంలోకి వస్తేమీటర్లు తొలగిస్తామని చెప్పిన కూటమి, అధికారంలోకి వచ్చిన తర్వాత మీటర్ల తొలగింపు గురించి మాట్లాడటంలేదు.అందుకు కారణం మీటర్ల బిగింపు నిర్ణయం మోడీప్రభుత్వానిది కావటం. ఏపీలోని ఉత్తరాంధ్రలో ప్రతిమండలంలో పారిశ్రామిక హబ్లపేరుతో చంద్రబాబు ప్రభుత్వం వందలాది ఎకరాలు సేకరిస్తున్నది. ఇంకా రకరకాల పేర్లతో భూసేకరణ జరుగుతున్నది. అమరావతి రాజధాని కోసంగతంలో సేకరించిన 34వేలఎకరాలుకాక కొత్తగా మరో 44వేలఎకరాల రైతుల భూముల సేకరణకు సిద్ధమైయింది. రాష్ట్రప్రభుత్వాలేవీ రైతాంగ సమస్యలు పరిష్కరించే విధానాలు అమలు జరపలేదు. కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందా? ఈవాస్తవాన్ని రైతాంగం గ్రహించి తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం ఉద్యమించాలి. ●

# శరణార్థులకూ మానవ హక్కులు కల్పించాలి

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణుకోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులులేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరేవారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందినవారు, ఏ దేశానికిచెందని వారు, అనేకఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు. శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతియేటా 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినం (వరల్డ్ రెఫ్యూజీ డే)"ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారిలో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2025 ప్రపంచ శరణార్థి దినం ఇతివృత్తంగా "శరణార్థులకు సంఘీభావం ఉందాం" అనేఅంశాన్ని నిర్ణయించారు. 2025 శరణార్థి వారం ఇతివృత్తంగా సూపర్ పవర్‌గా పౌర సమాజం" అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం,వారిజీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారిపట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి. భారత్‌లోకి శ్రీలంక, మయన్మార్, అఫ్ఘానిస్థాన్, చిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేలమంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది.శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మాహాజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్నిసార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడం జరుగుతోంది. 2022 వివరాల ప్రకారం భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రోహింగ్యాలు కూడా శరణార్థులుగా నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని,87శాతం శరణార్థులుఅల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి. ప్రపంచ శరణార్థి దినం వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించడం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటుపడదాం. ●

# ప్రజావాక్కు



### ఆన్‌లైన్ మోసాలను అరికట్టలేమా?

**ఆధునిక** డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లాటరీ సైబర్ మోసాలు ప్రస్తుత సమాజానికి పెను సవాలుగా మారాయి. ఇంటర్నెట్ విస్తృతి పెరిగిన కొద్దీ ఈ మోసగాళ్లు కొత్త రూపాలుసంతరించుకుంటూ, ప్రజలసొమ్మును దోచుకుంటున్నారు.మనుషుల మానసిక అత్యాశను అడ్డంపెట్టుకొని అమాయకులను నిండా ముంచుతున్న సైబర్ నేరగాళ్ల వారి మోసపూరిత పన్నాగాలతో ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. ఈ మధ్యనే తెలంగాణా రాష్ట్రంలో 54ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగిని కేరళ లాటరీ పేరుతో ఏకంగా 7.55లక్షల రూపాయలు పోగొట్టుకోవడం అనే సంఘటన ఆన్‌లైన్ లాటరీ మోసాల తీవ్రతను స్పష్టం చేస్తుంది. ముందుగా సైబర్‌నేరాల గురించి అంతఅవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండటం ప్రతీ ఒక్కరి భాధ్యత.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### మోటివేషన్ తరగతులను నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ గురుకులాలలో అదే గురుకులంలో పనిచేయుచున్న ఇద్దరు సీనియర్ లెక్చరర్స్‌ను నియమించి విద్యార్థులకు విజ్ఞానానికి సంబంధించిన, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలు, నోటిఫికేషన్ టైంటేబుల్, విద్యా అర్హతలు పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం,అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కనుక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలలో పనిచేయుచున్న ఇద్దరు సీనియర్‌లెక్చరర్‌లను విద్యార్థుల విద్య అభివృద్ధికి గాను, ఆర్థిక,సామాజిక, రాజకీయఅంశాలపై అవగాహన కలిగి ఉండడానికి గాను తరగతులను ఏర్పాటు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### చమురు నిల్వలపై ఆధిపత్యం

**పచ్చిమాసియా** మంటలు వచ్చేకాలంలోకూడా ఆరే సూచనలు కనిపించడం లేవు. ఒకవైపు అస్తిత్వ కాంక్ష, ఒకవైపు బలమైనశక్తిగా నిలవాలని ఇరాన్ కోరుకుంటుండగా మరోవైపు ఆధిపత్యం చేజారిపోతుంది అని అమెరికా లాంటి దేశాలు భయపడుతున్నాయి. వాటికి కావలసింది ఇరాన్ బలపడడం కాదు ఆదేశంలో ఉన్న ఖనిజ,చమురు నిల్వలపైన ఆధిపత్యం అని గమనించాలి.

- భారత అవినాష్, జనగామ

### అక్రమ మైనింగ్‌ను నిషేధించాలి

**తూర్పుకనుమలు** ఉత్తరాంధ్ర ప్రజలకు జీవనాధారంగా నిలుస్తున్న ప్రకృతి వరమని చెప్పవచ్చు. ఈ కనుమలు వేలాది సంవత్సరాలుగావాతావరణ సమతుల్యతను కాపాడుతూ,వర్షపు నీటిని నిల్వచేస్తూ, స్థానిక జనజీవనానికి ఆధారంగా నిలిచాయి. అయితే ప్రస్తుతం తూర్పు కనుమలు తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అక్రమమైనింగ్, రహదారి విస్తరణ పేరుతో జరిగే అట్టడుగు మార్పులు ప్రకృతివైపరీత్యాలకు దారితీస్తున్నాయి. అడవులను నరకడం వల్ల ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. వర్షాల ప్రమాణం తగ్గింది. తూర్పు కనుమలలో పుట్టే అనేక వాగులు, వంకలు కాలువలు ఇప్పుడు ఎండిపోతున్న పరిస్థితి ఏర్పడుతోంది. ఇవి ఉత్తరాంధ్రకు ముఖ్య నీటి మూలాలుగా పనిచేస్తూ సాగునీటి అవసరాలను నింపుతున్నాయి. వీటి ముసుగులో జరిగే అడవి నరుకులు, నిబంధనలకూ విరుద్ధంగా జరుగుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్‌లో తీవ్ర ప్రభావాలు చూపే అవకాశం ఉంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పేదల గురించి ఆలోచించండి

**వయసులో** ఉన్నవారు ఆరోగ్యంగా ఉన్నవారు పనిచేయగల స్థితిలో ఉన్నవారికి డబ్బులివ్వడం తప్పవుతుంది.కానీ వృద్ధులు, రోగాలతో బాధపడుతున్న వారు ఏ పనిచేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నవారికి డబ్బులివ్వటం తప్పెలా అవుతుంది. కార్పొరేట్ శక్తులకు సాయం చేయడం ఎమ్‌పిల జీతాలు పెంచటమేకాదు పాలకులు పేదల గురించి ఆలోచించాలి. దేశంలోని అర్హులైన పేదలందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

-కె.రామారావు, హైదరాబాద్

### ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**వరుసగా** రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రీవియస్ 8సంవత్సరాల స్టేషన్ పాయింట్లు కేటాయించాలి. రేషనలైజేషన్ గురైన వారందరికి పాత స్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా 5పాయింట్లు ఇవ్వాలి. వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఈ బదలీల్లో ప్రస్తుత స్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా ఏడు పాయింట్లు ఇస్తున్నది. గతంలో ఒకసారి రేషనలైజేషన్ గురయ్యారు. 2025లో ఇంకోసారి గురవుతున్నారు. తప్పనిసరిపరిస్థితిలో రేషనలైజేషన్‌గురై, బదలీఅవుతున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతున్నది.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

మనవి
ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యా విధానంలో సమూల మార్పులు అవసరం

ఎస్. సీతారామయ్య

విద్య సామాజిక, సాంస్కృతిక పరిణామానికి ప్రధాన వాహిక. ప్రతి తల్లీతండ్రి తమ బిడ్డలు విద్యావంతులు కావాలనీ, తమకంటే ఇంకా మెరుగ్గా బతకాలని ఆశిస్తారు. విద్య జీవన వ్యవస్థలను పరిపుష్టం చేస్తుంది.విద్య భారత దేశ, రాష్ట్రాల ఆర్థిక జీవనాన్ని మెరుగుపరుస్తుంది. ప్రపంచ దేశాల్లో విద్యావంతులు అందరూ ఆయా దేశాల అభివృద్ధికి, జీవన వ్యవస్థల పునరుజ్జీవనానికి కృషిచేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే క్రమంలోను, వచ్చాక విద్యాభ్యాసానికి సంబంధించి ఒక సంస్కరణగా, ఒక విప్లవంగా విద్యా విప్లవం నడిచింది. దేశవ్యాప్తంగా విద్యా వ్యాపారం పెరిగింది. విద్యా విధానం జ్ఞానసంబంధమైనది. విద్యలో వ్యాపార ధోరణి వుండకూడదు, కొఠారి కమీషన్ విద్యా సంస్కరణల్లో ఓ ప్రధాన భూమిక పోషించిన విషయం అందరికీ విదితమే, విద్యయే దేశాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దడానికి సాంఘిక, జాతీయ సమైక్యతను పరిగణనలోనికి తీసుకొని అందరికీ నాణ్యమైన విద్యకోసం సరైన బోధనా వాతావరణాన్ని అందించడం అనేది ప్రధాన లక్ష్యంగా పక్కాణించారు.నాణ్యమైన విద్యఅందించడం ద్వారా జీవితాలను తద్వారా సమాజాన్ని ప్రభావితం చేయడమేకాక సమాజంలో నెలకొని ఉన్న అసమానత సామజిక వైషమ్యాలను తొలగించడానికి ఉపకరిస్తుందని వివరించారు. దీనికితోడు విద్య జీవిత సాఫల్యతకుఆదాయం, ఆరోగ్యం ఎన్నో అత్యున్నత అవకాశాలు అందుకోవడానికి చదువు ఒక ప్రధాన భూమిక. యునెస్కో ప్రకారం విద్య మానవహక్కు అని, జీవితకాలం ప్రతిఒక్కరు విద్యా హక్కును వినియోగించుకొనే అవకాశం ఉంటుందని నిర్వచించింది. నూతన విద్యా విధానం 2020 కూడా ఇదే ఒరవడిలో భావితరాలను మంచిప్రయోజకులుగా తీర్చి శాస్త్రీయ విద్య అవశ్యం దిద్దడానికి కొన్ని కీలక సిద్ధాంతాలను పొందుపరిచింది. ఏదైనా విషయం గురించి తార్కికంగా, హేతుబద్ధంగా ఆలోచించడం, నైతిక విలువలను దృష్టిలో ఉంచుకొని సృజనాత్మకతకు యోచించడం వంటి ప్రాధాన్యతా అంశాలను నూతన విద్యావిధానంలో పొందుపరచడం జరిగింది. తద్వారా ప్రయోజనకర పౌరులను తీర్చిదిద్దడానికి సమానమైన, సమ్మిళిత భరిత వాతావరణాన్ని ఏర్పరచి రాజ్యాంగ విలువల పరిరక్షణకూడా ప్రధాన లక్ష్యంగా భావించారు. ఈ లక్ష్యాలు నెరవేరాలంటే దేశంలో నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేయడం తప్పనిసరి. దీనికి కొన్ని ముఖ్యమైన సంస్కరణలు అనివార్యం. పాఠశాల కరికులం, ఉపాధ్యాయ వృత్తి విద్యా నైపుణ్యాల సరళి, తరగతుల నిర్వహణలో శాస్త్రీయ దృక్పథం, ఏదైనా విషయం గురించి తార్కికంగా, హేతుబద్ధంగా, సృజనాత్మకతతో యోచించడం వంటి ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలి. యువతకు ఉద్యోగ ఉపాధి రంగాలలో భరోసా, కృత్రిమ మేధస్సు దిశగా దేశం పరుగులు పెడుతున్న తరుణంలో మన విద్యా నైపుణ్యాలను త్వరితగతిన మెరుగుపర



చడానికి మౌలిక వసతులు, యువతకు నూతన నైపుణ్యాల వైపు అవగాహన, కళాశాల విద్యను కొత్త కోర్సులతో మెరుగుపరచడం, ఉన్నత విద్యా స్థాయి మొదలుకొని ఉపాధి ఉద్యోగ మార్కెట్ల డిమాండ్ సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి. కెరీర్ కౌన్సిలింగ్ సౌకర్యాలతో ప్రభుత్వాలు, విద్యాలయాలు గుర్తెరగాలి. లేకపోతే చదువుకు ఉద్యోగ ఉపాధి రంగాలకు అవసరమైన పనితనానికి ఎంతమాత్రం పొంతన ఉండక మనవాభివృద్ధికే పెద్ద విఘాతం ఏర్పడుతుంది. ఇండియా టుడే వారి నివేదిక ప్రకారం 93శాతం 14-21వయసు కల్గిన మంది విద్యార్థులు అందుబాటులో వున్న సుమారు 250 కెరీర్ ఉద్యోగ అవకాశాల ఆప్షన్లలో వారికి కేవలం 7రకాల ఉద్యోగ రంగ సమాచారం మాత్రమే కలిగి ఉన్నట్లు, సుమారు 50 శాతం మందివిద్యార్థులు తప్పు కెరీర్ ఎంపికను చేసుకుంటున్నట్లు వెల్లడైంది. ఈ ఎంపిక పట్ల వారికి అవగాహన లేకపోవడం వారి వైపుణ్యాలకు ఉద్యోగ అర్హతకు ఎంతమాత్రం సొంతన లేకపోవడం, దీనివల్ల ఎక్కువ శాతం మంది సరైన ఉద్యోగాలను పొందలేక, పొందినా సంతృప్తి చెందక, ఉద్యోగబాధ్యతను నిర్వహించలేక నిరాశలో వున్నారని తెలుస్తోంది.అంతేకాక, అవగాహనారాహిత్యం వల్ల ఇంజినీరింగ్, కంప్యూటర్ వివిధ టెక్నికల్ కోర్సులలో బాలికల చేరిక శాతం చాలా తక్కువని తెలుస్తోంది. నిజానికి 30-40శాతం మంది బాలికలు మాత్రమే టెక్నికల్ కోర్సులలో చేరుతున్నారని ఆల్ ఇండియా స్టడీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2021 నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితిలో చదువు,నైపుణ్యాలు ప్రాథమిక స్థాయి నుంచి బహుళ ప్రయోజనాల ప్రాతిపదికన ఉండాలి. పటిష్టమైన కరికులం, డిమాండ్ కలిగిన వృత్తిపరమైనవిద్యా కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ఉత్సుకత సంతరింపచేసే నైపుణ్యాలతో కూడిన అనుభవాత్మక విద్య నుంచి సంభాషణా చాతుర్యం,సహకారం ప్రతిపాదికతో జట్టు కార్యక్రమాలు వంటి అంశాలను జోడించి వినూత్న విద్యావ్యవస్థను ప్రోత్సహించాలి. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులఅధ్యాపకుల ఎంపికలో మౌలిక వసతుల కల్పనలో, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లేకపోతే పోటీ ప్రపంచంలోయువత నెగ్గుకు రావడం కష్టతరమే. సాంప్రదాయ రీతి బోధనకు స్వస్తిపలికి కృత్యాధార, డిజిటల్ బోధన, పీర్ లెర్నింగ్, లైబ్రరీ వినియోగం, స్టెమ్ ఆధారిత అనుభవాత్మక విద్యను అందుబాటులో ఉంచడం తప్పనిసరి. ఈ ఫలితాలు సాధించటానికి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపుదలలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను వెచ్చించి వారికి వినూత్న బోధన విధానాలపై ప్రత్యేక శిక్షణలు, సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్) వివిధ రాష్ట్రాల్లో ప్రయోగ ఫలితాల ఆధారంగా ఏర్పరచిన ఉత్సాహవంతులైన సబ్జెక్టు ఆధారిత ఉపాధ్యాయుల ఫోరమ్‌లను ఏర్పరచి వారికి తగిన శిక్షణ, అదనపు కోర్సులను నేర్చుకొనే వెసులుబాటు కల్పించాలి. క్షేత్ర స్థాయి అవగాహన ద్వారా తద్వారా ఉపాధ్యాయులకు వృత్తి పరమైన నైపుణ్యాలను అందించి, ఉపాధ్యాయులను సంసిద్ధపరచడం తప్పనిసరి అని ప్రభుత్వాలు గుర్తించాలి. అదనంగా క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారాన్ని అందించడానికి స్థానిక జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను బలోపేతం చేయడమే సమస్యలకు సరైన పరిష్కారం. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రచించి యువత భవితకు భరోసా కల్పించాలి. ●

# జస్టిస్ వర్మ ఇంట్లో కరెన్సీ కట్టలు నిజమే



## నివేదిక సమర్పించిన ముగ్గురు జడ్జిల కమిటీ

## సిజెఐ ఆరోపణలు నిజమేనన్న నివేదిక

## విధులనుంచి వర్మ తొలగింపునకు దొరికిన ఆధారాలు చాలని వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 19:** జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో డబ్బు బయటపడిన మాట వాస్తవమేనని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ నిర్ధారించింది. ఆయన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వేళ అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు. దీనిపై ప్యానెల్ తాజాగా 60 పేజీల నివేదిక ఇచ్చింది. ఇందులో 30 తుగ్లక్ క్రిసెంట్ రోడ్‌లోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నోట్ల కట్టలను గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. ఆ సొమ్ములున్న స్టోరూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్‌వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని అభిప్రాయపడింది. దీనికి సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అగ్నిప్రమాదంలో దగ్ధమైన నోట్లను మార్చి 15వ తేదీ తెల్లవారుజామున అక్కడి నుంచి తొలగించడమే బలమైన సాక్ష్యమని వెల్లడించింది. అసలు ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబ సభ్యుల స్టోరూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు, లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. తమకు లభించిన ఎలక్ట్రానిక్, ప్రత్యక్ష ఆధారాలను దృష్టిలో ఉంచుకుని సిజెఐ ఆరోపణలు నిజమేనని తేలుతోందని నివేదిక పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది. జస్టిస్ వర్మపై దర్యాప్తులో భాగంగా 10 రోజుల పాటు 55 మంది సాక్షులను విచారించారు. వారి వాంగ్మూలాలను వీడియోలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఓ సాక్షి మాట్లాడుతూ 'నేను ఆ గదిలోకి వెళ్లాను. అక్కడ కుడివైపు నేలపై రూ.500 నోట్ల కట్టలు భారీగా పడున్నాయి. షాకైపోయాను. నా జీవితంలో నేలపై అంత మొత్తం సొమ్ము పడి ఉండటానిన చూడలేదు' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ కుమార్తె దియా, ఆయన ప్రైవేట్ కార్యదర్శి రాజేందర్‌సింగ్ కార్కి తదితరులను కూడా ప్యానెల్ విచారించింది. అగ్నిమాపక సిబ్బంది తమ నివేదికలో నోట్ల వివరాలు నమోదు చేయకుండా రాజేందర్‌సింగ్ అడ్డుకొన్నట్లు తెలిసింది. కానీ, ఆ ఆరోపణలను ఆయన తిరస్కరించారు.

ఈయేడాది మార్చి14న ఢిల్లీలోని జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఇది నిజమేనని ధృవీకరించిన త్రిసభ్య కమిటీ సంబంధిత నివేదికను సుప్రీం కోర్టుకు అందించింది.




# దెబ్బతిన్న బ్లాక్ బాక్స్

## డేటా విశ్లేషణ కోసం విదేశాలకు తరలింపు

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం కేసు

**న్యూఢిల్లీ, జూన్19:** గుజరాత్‌లో ఇటీవల జరిగిన ఘోర విమాన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి టేకాఫ్ అయిన ఎయిరిండియా విమానం కొద్దిసేపటికే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ విమానానికి సంబంధించిన అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్ ప్రమాదంలో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అందులోని డేటాను విశ్లేషించేందుకు దాన్ని విదేశాలకు పంపించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ సమాచారాన్ని అధికార వర్గాలు తెలిపినట్లు పలు మీడియాల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రమాదం అనంతరం స్థానిక బిజె వైద్య కళాశాల భవనంపై నుంచి అధికారులు దీన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రమాద సమయంలో అది దెబ్బతిన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో దాని నుంచి మెరుగైన సమాచారం రాబట్టేందుకు అమెరికాలోని వాషింగ్టన్ డిసిలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యూఎస్‌కు పంపే సమయంలో ప్రొటోకాల్స్ పాటించడంతో పాటు భారత్‌కు చెందిన అధికారుల బృందం కూడా బ్లాక్‌బాక్స్‌తో పాటు వెళుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఈ నెల 12న లండన్ వెళ్లేం దుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకిఎగిరిన వెంటనే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణ ికులతో సహా మొత్తం 270 మంది ప్రాణాలు కోల్పోయారు. విమాన ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్స్‌లోని సమాచారం కీలకం. దీని నుంచి సమాచారం రాబట్టేందుకు నిపుణులు నిమగ్నమయ్యారు.



## ఆస్పత్రినుంచి సోనియా డిశ్చార్జ

**న్యూఢిల్లీ, జూన్ 19:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఈ నెల 15న ఢిల్లీలోని సర్‌గంగారామ్ అస్పత్రిలో చేరిన విషయం విదితమే. నాలుగు రోజులుగా చికిత్స పొందిన సోనియాగాంధీ ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని, డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. కాగా, ఉదర సంబంధిత సమస్యలతో సోనియాగాంధీ ఆదివారం రాత్రి ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 9న ఇదే ఆస్పత్రిలో సోనియా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న సోనియా గాంధీకి వైద్యులు చికిత్స అందించారు.

# బిన్‌లాడెన్‌ను అప్పుడే మరచిపోయారా?

## మునీర్‌కు డొనాల్డ్ ట్రంప్ విందుపై శశిథరూర్

**న్యూఢిల్లీ, జూన్ 19:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్‌కు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తీవ్రం విమర్శలు గుప్పించారు. ఒసామా బిన్‌లాడెన్‌కు ఆశ్రయం కల్పించడంలో పాక్ పాత్రను అమెరికా మరచిపోకూడదన్నారు. 'వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడిలో ప్రధాన సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ ఎపిసోడ్‌ను పాక్ బృందాన్ని కలిసిన కొంతమంది చట్టసభ సభ్యులు మరచిపోయినప్పటికీ అమెరికా ప్రజలు మాత్రం అంత తొందరగా మరిచిపోలేరు. ఇటువంటి వ్యక్తి దొరికేవరకు.. ఓ ఆర్మీ క్యాంపుదగ్గర పాక్ దాచిపెట్టిన విషయాన్ని అమెరికన్లు అంత తొందరగా మరచిపోరు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఉగ్రవాదులకు శిక్షణాపరంగా, ఆర్థికంగా మద్దతు ఇవ్వకూడదనే విషయాన్ని పాకిస్థాన్‌కు అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా హెచ్చరించి ఉంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

**భిన్నాభిప్రాయాలు నిజమే : థరూర్**

కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో కొందరితో తనకు భిన్నాభిప్రాయాలు ఉన్న మాట వాస్తవమేనని ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ అంగీకరించారు. అయితే, వాటిని పార్టీ అంతర్గత సమావేశంలోనే చర్చిస్తానని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన ఓ అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించిన థరూర్.. ప్రధాని మోడీని కలిసిన సందర్భంలో పర్యటన గురించి తప్ప వేరే విషయాలేవీ చర్చించలేదని స్పష్టం చేశారు.



# ప్రమాద బాధితకుటుంబాలకు క్షమాపణలు చెపుతున్నా!

## టాటాచరిత్రలోనే ఇలాంటి ప్రమాదం జరగలేదు..

## ఎయిరిండియా ఛైర్మన్, టాటా అధినేత చంద్రశేఖరన్

**న్యూఢిల్లీ,జూన్ 19:** అహ్మదాబాద్‌లో గత గురువారం ఎయిరిండియా విమానం కుప్పకూలిన దురదృష్టకర సంఘటనపై టాటా సన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 279 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయనదిగ్భ్రాంతి వ్యక్తంచేస్తూ, బాధిత కుటుంబాలకు హృదయపూర్వక క్షమాపణలు తెలిపారు. లండన్‌కు బయల్దేరిన డ్రీమ్‌లైనర్ ఏఐ171 విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే ఒక భవనంపై కూలిపోయిన విషయం తెలిసిందే. టాటా సంస్థ నడిపే విమానయాన సంస్థలో ఈ ప్రమాదం జరిగినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను. ఈ సమయంలో బాధిత కుటుంబాలకు అండగాఉంటాం. వారికి అవసరమైన సాయాన్ని అందించేందుకు కంపెనీ కట్టుబడి ఉంది. ఈ ఘటనకుగానూ బాధిత కుటుంబాలకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని చంద్రశేఖరన్ తెలిపారు. ప్రాథమిక స్థాయి విచారణ ఫలితాలు వెలువడటానికి సుమారు ఒక నెల సమయం పట్టవచ్చని ఆయన అంచనా వేశారు. విమానం అత్యంత భద్రతా ప్రమాణాలతోనే కార్యకలాపాలు సాగిస్తోందని, ఇటీవలే నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సాంకేతిక లోపాలు బయటపడలేదని ఆయన వివరించారు. ప్రమాదానికి గురైన ఏఐ171 విమానానికి మంచి సేఫ్టీ రికార్డు ఉందని చంద్రశేఖరన్ తెలిపారు. విమానం కుడివైపున ఉన్న ఇంజిన్‌ను మూడు నెలల క్రితమే, అంటే 2025 మార్చి నెలలో ఓవర్‌హాలింగ్ సమయంలో అమర్చాం. ఎడమవైపు ఇంజిన్‌కు చివరిసారిగా 2023 జూన్‌లో నిర్వహణ పనులు చేపట్టారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం దానికి 2025 డిసెంబర్‌లో నిర్వహణ చేపట్టాల్సి ఉందని ఆయన వివరించారు. అంతేకాకుండా విమానాన్ని నడిపిన పైలట్లు కూడా అత్యంత అనుభవజ్ఞులని ఆయన స్పష్టం చేశారు.



# స్టూడెంట్ వీసా జారీ ప్రక్రియ షురూ

## అయితే సోషల్ మీడియా వెట్టింగ్ తప్పదు!

**వాషింగ్టన్,జూన్ 19:** అమెరికాలో ఉన్నతవిద్యను అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు కీలక అప్‌డేట్. గత కొంతకాలంగా తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ ప్రక్రియను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. అయితే, ఈసారి వీసా దరఖాస్తులతో పాటు దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలను తప్పనిసరిగా పరిశీలించనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇందుకోసం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనపై విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ, ఈ సోషల్ మీడియా తనిఖీ ద్వారా మా దేశంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని సమగ్రంగా పరిశీలించడానికి వీలుకలుగుతుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవసీ సెట్టింగ్స్‌ను పబ్లిక్‌గా మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది మే నెలాఖరునుంచి ప్రపంచవ్యాప్తంగాఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో కొత్తగా విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీ ప్రక్రియలో భాగంగా సోషల్ మీడియా ఖాతాల పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నందునే ఈ విరామం తీసుకున్నామని అప్పట్లో విదేశాంగ శాఖ పేర్కొంది. తాజాగా ఈ సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది. సోషల్ మీడియా వెట్టింగ్ అంటే వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు అనుమతి ఇవ్వవచ్చా లేదా అనే విషయాన్ని అంచనా వేయడానికి వారి ఆన్‌లైన్ కార్యకలాపాలను, ముఖ్యంగా సోషల్ మీడియా పోస్టులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయడం. ఉదాహరణకు ఒక విద్యార్థి తన సోషల్ మీడియా ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లు గుర్తిస్తే, ఆ వ్యక్తిని మరింతలోతుగా పరిశీలిస్తారు. వారి వల్ల అమెరికా దేశ భద్రతకు ఎలాంటి ముప్పు లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఆ విద్యార్థికి దేశంలోని విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతిస్తూ స్టూడెంట్ వీసా మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా దేశ భద్రతకు ప్రాధాన్యతనిస్తూనే, అర్హులైన విద్యార్థులకు అవకాశం కల్పించాలని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది.

## కెంపెగౌడ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదరింపు

**బెంగళూరు,జూన్ 19:** బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం సృష్టించింది. గుర్తుతెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఓ ఈమెయిల్ సందేశంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఎయిర్‌పోర్ట్ అంతటా విస్తృత తనిఖీలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, బుధవారం రాత్రి విమానాశ్రయ భద్రతా విభాగానికి ఒక ఈమెయిల్ అందింది. అందులో, తాను ఒక ఉగ్రవాదినని పేర్కొన్న దుండగుడు, ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో రెండు శక్తివంతమైన బాంబులు అమర్చినట్లు తెలిపాడు. అంతేకాకుండా, విమానాశ్రయంలోని టాయిలెట్ పైపులో మరో పేలుడు పరికరాన్ని కూడా పెట్టినట్లు హెచ్చరించాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే భద్రతా అధికారులు అత్యంత వేగంగా స్పందించారు. తక్షణమే బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లనురంగంలోకి దించి, విమానాశ్రయం నలుమూలలా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంటల తరబడి సాగిన ఈ ముమ్మర గాలింపు చర్యల్లో ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులుగానీ లభించలేదు. దీంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం, ఇది కేవలం ఆకతాయిల పనిగా, నకిలీ బెదిరింపుగా అధికారులు నిర్ధారించారు.

# ఆంగ్లంలో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి



## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, జూన్ 19:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఎఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు.

'ఈదేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడేరోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీ యులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందు కోసం ప్రయత్నం చేయాలి' అని అమిత్‌షా పిలుపునిచ్చారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలే మన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఎఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## కర్ణాటక ఇళ్ల పథకాల్లో మైనారిటీ రిజర్వేషన్లు పెంపు



**బెంగళూరు, జూన్ 19:** వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఇళ్ల పథకాలకు సంబంధించి మైనారిటీలకు అమలవుతున్న రిజర్వేషన్లను 10 శాతం నుంచి 15 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలకు కర్ణాటక మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంత్రివర్గ సమావేశం తర్వాత మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్.కె.పాటిల్ తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మైనారిటీల్లో ఇళ్లు లేని వాళ్లలో అసమానతలను దృష్టిలో ఉంచుకుని రిజర్వేజన్ల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. ముఖ్యంగా కర్ణాటకలోని మైనారిటీలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉందని హెచ్.కె.పాటిల్ అన్నారు.

కేంద్ర ప్రభుత్వం మైనారిటీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంతకు ముందే మార్గదర్శకాలను జారీ చేందని, అందులో మైనారిటీల కోసం 15 శాతం రిజర్వేషన్లు కల్పించారని, కర్ణాటక ప్రభుత్వం వాటిని అనుసరిస్తున్నదని న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్.కె. పాటిల్ గుర్తుచేశారు. తమరాష్ట్రంలో మైనారిటీలు ఇళ్ల పథకాల్లో రిజర్వేషన్ కోటా పెంచాలని ఎప్పటి నుంచో కోరుతున్నారని ఆయన అన్నారు,

## దరఖాస్తుచేసిన 15రోజుల్లోనే ఓటరు కార్డు


### ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ జూన్ 19:** ఓటర్ గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై దరఖాస్తు చేసుకున్న వారికి కేవలం 15 రోజుల్లోనే ఓటర్ ఐడీ కార్డులను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొత్త కార్డు లేదా మార్పులు చేర్పులు చేసిన కార్డు పొందడానికి నెల రోజులకు పైగా సమయం పడుతుండగా, ఈ నూతన విధానంతో ఆ జాప్యం తగ్గనుంది.

ఈ కొత్త విధానం ప్రకారం, కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి, అలాగే తమ ఓటర్ కార్డులోని వివరాలలో మార్పులు కోరిన వారికి ఇది వర్తిస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కార్డు తయారీ నుంచి ఓటరు చేతికి అందే వరకు ప్రతి దశను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్ఓ) స్థాయి నుంచి పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేసేంత వరకు రియల్‌టైమ్ ట్రాకింగ్ చేయనున్నట్లు పోల్ అథారిటీ తెలిపింది.

# ఉత్తమ స్కూళ్ల పోటీలో భారత్

## హార్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, యుపి నుంచి పోటీపడుతున్న పాఠశాలలు



**లండన్, జూన్19:** ప్రపంచ ఉత్తమ పాఠశాల బహుమతులకు సంబంధించి వివిధ కేటగిరీల్లో తుది పది స్థానాల్లో నిలిచిన విద్యాసంస్థల్లో నాలుగు భారతీయ పాఠశాలలకు చోటు లభించింది. ఈ మేరకు ఉత్తమ ఉపాధ్యాయులను ఆకర్షించడానికి, నిలబెట్టుకోవడానికి సహాయపడేందుకు ఉద్దేశించిన 'విధి నిర్వహణకు ఉత్తమ పాఠశాల' సభ్యత్వం కోసం హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి నాలుగు పాఠశాలలు పోటీదారులుగా నిలిచాయి. ఈ యేడాది అక్టోబరులో ఇందుకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా విజేతలను ప్రకటిస్తారు. బ్రిటన్ కేంద్రంగా పనిచేసే 'టి4 ఎడ్యుకేషన్' అనే సంస్థ కొవిడ్ మహమ్మారి నేపథ్యంలో తరగతి గదుల్లో, వెలుపల జీవితాలను మార్చుతున్న పాఠశాలలకు ఓ వేదిక సృష్టించడమే లక్ష్యంగా 'ప్రపంచ ఉత్తమ పాఠశాల బహుమతులు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. సమాజ భాగస్వామ్యం, పర్యావరణ కార్యాచరణ, నవకల్పన, ప్రతికూలతను అధిగమించడం, ఆరోగ్యకర జీవితాలకు మద్దతుగా నిలవడం వంటి 5 విభాగాల్లో ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. హార్యానాలోని ఫరీదాబాద్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల సీనియర్ సెకండరీ స్కూల్ ఆరోగ్యకర జీవితాలకు మద్దతు విభాగంలో, మహారాష్ట్రలోని పుణె సమీపంలో ఖేడ్ తాలూకా జలిందర్ నగర్‌లోని జెడ్పీ స్కూల్, సమాజ భాగస్వామ్యం విభాగంలో, కర్ణాటక రాజధాని బెంగళూరులోని జెపి నగర్ ఎక్యా స్కూల్, నవకల్పన విభాగంలో, కర్ణాటక రాజధాని బెంగళూరులోని జెపి నగర్ ఎక్యా స్కూల్, నవకల్పన విభాగంలో, వారణాసిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పర్యావరణ కార్యాచరణ విభాగంలో తుది పది పోటీదారుల జాబితాలో నిలిచాయి.

వీటితోపాటు కమ్యూనిటీ ఛాయిస్ విభాగంలో ఓ బహుమతి ఉంటుంది. పురస్కారాలకు సంబంధించి 5 విభాగాల్లో తుదిజాబితాలో చోటు సంపాదించిన 50 పాఠశాలలకు కలిపి ఓటింగ్ నిర్వహించి 'సమాజ ఎంపిక' విభాగంలో ఓ పాఠశాలకు పురస్కారం అందిస్తారు. ఇందుకు సంబంధించి ఈ వారంలోనే ఓటింగ్ ప్రక్రియ మొదలవనుంది. మరోవైపు, ఈ పోటీలోని విజేతలు, తుదిజాబితాలో చోటు సంపాదించిన 50 పాఠశాలల ప్రతినిధులను ఈ ఏడాది నవంబరు 15, 16 తేదీల్లో దుబాయ్‌లోని అబుదాబిలో జరిగే ప్రపంచ పాఠశాలల సదస్సుకు ఆహ్వానిస్తారు.

## బలవంతపు బాల్య వివాహం రద్దు కోరుతున్న బాలికకు రక్షణ కల్పించాలి: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జూన్ 19:** బలవంతపు బాల్య వివాహాన్ని రద్దు చేయాలని కోరుతున్న బాలికకు రక్షణ కల్పించాలని బీహార్ డిజిపి, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. తమ ప్రాణాలకు ముప్పు ఉందని బాలిక, ఆమె స్నేహితురాలు భయపడుతున్నందున అధికారులు వారికి అందుబాటులో ఉంటూ తగిన సహాయ సహకారాలు అందించాలని జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం తెలిపింది. గత ఏడాది డిసెంబర్ 9న తనకు బలవంతపు వివాహం చేశారని, అప్పటికి తన వయసు పదహారున్నర సంవత్సరాలేనని సుప్రీం కోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో బాలిక పేర్కొంది. అప్పటికి పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నానని తెలిపారు. చదువు కొనసాగించటానికి అత్తింటివారుతొలుత అంగీకరించినప్పటికీ ఆ తర్వాత సహకరించలేదని, బిడ్డను కనాలని బలవంతం పెట్టారని ఆరోపించారు. పెళ్లికి భారీగా డబ్బు ఖర్చు అయిందని చెబుతూ కాపురం చేయాల్సిందేనంటూ భర్త, అత్తమామలు భయపెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తనను పుట్టింటికి పంపించడానికి నిరాకరించారని తెలిపారు. సివిల్ కాంట్రాక్టర్ అయిన భర్తకు 32 ఏళ్ల వయసు ఉంటుందని, తమ పుట్టింటి వారు ఆయనకు డబ్బు బకాయి పడటంతో ఈ వివాహం చేశారన్నారు. తనకు చదువుకుని ఉపాధ్యాయ లేదా న్యాయవాద వృత్తిని చేపట్టాలని ఉందని వివరించారు. బాల్య వివాహాన్ని రద్దు చేయడంతో పాటు అందుకు కారణమైన భర్త, అత్తింటివారిని శిక్షించాలని కోరారు. ఆమె పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం కేసు విచారణకు అంగీకరించింది. బీహార్ ప్రభుత్వం, ఆమె భర్త, అత్తమామల సమాధానాన్ని జులై 15వ తేదీలోగా తెలియజేయాలని ఆదేశించింది.

# దత్తత పేరుతో వాసాలమర్రిని ఆగం చేసిన కెసిఆర్



## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** వాసాలమర్రి గ్రామాన్ని నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆగమాగం చేస్తే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిలో అర్హులైన 205 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంత్రి మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి సిఎం కెసిఆర్ వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు.నాడు గ్రామస్తులతో కెసిఆర్ సహపంక్తి భోజనంభోజనం చేసి, ఆగవ్వ అనే వృద్ధురాలిని పక్కన కూర్చోబెట్టుకొని ఇల్లు కట్టిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని,ఇప్పుడు ఆగవ్వ మాటలు వింటుంటే ఎంతో బాధకలిగిందన్నారు. ఆగవ్వ చెప్పినట్లు కెసిఆర్ చేసిన పచ్చి మోసం బట బయలు అయ్యిందని అన్నారు. కెసిఆర్ మాటలు నమ్మి ఆగవ్వతో పాటు వాసాలమర్రి గ్రామస్తులందరూ ఆగమ య్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం వాసాలమర్రిని అన్ని విధాలుగా ఆదుకుంటూ అర్హులైన పేదలందరికి ఇందిరమ్మఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. వాసాలమర్రి లాగానే ఇండ్లు ఇస్తామంటూ బొమ్మను చూపి ఓట్లు వేయించుకున్న కేసీఆర్ ఏ ఒక్క ఊరికి ఇండ్లు ఇవ్వకుండా రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లకు పైగా అప్పుల ఊబిలో ముంచితే ప్రభుత్వం అసలు, మిత్తి రూ. 6500 కోట్లు ప్రతి నెల చెల్లిస్తుందన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎన్నివున్నా ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి ఇంటి గుమ్మానికి చేరుస్తుందని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణపనులు మొదలు పెట్టడానికి డబ్బులు కూడా లేవని ఆగవ్వ చెప్పడంతో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెంటనే లక్ష రూపాయలు అందజేశారు. తక్షణమే ముగ్గు పోసి పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్ పర్సన్ బండ్రు శోభారాణి,జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ బరిలో నేనే ఉన్నా

## పిసిసి సభ్యుడు మహ్మద్ అజారుద్దీన్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 19, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే అంశంపై పార్టీలోను, నియోజకవర్గంలోనూ పెద్దఎత్తున చర్చలు జరుగు తున్నాయి. నియోజకవర్గంలో ఏ నలుగురు కలిసినా కూడా ఇదే అంశంపై అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు మహ్మద్ అజారుద్దీన్ ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నట్లు స్పష్టం చేశారు. తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో చివరి క్షణంలో టికెట్ ఇచ్చినప్పటికీ ఆఖరివరకు పోరాడినా స్వల్ప ఓట్లతో ఓడిపోవడం జరిగిందన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సగం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చేలా తాను పనిచేశానని అన్నారు. తమ పార్టీలో ఉన్న కొంతమంది వ్యక్తులు కావాలని కొన్ని పత్రికల్లో, మీడియా మాధ్యమాల్లో, వెబ్‌సైట్లలో తప్పుడు వార్తలు సృష్టిస్తున్నారని, తనకు టికెట్ ఇవ్వడం లేదని ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు.

# సామాన్యుల ఆకాంక్షలకు గొంతుక రాహుల్‌గాంధీ

## ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** సామాన్యుల ఆకాంక్షలకు గొంతుక రాహుల్‌గాంధీ అని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం పురస్కరించుకొని గురువారం ఎక్స్‌వేదిక నుంచి పిసిసి చీఫ్ రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నిజాయితీ, ధైర్యం, రాజ్యాంగ విలువలతో ముందడుగు వేస్తూ రాహుల్‌గాంధీ ప్రజా నాయకుడు అంచలంచలుగా ఎదుగాలని ఆయన కోరుకున్నారు. రాహుల్ గాంధీ మీ పోరాటం యువతకి ప్రేరణగా, ప్రజల బాధలు తొలగించే బాటగా నిలుస్తోందని మహేష్‌గౌడ్ ఆకాంక్షించారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం మీరు చూపుతున్న అంకితభావం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరం. ఈ జన్మదినం మీకు ఆరోగ్యాన్ని, ఆయుష్షును, మరిన్ని విజయాలను తీసుకురావాలని కోరుకుంటున్నానని మహేష్‌కుమార్ ట్వీట్ చేశారు.

# బదలీల తర్వాతనే పదోన్నతులు ఇవ్వాలి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కు 'తపస్' విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు బదలీల తరువాతనే ప్రమోషన్స్ ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. గెజిటెడ్-2 హెచ్‌ఎం పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ), ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని కోరారు. పదవీవిరమణ ద్వారా చాలా ఖాళీలు ఏర్ప డిన వని.. వాటిని వెంటనే భర్తీ చేయడం ద్వారా విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని.. 31 నుండి 60 వరకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులను, 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్నచోట తరగతికి ఒక ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలన్నారు. 100 మంది విద్యా ర్థులు ఉన్నచోట ఐదుగురు ఉపాధ్యాయులు ఒక ప్రధానోపాధ్యాయుడిని (5+1) విధానంలో ఇవ్వాలని డైరెక్టర్‌కు సూచించారు. వర్క్ అడ్జెస్‌మెంట్ చేసే క్రమంలో సీనియర్, జూనియర్ విషయంలో నిర్ణయాధికారం సీనియర్‌కు ఇవ్వాలన్నారు. హిందీ, సాంఘిక శాస్త్రంలో భూగోళం ఆర్థిక శాస్త్రం చరిత్ర, పౌర శాస్త్రం అనే నాలుగు విభాగాలను ఒకే ఉపాధ్యా యుడు బోధించుచున్నాడని.. కాబట్టి దానిని రెండు విభాగాలుగా విభజించి.. 221 సంఖ్య దాటాక ఇద్దరు ఉపాధ్యా యులను కేటా యించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక కారణాల చేత ఆగిపోయిన పరస్పర బదిలీలు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి అప్పజెప్పాలన్నారు.

# డిఫెన్స్ మద్యంపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక దృష్టి

## వరుస దాడులతో సరకును పట్టుకుంటున్న ఎక్సైజ్ శాఖ

## కల్తీమద్యం తయారీ గుట్టురట్టు

**హైదరాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** తెలంగాణ మద్యం అమ్మకాల రెవెన్యూకు, డిఫెన్స్ మద్యం అమ్మకాలు విఘాతం కల్పిస్తున్నాయి. ప్రధానంగా సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలో డిఫెన్స్ క్యాంటిన్లు ఉన్నచోట డిఫెన్స్ మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతు న్నాయనే ఆరోపణలు ఉన్నాయి.ఎక్సైజ్ సూపరిండెంట్ కె.నవీన్ తన పరిధిలో ఉన్న మల్కాజి గిరి, ఉప్పల్, ఘట్కేసర్, మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలోని మేడ్చల్‌లో ఎక్సైజ్ స్టేషన్లలో డిఫెన్స్ మద్యం బాటిల్ల చలామణి, అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ సూపర్డెంట్ కే నవీన్ తెలిపారు.ఎన్‌డిపీఎల్ (నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్)పై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ 2డెరెక్టర్ షానవాజ్ ఖాసీం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 1188 మద్యాం బాటిళ్లను పట్టుకున్నారు. ఈ బాటిళ్లలో ఎక్కువగా శంషాబాద్ డి టి ఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్ రూ.2.30 లక్షల విలువ చేసే 115 డిఫెన్స్ మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.మల్కాజ్‌గిరి ఏఈఎస్ ముకుందరెడ్డి అధ్వర్యంలో రెండు చోట్ల దాడులు నిర్వహించి 37 డిఫెన్స్ మద్యం బాటిళ్లను రెండు రోజుల క్రితం పట్టుకున్నారు. మేడ్చల్‌లో 24 ఎన్‌డిపిఎల్ మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.గురువారం మరో రెండు చోట్ల దాడులు నిర్వహించి మల్కాజ్‌గిరి, ఘట్కేసర్‌లో 58 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. మల్కాజ్‌గిరి సీఐ చం ద్రశేఖర్ ఎస్సైలు కుమార స్వామి, సంధ్యాతోపాటు సిబ్బంది కలిసి యాప్రాల్ అల్వాల్‌లో దున్న అనే వ్యక్తి ప్లాట్‌లో 30 డిఫెన్స్ బాటిళ్లను పట్టుకున్నారు.ఘట్కేర్‌సర్‌లో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీఐ జె.రవి.ఎస్సై నందిని సిబ్బంది కలిసి 28 గోవా, డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఒక కారులో తరలిస్తు ఉండగా పట్టుకున్నారు. ఈ కేసులో మెరుగు నిఖిల్ అరెస్టు చేసి, కారును కూడ సీజ్ చేశారు.

మోటార్ ఫీల్డ్‌లో డ్రైవర్ నుంచి అన్ని రకాల ఉద్యోగాలు చేశాడు.ఏ ఉద్యోగంలో ఇముడలేని గోరికి శ్రీనివాస్ అనే వ్యక్తి కల్తీ మద్యం తయారీ అవతారమెత్తాడు.రెండు మూడేళ్లుగా ఖరీదైన మద్యంబాటిళ్లలో తక్కువధరలు కలిగిన మద్యాన్నికలిపి మార్కెట్ కంటే తక్కువ ధరలకు వినియోగదారులకు అంటకాగుతూ సొమ్ము చేసు కుంటున్నాడు. వివిధ పార్టీలో మిగిలిపోయిన మద్యం బాటిళ్లు తక్కువ ధరలకు ఇవ్వడంతో రూ. వందో, రెండోందలో లాభానికి అమ్మకాలు చేస్తూ మద్యం వినియోగదారులను బల్తా కొట్టిస్తు తన ఇంట్లోనే మద్యం తయారీ కంపెనీని నడుపుతున్న గోరికి శ్రీనివాస్‌ను ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ డి టీమ్ సీఐ నాగరాజు, ఎస్సై జ్యోతి సిబ్బంది కలిసి దాడి చేసిపట్టుకున్నారు. కాచిగూడ ఉస్మాన్‌నగర్ పల్టాన్ రోడ్డులో శ్రీనివాస్ ఫ్యూరియస్ లిక్కర్ తయారీ యూనిట్‌ను ఇంట్లోనే నడుపుతున్నాడు. తక్కువ ధరలు మద్యాన్ని 100 పేపర్, శివాజీ రీగల్ ఇలా అనేక రకాలు ఖరీదైన ఖాళీ బాటిళ్లను ఎస్టీఎప్ టీమ్ స్వాధీనం చేసుకుంది. పలు రకాల తక్కువ ధరలు కలిసిన మద్యాన్ని ఖరీదైన బాటిళ్లలో నింపిన 7మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు శ్రీనివాస్ తోపాటు 7 మద్యం బాటిళ్లు 106 ఖాళీ బాటిళ్లను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.ఇలాంటి ఫ్యూరియస్ లిక్కర్ తయారీ దారుడిని పట్టుకున్న ఎస్‌టిఎఫ్ డీ టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్‌డైరక్టర్ షానవాజ్ ఖాసీం,అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ,డిఎస్పి తిరుపతి యాదవ్ అభినందించారు.

# కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ పనుల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

## సిఎంకు సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి సంబంధిత గుత్తేదారుపై, గత పాలకుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500 కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిం శాఖ రూ.100 కోట్లు, నీటి పారుదల శాఖ రూ.100 కోట్లు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వకాలంలో ఈ రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులు చేపట్టబడినవని.. తమ పనులను తన అనుచరులకు అప్పగించారని, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గుత్తేదారు నిర్లక్ష్యం వహించారని చాడ మండిపడ్డారు. పనులు కూడా పూర్తి కాకుండానే బిల్లులు చెల్లించబడినవని.. నిర్మాణంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలుస్తుందన్నారు. రివర్ ఫ్రంట్ పరిధిలో చెక్ డ్యాములు నిర్మిస్తే వర్షాకాలంలో కురిసిన వర్షాలకు అవి పూర్తిగా కొట్టుకుపోయాయని, చెక్ డ్యాములు కొట్టుకపోయిన తరువాత కూడా రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు గత సర్కార్ నిధులు విడుదల చేసిందన్నారు. 5 సంవత్సరాలు గడుస్తున్నా ఈ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదదని.. కాబట్టి మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చాడ వెంకట్ రెడ్డి కోరారు.

# సామాజిక న్యాయం సాధనే రాహుల్ రాజకీయ విధానం

## రాహుల్ జన్మదిన వేడుకల్లో మంత్రులు పొన్నం, అడ్లూరి



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** భారతదేశ సమగ్రత కాపాడుతూ సామాజిక న్యాయం అణగారిన వర్గాలకు అందించడమే రాహుల్‌గాంధీ రాజకీయ విధానమని ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా మనమంతా రాహుల్ విధానం ఆచరణకు పునరంకితం కావాలని తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్‌లు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో భారీ రాహుల్ గాంధీ కటౌట్ ఏర్పాటు చేసి ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు గురువారం జరుపుకున్నారు.కాంగ్రెస్ శ్రేణులు నాయకులు హాజరుకాగా భారీ కేక్‌ను మంత్రులు,ఎంపి కట్‌చేశారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే తరానికి రాహుల్ గాంధీ దిక్సుచి అని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కులగణన కు ఒప్పుకుంది అంటే అది రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే అని ఆయన అనారు. కేంద్రం కులగణనకు గెజిట్ విడుదల చేసింది దానికి రాహుల్ గాంధీ ఆలోచన మేరకే అనీ దీనితో అణగారిని కులాలకు రాజకీయంగా ఆర్థికంగా సమానత్వం సాధించేందకు వీలవుతుందనిఅన్నారు. తెలంగాణలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ కులగణన చేసిందని తెలిపారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామని ఆయన అన్నారు. సంక్షేమం వికలాంగులశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసిండని అన్నారు.కాంగ్రెస్ లో మాత్రమే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రి గా పొన్నం ప్రభాకర్,దళిత మంత్రిగా నేను,పిసిసి అధ్యక్షుడు గా మహేష్ కుమార్ గౌడ్ లు దానికి నిదర్శనం అన్నారు. నిన్నటి వరకు సామాన్య కార్యకర్త,ఎమ్మెల్యే గా ఉన్న నేను సోషల్ జస్టిస్ లో భాగంగా దళిత వర్గం నుండి నేను మంత్రిని అయ్యాను అని చెప్పుకున్నారు ఒక మంత్రిగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలకు హాజరు కావడం ఆనందంగా ఉందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నాకు మంత్రిగా అవకాశం కల్పించిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిఎం రేవంత్ రెడ్డికి,ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు. సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే జరుగుతుందని రాహుల్ గాంధీ కి పుట్టిన రోజు శుభాకాంక్షలని ఆయన తెలిపారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు జరుపుతామని కానీ ఈసారి ఆయన పుట్టిన రోజు వేడుకలు సామాజిక న్యాయం సాధన కోసం రాహుల్ గాంధీని పుట్టినరోజును ఘనంగా జరిపామని యాదవ్ అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కాంగ్రెస్‌లో యువతకు పెద్దపీట వేస్తున్నారని అనిల్ యాదవ్ అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి,టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి.

# బనకచర్ల పాపం ముమ్మాటికి కెసిఆర్‌దే

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల గోదావరి ప్రాజెక్ట్ నిర్మాణానికి పునాది వేసిన పాపం ముమ్మాటికీ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుదే అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం మాట్లాడుతూ కెసిఆర్ అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చేతులు కలిపి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. తెలంగాణ నీటి ప్రయో జనాలను గత ప్రభుత్వం కాపాడలేదని చెప్పారు.

అధికారంలో ఉన్నప్పుడు చేసిందంతా చేసి అధికారం పోయాక బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని తెలిపారు. కేసీఆర్ అప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి రాయలసీమను సస్యశ్యామలం చేసి రతనాల సీమగా మారుస్తాను అని మీడియా ముఖంగా చెప్పింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఏపీలో తలపెట్టబోయే ప్రతి ప్రాజెక్ట్‌కు పెద్దన్నగా ఉంటానని మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చింది మర్చిపోయారా అని బిఆర్ఎస్ నేతలను నిలదీశారు. కెసిఆర్ ఇచ్చిన భరోసాతోనే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్ట్ కడుతుందని పేర్కొన్నారు.

ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనులు మానుకోవాలని డాక్టర్ కోట నీలిమ సూచించారు. 3 వేల టీఎంసీల మిగులు జలాలు గోదావరిలో ఉన్నాయని కేసీఆర్ చెప్పడం వల్లే ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు బనకచర్ల చేపట్టారని కానీ, గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గోదావరిపై తెలంగాణ కట్టిన ప్రాజెక్టులకు 968 టీఎంసీలు వాడుకోవడానికి ముందుగా అనుమతులు రావాలని, తెలంగాణ ప్రాజెక్టులు కట్టి వాడుకున్నాక మిగిలిన నీళ్లు కిందకు పోతే,వాటిని మిగులు జలాలు అంటారని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని డాక్టర్ కోట నీలిమ తెలిపారు.

అసలు మిగులు జలాలు ఎక్కడున్నాయి అని ఆమె ప్రశ్నించారు. నిజంగా 3000 టీఎంసీల మిగులు జలాలు ఉంటేఅందులో 1500 టీఎంసీలు వాడుకునేలా ఏపీ ప్రభుత్వం తెలంగాణ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆమె సమర్థించారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్లే తెలంగాణకు ఈ నీటి కష్టాలు వచ్చాయని ఆమె ఆవేదన చెందారు.

# బావాజీ మఠంలో పూజల కోసం బంజారా పీఠాధిపతులకు అవకాశమివ్వండి

## టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 19:** తిరుపతి హాతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి గురువారం హైదరాబాద్‌లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును ఎమ్మెల్సీ కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 30న హాతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే హాతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు. హాతిరామ్ బావాజీ మఠంలో పూజలు చేయడానికి, హారతి ఇవ్వడానికి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 30న హాతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడానికి, నైవేద్యం సమర్పించడానికి అవకాశం కల్పిస్తామని టీటీడీ ఛైర్మన్ హామీ ఇచ్చారు.

# రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

## బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ప్రభుత్వం బకాయిపడిన రూ.7,500 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడి యాతో మాట్లాడారు. ప్రభుత్వం డబ్బులు విడుదల చేయకపోవడంతో ఉన్నత చదువులు చదువుకుని, ఉద్యోగాలకు వెళ్లకుండా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను సైతం భర్తీ చేయాలన్నారు. కొత్త భవనాలు నిర్మించాలని, ఇంజనీరింగ్ కాలేజీలు ఫీ రెగ్యులేటింగ్ కమిటీ నిబంధనలు పాటించడం లేదన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలో పని చేసే ఫ్యాకల్టీ వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు.



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెడికల్ సీట్ల మాదిరిగా ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లు భర్తీ చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక సర్టిఫికెట్స్ రాని విద్యార్థులకు బిజెపి అండగా ఉంటుందన్నారు. పూర్తి స్థాయిలో కాలేజీలు తనిఖీలు చేసి న్యాక్ గుర్తింపు ఇవ్వాలన్నారు.



# ఆర్టీసీ తొలి ఉమన్ డ్రైవర్ సరిత ఎంతోమందికి ఆదర్శం

## అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా చేరిన సరిత, ఈ దేశంలోని ఎంతోమంది మహిళలకు ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం డ్రైవర్‌సరిత, మంత్రి సురేఖను జూబ్లీహిల్స్ నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సరితను శాలువాతో మంత్రి ఘనంగా సత్కరించారు.రానున్న రోజుల్లో మరింత రాణించాలని అభిలాషించారు.ఈ నేపథ్యంలో సరిత తనకుటుంబ సమస్యలు మంత్రి సురేఖకు నివేదించగా, ఎటువంటి సమస్యలున్నా తనను సంప్రదించాలని, సూచించగా ఆమె మంత్రి కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా డాక్టర్ వెంకటరమణ

## 5 సంవత్సరాలపాటు కొనసాగింపు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** న్యూఢిల్లీలోని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పిసిఐ) కేంద్ర పాలకమండలి సభ్యులుగా హైదరాబాద్‌లోని ఆజాద్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముప్పవరపు వెంకటరమణ నియమితులయ్యారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసిటిఇ) ఆయనను పిసిఐ కేంద్ర పాలక మండలి సభ్యులుగా నామినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డాక్టర్ వెంకటరమణ ఇప్పటికే గత ఐదు సంవత్సరాలనుంచి పిసిఐ కేంద్ర కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్నారు. ఇపుడు రెండోసారి ఆయనను పిసిఐ సభ్యుడిగా నియమిస్తూ బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన పదవీ కాలం ఈ ఏడాది జూన్ 18 నుంచి 2030 జూన్ 17వ తేదీ వరకు కొనసాగనుంది. 5 సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. డాక్టర్ వెంకటరమణ సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతానికి చెందినవారు.. ఆయన అఖిల భారత ఫార్మసీ టీచర్ల సంఘానికి ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. పిసిఐ సభ్య లుగా తిరిగి ఎంపికైన సందర్భంగా డాక్టర్ వెంకటరమణకు తెలంగాణ ఫార్మసీ కళాశాల యాజమాన్యాల సంఘం అభినందనలు తెలిపింది.

# నేడు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వర్క్‌షాప్

## అధ్యక్షత వహించనున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు బిజెపి సన్నద్ధం అవుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం కానున్నారు. శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అధ్యక్షత వహిస్తారని, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ బన్సల్, బిజెపి నాయకులు పాల్గొంటారని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

# కీలక అంశాలపై కేబినెట్ ఆమోదం లేకుండా కెసిఆర్ నిర్ణయాలు తీసుకోలేదు

## బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జూన్ 19, ప్రభాతవార్త:** కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్దప్రాజెక్ట్ నిర్మాణం జరిగిందని నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం లాంటి అతిపెద్ద ప్రాజెక్టును మంత్రివర్గం ఆమోదం లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలపై ఈటల రాజేందర్ స్పందిస్తూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేబి నెట్‌లో చర్చించాకే నిర్ణయం తీసుకున్నారన్నారు. అంతేకాకుండా కీలకమైన, ప్రధానమైన అంశాలను కేబినెట్ ఆమోదం చేయకుండా కేసీఆర్ ఎప్పుడు నిర్ణ యాలు తీసుకోలేదన్నారు. మీ డిపార్ట్‌మెంట్‌లో ఏ నిర్ణయం తీసుకోవాలి అను కున్నా కేబినెట్‌లో పెట్టండి అని కెసిఆర్ మంత్రులకు చెప్పేవారని తెలిపారు. ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరు వేరుగా చూడాలి అన్నారు. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని అన్నారు.

## ధన్వాడ రైతులకు సంకెళ్లపై రైతు కమిషన్ సీరియస్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ధన్వాడలో రైతులకు సంకెళ్లు వేసిన సంఘటన సంచలనమైంది. ఈ ఘటనపై తెలంగాణ రైతు కమిషన్ సీరియస్ అయ్యింది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల 4న రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో విధ్వంసం సృష్టించారనే ఆరోపణలతో 12 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని అలంపూర్ కోర్టుకు హాజరుపర్చే సమయంలో సంకెళ్లు వేసి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈ ఘటనపై రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు బేడీలు వేయడం అమానవీయ చర్య అని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నామని, ఒక ఆర్ఎస్ఐ, ఇద్దరు ఏఆర్ఎస్ఐలను సస్పెండ్ చేశామని ఎస్పీ శ్రీనివాసరావు కమిషన్ చైర్మన్‌కు వివరణ ఇచ్చారు.



## ఐదు అసెంబ్లీ స్థానాలకు ప్రశాంతంగా ఉపఎన్నికల పోలింగ్!

**న్యూఢిల్లీ, జూన్ 19:** నాలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. లూథియానా (పంజాబ్), కాళీగంజ్ (పశ్చిమబెంగాల్), కాడి, విసవదర్ (గుజరాత్), నీలంబూర్ (కేరళ) స్థానాల్లో ఉపఎన్నికలు జరిగాయి. ఈ ఐదుచోట్లా అధికార పార్టీలకు చెందిన స్థానాలు మూడు ఉండగా, ఒక చోట విపక్ష ఆప్, మరోచోట స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. పంజాబ్‌లోని లూథియానాలో ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ సింగ్ గోగి మరణించారు. దీంతో ఉపఎన్నిక బరిలో రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోరాను ఆప్ తన అభ్యర్థిగా నిలిపింది. ఇక కాంగ్రెస్ నుంచి భరత్ భూషన్ అషు, బీజేపీ నుంచి జైవాన్ గుప్తా పోటీచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లోని కాళీగంజ్ టీఎంసీ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మరణించారు. దీంతో ఆయన కుమార్తెను అధికార పార్టీ బరిలో నిలిపింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ స్థానాన్ని దక్కించుకుని తన బలాన్ని చాటుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఇక గుజరాత్‌లో కాడి బీజేపీ ఎమ్మెల్యే కర్సాన్‌భాయ్ సోలంకీ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అదేవిధంగా విసవదర్ ఆప్ ఎమ్మెల్యే భయానీ భూపేంద్రభాయ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ రెండు చోట్ల త్రిముఖపోటీ నెలకొన్నది. రెండు స్థానాలను నిలుపుకోవాలని బీజేపీ, ఆప్ భావిస్తుండగా, ఇరు పార్టీలను ఖంగు తినిపించాలని కాంగ్రెస్ చూస్తున్నది. వచ్చే ఏడాది అసెబ్లీ ఎన్నికలు జరుగునున్న కేరళలో నీలాంబరు స్థానానికి ప్రస్తుతంఉప ఎన్నిక జరుగుతున్నది. గత ఎలక్షన్లలో ఈ సీటు నుంచి కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన పీవీ అన్వర్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో జరుగుతున్న ఉపఎన్నికలో ఆయన ఇండిపెండెంట్‌గా మరోసారి పోటీచేస్తుండగా, కాంగ్రెస్, వామపక్ష కూటమి తమ అభ్యర్థులను పోటీకి దింపాయి. గురువారం నాటిపోలింగ్‌లో కేరళలోని నీలాంబూర్ స్తానంలో 70శాతంపోలింగ్ నమోదురాగా పంజాబ్‌లోనిలూథియానాలో 49శాతం నమోదయింది. ఇక పశ్చిమబెంగాల్‌లోని కాలిగంజ్‌స్థానంలో 69శాతం నమోదయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. గుజరాత్‌లోని విసావదార్‌స్థానంలో 54 శాతం, కాడి అసెంబ్లీ స్థానంలో 54శాతంవరకూ పోలింగ్ జరిగింది. ఈ ఉపఎన్నికల ఫలితాలు జూన్ 23న వెలువడనున్నాయి.

## 22న మదురైలో మురుగన్ భక్తుల మహాసమ్మేళనం

### అతిథులుగా యోగి ఆదిత్యనాథ్, పవన్‌కల్యాణ్, డా.గజల్ శ్రీనివాస్

**విజయవాడ.జూన్19,ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ మున్నని సంస్థ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకం గా మధురైలో ఈ నెల 22 వ తారీఖున మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 'మురుగన్ భక్తుల మహా సమ్మేళనాన్ని ' అమ్మ తిడల్, పాండి కొవిల్ సమీపంలో ఏర్పాటు చేశామని, సుమారు 3 లక్షలమందికి పైగా భక్తులు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, తెలం గాణ, తమిళనాడు, కేరళ నుండి హాజరు కానున్నారని హిందూ మున్నని అధ్యక్షులు కాడేశ్వర సుబ్రహ్మణ్యయన్ , సంస్థ ప్రతినిధి ఎలంగోవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ అదిత్య నాథ్, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సేవ్ టెంపుల్స్ భారత్ జాతీయ అధ్యక్షుడు , ముమ్మారులు గిన్నిస్ ప్రపంచ రికార్డుల గాయకులు డా.గజల్ శ్రీని వాస్‌లు ఆత్మీయ అతిథులుగా పాల్గొన నున్నారని తెలిపారు. సనాతన ధర్మ హిం దూ బంధువులు పెద్ద యెత్తున పాల్గొనాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు.. వివిధ రాష్ట్రాల నుండి కళాకారులు ప్రత్యేక సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలు వుంటా యని నిర్వాహకులు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న సారా మాథ్యూస్

## 'రజాకార్ సినిమాకు గద్దర్ అవార్డును ఉపసంహరించుకోవాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 'రజాకార్' చిత్రానికి గద్దర్ అవార్డును అందించడాన్ని పలువురు ప్రముఖులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం తక్షణమే ఈ అవార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తామని వారు హెచ్చరించారు. గురువారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస క్లబ్‌లో ఎపిసిఆర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రముఖులు ఎన్. వేణుగోపాల్, సైబాబా, కన్నెగంటి రవి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, పసునూరి రవీందర్, సారా మాథ్యూస్, సనాఉల్లాఖాన్, అఫ్సర్ జహాన్, ఫరాజ్ అహ్మద్ తదితరుల ప్రసంగించారు. ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ అసలు గద్దర్ నంది అవార్డులనే తిరస్కరించారని, గద్దర్‌కు సినిమాలకు ఎలాంటి సంబంధం లేదని, ఆయన గాయకుడు సాహిత్యకారుడని చెప్పారు. ఈ సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, ఈ సినిమాలో అసలైన చరిత్ర లేదని, అన్ని అబద్ధాలేనని సంఘ్‌పరివార్ ఏజెండాపై ఈ సినిమా వచ్చిందని ఆరో పించారు. అసలు ఈ సినిమాలో తెలంగాణ చరిత్రే లేదన్నారు. సైబాబా మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే ఈ సినిమాను తీశారని, రజాకార్ సినిమాకు గద్దర్ పేరిట అవార్డును ప్రదానం చేయడాన్ని సమాజం వ్యతి రేకిస్తున్నదని, తక్షణమే అవార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# స్విస్ బ్యాంకుల్లో 3 రెట్లు పెరిగిన భారతీయుల డిపాజిట్లు




**జ్యూరిచ్, జూన్ 19:** స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు మూడు రెట్లు పెరిగినట్టు తాజా నివేదిక వెల్లడించింది. స్విట్జర్లాండ్ కేంద్ర బ్యాంక్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు మూడింతలు పెరిగి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంకులకు అంటే సుమారు ..37,600 కోట్లకు చేరింది. ఈ పెరుగుదలకు ప్రధానంగా స్థానిక శాఖలు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా వచ్చిన నిధులే వృద్ధికి కారణం. అయితే, వ్యక్తిగత కస్టమర్ ఖాతాలలో ఉన్న నగదు కేవలం 11 శాతం మాత్రమే పెరిగి 346 మిలియన్ స్విస్ ఫ్రాంకులు భారత కరెన్సీలో సుమారు 3,675 కోట్లు కి చేరుకుంది. ఇది మొత్తం నిధులలో దాదాపు పదో వంతు మాత్రమే. స్విస్ గణాంకాల ప్రకారం 2023లో భారతీయుల డిపాజిట్లు గణనీయంగా తగ్గి ఇప్పుడు తిరిగి వృద్ధిని నమోదుచేశాయి. 2023లో వ్యక్తులు, కంపెనీలు స్విస్ బ్యాంక్లల్లో దాచుకున్న నగదు 70 శాతం తగ్గి, నాలుగేళ్ల కనిష్ఠం 1.04 బిలియన్ స్విస్ ఫ్రాంకులు పడిపోయింది. కానీ 2024లో ఈ మొత్తం మళ్లీ భారీగా పెరగడం గమనార్హం. 2021 తర్వాత అత్యధిక స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. ఆ ఏడాది భారతీయుల నిల్వలు 14 ఏళ్ల గరిష్ఠాన్ని తాకాయి. ఏకంగా 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంకులకు చేరుకున్నాయి.

స్విస్ నేషనల్ బ్యాంకు గణాంకాల ప్రకారం కస్టమర్ డిపాజిట్లు 346 మిలియన్ స్విస్ ఫ్రాంకులు, ఇతర బ్యాంకుల ద్వారా 3.02 బిలియన్ స్విస్ ఫ్రాంకులు పెరిగాయి. అలాగే, ట్రస్టుల ద్వారా నిధులు దాదాపు 41 మిలియన్ ఫ్రాంకులు, బాండ్లు, సెక్యూరిటీల రూపంలో 135 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లతో రికార్డు స్థాయికి చేరుకుందని బ్యాంకులే చెపుతున్నాయి. 2006లో దాదాపు 6.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లతో రికార్డు స్థాయికి చేరుకుందని బ్యాంకులే చెపుతున్నాయి. 2011నుంచి ఏడేళ్ల తర్వాత నుంచి తగ్గుముఖం పట్టింది. స్విస్ లెక్కల ప్రకారం వ్యక్తులు, బ్యాంకులు, సంస్థల డిపాజిట్‌లతో సహా స్విస్ బ్యాంకులలోని భారతీయ కస్టమర్ల అన్ని రకాల నిధులను పరిగణనలోకి తీసుకుంటుంది. ఇందులో భారత్‌లో స్విస్ బ్యాంకుల శాఖల డేటా, అలాగే డిపాజిట్లు కానివి కూడా ఉన్నాయి. మరోవైపు, స్విస్ బ్యాంకులలో భారతీయులకు అత్యంత నమ్మకమైన బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్ స్థానిక బ్యాంకింగ్ గణాంకాలు దాదాపు 6 శాతం పెరుగుదలను నమోదుచేశాయి. స్విస్ నేషనల్ బ్యాంక్ తెలిపిన గణాంకాలు అధికారికంగా బ్యాంకులు నివేదించినవి మాత్రమే. ఇవి బ్లాక్ మనీకి సంబంధించినవి కావు. అలాగే, ఈ గణాంకాలు ఇతర దేశాల సంస్థల పేర్లపై ఉన్న ఖాతాలను లేదా ఎన్ఆర్ఐల ఖాతాలను కూడా పరిగణనలోకి తీసుకోవు. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ గణాంకాలు కూడా విడుదలయ్యాయి, ఇవి వ్యక్తుల డిపాజిట్లకు మరింత ఆధారం. ఈ లెక్కల ప్రకారం 2024లో భారతీయుల డిపాజిట్లు సుమారు 6 శాతం పెరిగి 74.8 మిలియన్ డాలర్లు అంటే రూ. 650 కోట్లకి చేరాయి. 2023లో 25%, 2022లో 18% 2021లో 8%తగ్గితే.. 2020లో 39%పెరిగింది. 2007లో గరిష్ఠంగా 2.3 బిలియన్ డాలర్లు అంటే రూ. 9,000 కోట్లు కావడం విశేషం. 2018 నుంచి భారత్-స్విట్జర్లాండ్ మధ్య సమాచార మార్పిడి వ్యవస్థ అమలులో ఉంది. మొదటిసారి 2019లో భారత ఖాతాదారుల పూర్తి డేటా భారత్‌కు అందజేసింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఇది జరుగుతోంది. ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు భావించే ఖాతాల గురించి ఇప్పటికే వందల కేసుల్లో సమాచారం ఇచ్చినట్లు స్విస్ అధికారులు తెలిపారు. కాగా, ఇతర దేశాల విషయానికి వస్తే 2024లో నిధులు 977 బిలియన్ స్విస్ ఫ్రాంకుల మేర తగ్గాయి 2023లో 983 బిలియన్ ఫ్రాంకులుంటే కొంతమేర తగ్గాయి. ఇదే సమయంలో భారతీయుల ఆస్తుల విలువ 1.59 బిలియన్లు ఉంది (9%వృద్ధి). ఈ జాబితాలో 222 స్విస్ ఫ్రాంకులతో యూకే మొదటి స్థానంలో ఉండగా తర్వాత అమెరికా ( 89 బిలియన్ ఫ్రాంకులు), వెస్ట్ ఇండీస్ 68 బిలియన్లు, జర్మనీ, ఫ్రాన్స్, హాంకాంగ్, లక్సెంబర్గ్, సింగపూర్, గుర్నేస్, యూఏఈ ఉన్నాయి. ఇక, 2023 చివర్లో 67వ స్థానంలో ఉన్న భారత్.. 2024 చివరికి 48వ స్థానానికి చేరింది. కానీ 2022లో 46వ స్థానంలో పోలిస్తే తక్కువే. దాయాది పాకిస్తాన్ దేశానికి సంబంధించిన డిపాజిట్లు: 272 మిలియన్ ఫ్రాంకులుఉన్నట్లు తేలింది. అదే 2023లో 286 మిలియన్లవరకూ ఉన్నట్లు అంచనా , బంగ్లాదేశ్ డిపాజిట్లు భారీ వృద్ధి నమోదుచేసింది. అది 18 మిలియన్ల నుంచి 589 మిలియన్‌కు చేరింది. భారత్ మాదిరిగానే ఈ రెండు దేశాల్లో కూడా స్విస్ బ్యాంకుల్లోని బ్లాక్ మనీ రాజకీయ ప్రాధాన్యత అంశమే.

# భారతదేశ ఆశాకిరణం.. రాహుల్ గాంధీ

### బర్త్‌డే విషెస్ తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

### ప్రధాని కావాలని ప్రతీ హృదయం కోరుకుంటోంది: డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 19:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రియతమ నాయకుడికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాహుల్ గాంధీని భారతదేశ ఆశాకిరణం అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి తన పోస్ట్‌లో భారతదేశపు ఆశాకిరణం, నా నాయకుడు,నిశ్శబ్ద బలానికి ప్రతిరూపం, నిజమైన దార్శనికుడు, కరుణామయుడు, వివేకవంతుడు, ప్రజల ప్రయోజనాలను హృదయంలో నింపుకున్న వ్యక్తి, భారతదేశ ఆత్మ కోసం పోరాడుతున్న సైనికుడు, భారతదేశాన్ని నిజంగా ప్రేమించే వారందరికీ స్ఫూర్తి, అన్నింటికంటే మించి నేను కలిసిన అత్యుత్తమ వ్యక్తుల్లో ఒకరైన రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. 'దేశ ప్రజలు మీ పట్ల మీకున్న ప్రేమను మరింతగా తెలుసుకోవాలి, భారతదేశం పట్ల, ప్రతి భారతీయుడి పట్ల మీకున్న నిజమైన నిబద్ధతను మరింత మంది అర్థం చేసుకోవాలి' అని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాని కావాలని ప్రతి హృదయం ఆకాంక్షిస్తోందన్నారు. 'సామాజిక న్యాయం, అందరికీ సమాన హక్కుల కోసం మీకున్న అచంచలమైన నిబద్ధత మాకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తుంది. మీ దార్శనికతతో స్ఫూర్తి పొంది, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించే దిశగా సాహసోపేతమైన అడుగు వేస్తూ కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గృహ జ్యోతి నుంచి రైతు రుణమాఫీ, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, చేయూత వరకు ప్రతి సంక్షేమ పథకం అందరికీ సమానత్వం, గౌరవం అనే భావనలోనే పాతుకుపోయింది' అని భట్టి విక్రమార్క అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

## నాలుగోసారి సిట్ ముందుకు ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నాల్గోసారి గురువారం సిట్ విచారణకు హాజరయ్యారు. సుమారు 618మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు గుర్తించింది. దీంతో మరింత లోతుగా విచారణ చేపట్టిన సిట్ అధికారులు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి, పలువురు నేతల ఇచ్చిన వాంగ్మూలాలతో ఆయనను విచారించినట్లు సమాచారం. అదేవిధంగా ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆధారంగా పలురకాలుగా అడిగినట్లు తెలుస్తోంది. ప్రణీత్‌రావు వాంగ్మూలాన్ని సైతం ఆయన ముందు వివరించింది. ప్రభాకర్‌రావు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారనే కోణంలో విచారణ కొనసాగినట్లు వెల్లడవుతుంది. ఇదిలా ఉండగా నాంపల్లి కోర్టులో కస్టోడియల్ విచారణకై నాంపల్లి కోర్టులో పిల్ దాఖలు చేసేందుకు సిట్ రెడీ అయినట్లు సమాచారం. టెలికాం సర్వీస్ నుంచి తెప్పించుకున్న కీలక నెంబర్లపైన కూడా విచారించినట్లు తెలుస్తుంది.


విచారణకు హాజరవుతున్న ఎస్ఐబి మాజీ అధికారి ప్రభాకర్‌రావు

# వ్యవసాయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సాంకేతికత ప్రత్యేకించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వృద్ధిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం మంత్రి నెదర్లాండ్‌కు చెందిన కంపెనీ ప్రతినిధులతో సమావేశ మ య్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి వ్యవసాయరంగాన్ని పెద్ద ఎత్తున ఆధునికీకరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు ప్రణాళి కాబద్ధంగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడం వంటి సౌక ర్యాలు కల్పించగలమన్నా రు. అంతేకాకుండా, పంటలపై వచ్చే చీడపీడలను మొబైల్ ఫోన్ కెమెరా ద్వారా స్కాన్ చేసి గుర్తించే టెక్నాలజీని రాష్ట్రంతో భాగస్వామ్యంగా తీసుకురావడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. వీటిపై మంత్రి స్పందిస్తూ నెదర్లాండ్స్ ప్రతినిధుల సూచనలు పరిశీలనకు తీసుకుంటామన్నారు. వారు వివరించిన సాంకేతికతను మొదటగా పరిశీలనచేసి, ఏయే ప్రభుత్వ పథకాలలో దీన్ని సమర్థవంతంగా వినియోగించవచ్చో వ్యవసాయశాఖ అధికారులు అధ్యయనం చేస్తారని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## నాపై నమోదైన కేసులు కొట్టివేయండి

### హైకోర్టును ఆశ్రయించిన కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి,తెలంగాణ బిజెపి కీలక నేత బండి సంజయ్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన నాలుగు కేసులు కొట్టేయాలని గురువారం క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మరోవైపు ఇటీవలే ఓ కేసులో బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. సూర్యపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల హైకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలోనే మిగిలిన కేసులను కూడా కొట్టివేయాలని గురువారం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

# రికార్డు వేగంతో రైతు భరోసా

## నాలుగు రోజుల్లోనే రూ.6,405 కోట్లు

## 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రికార్డు వేగంతో పంపిణీ చేస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. వ్యవసాయ శాఖ అందించిన జాబితాల ప్రకారం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో రూ. 6,405 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. గురువారం సాయంత్రం వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమైనట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం ఒక కోటి ఆరు లక్షల ఎకరాలకు (1.06 కోట్లు) ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది.

ఒక ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటివరకు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారు.వానాకాలం పంటలకు సరైన అదునులో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులను వేగంగా చెల్లింపులు చేస్తున్న తీరు కొత్త రికార్డు నెలకొల్పిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

## ఖమేనీ ఇక ఎంతమాత్రం ఈ భూమ్మీద ఉండటానికి వీల్లేదు

### ఇజ్రాయెల్ భీకర ప్రతిజ్ఞ!

**జెరూసలెం, జూన్ 19:** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా ఖమేనీని అంతమొందించి, ఆయన పాలనకు చరమగీతం పాడతామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెల్‌అవీవ్ సమీపంలోని ఓ ఆసుపత్రిపై ఇరాన్ క్షిపణి దాడి ఘటన అనంతరం ఆయన ఈ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ దాడిలో కనీసం 47 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ సహాయక బృందాలు నివేదించాయి. పిరికి నియంత ఖమేనీ తన సురక్షిత బంకర్‌లో దాక్కుని ఇజ్రాయెల్‌లోని ఆసుపత్రులు, నివాసాలపై క్షిపణులు ప్రయోగిస్తున్నాడు. ఇది అత్యంత తీవ్రమైన యుద్ధ నేరం. దీనికి ఖమేనీ పూర్తి బాధ్యత వహించాలి. ఆయనను వదిలిపెట్టే ప్రసక్తేలేదు. ఖమేనీ ఇక ఎంతమాత్రం ఈ భూమ్మీద ఉండటానికి వీల్లేదు అని కాట్జ్ ఎక్స్ వేదికగా తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న ముప్పును తొలగించడానికి, ఖమేనీ పాలనను బలహీనపరిచేందుకు టెహ్రాన్‌లోని ప్రభుత్వ, వ్యూహాత్మక లక్ష్యాలపై దాడుల తీవ్రతను పెంచాలని తాను, ప్రధానమంత్రి కలిసి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్‌ను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. తాము ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోలేదని, సమీపంలోని ఇజ్రాయెల్ సైనిక, గూఢచార స్థావరమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. ఆసుపత్రికి కేవలం పేలుడు తరంగాల ప్రభావం మాత్రమే తగిలిందని ఇరాన్ ప్రభుత్వ వార్తాసంస్థ పేర్కొంది. ఇదిలా ఉండగా, ఇరుదేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో పలువురు సీనియర్ ఇరాన్ సైనిక అధికారులు, అణు శాస్త్రవేత్తలు మరనించినట్లు, ఇరాన్‌లోని అణుమౌలిక సదుపాయాలు, ముఖ్యంగా టెహ్రాన్‌లోని 50కిపైగా లక్ష్యాలు ధ్వంసమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా సైనికజోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్ హెచ్చరించింది. తమ దేశం ఎన్నిటికి లొంగిపోదని, బెదిరింపులకు భయపడబోమని ఖమేనీ ఓ టెలివిజన్ ప్రసంగంలో స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులు మరింత తీవ్రమైన ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని అంతర్జాతీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వ్యవసాయాన్ని కబళిస్తున్న కార్పొరేట్ కంపెనీలు

### నాలుగింటి అధీనంలో విత్తనం, పురుగుమందులు

### అన్నదాతపై కరెంట్ మీటర్ల భారం మోపేందుకు కేంద్రం రెడీ


### అరిబండి ఫౌండేషన్, రైతు సంఘం సెమినార్‌లో ఏఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 19, ప్రభాతవార్త:** మన దేశంలో వ్యవసాయాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు మన దేశ వ్యవసాయ రంగాన్ని కలిగిస్తున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగు మందులు ఆ కంపెనీల గుత్తాధితప్యంలో (46శాతం) బంధీ అవుతున్నాయని విమర్శించారు. అందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. సరళీకరణ విధానాల(1990) ప్రభావం వ్యవసాయంపై పడిందన్నారు. సరళీకరణ విధానాలతో రైతులకు అనేక సౌకర్యాలు అందుతాయని నాటి పాలకులు నమ్మబలికారని తెలిపారు.

కానీ ఆ తర్వాత దేశంలో రైతులు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయం రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో విజూ కృష్ణన్ మాట్లాడారు. బీజేపీ అధికారం లోకి వచ్చాక రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనీ, స్వామినాథన్ కమిటీ సిఫారులను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఒక్కొక్క మీటర్‌కు రూ. 8వేల నుంచి 12 వేల భారం రైతులపై పడుతున్నదని చెప్పారు.

వేల కోట్ల ఆస్తులు కలిగి, లాభాల్లో ఉన్న చంఢీగఢ్ విద్యుత్ రంగాన్ని గో యంక కంపెనీకి అప్పగిం చిందని గుర్తు చేశారు. దీంతో రైతులపై అదనపు భారం పడిందన్నారు. కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డి రాజిరెడ్డి మాట్లాడుతూ... వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు వేయాలని సూచించారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి అరిబండి మనోహర్, కోశాధికారి అరిబండి అనిల్, సభ్యులు అమర్‌నాథ్, అరిబండి ప్రసాదరావు భార్య ఝాన్సీ, ఆయన కోడళ్లు, బంధువులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.


అరిబండి ప్రసాద్‌రావు రచించిన నేను మనభూమి : ఒక జీవన స్మృతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G లిమిటెడ్
ఆపరేషన్ : సూర్యాపేట సర్కిల్
బహిరంగ టెండర్ ప్రకటన సం. 01/2025-26 (పొడిగింపు-I)
సూర్యాపేట సర్కిల్‌లో వివిధ సివిల్ పనులకు అర్హులైన వెండర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. బహిరంగ -టెండర్‌కు షెడ్యూల్ తేదీలు స్పెసిఫికేషన్ నం.01/25-26, 03/25-26 మరియు 04/25-26 యొక్క టెండర్ నోటీస్ 0-01/2025-26 ఆఫ్ SE/OP/సూర్యాపేట, తేదీలు ఈ క్రింది విధంగా: 1. బిడ్ డౌన్‌లోడ్ 20.06.2025 15.00 గం. నుండి ప్రారంభం. 2. బిడ్ హార్డ్ కాపీలు DD's మరియు BG's తో సహా దాఖలుకు చివరి తేదీ మరియు సమయం: 27.06.2025 15.00 గం. వరకు. 3. బిడ్ తెరచు తేదీ, సమయం: 27.06.2025 16.00 గం. వద్ద. వివరాలు www.tgsouthernpower.com వద్ద అందుబాటులో ఉన్నాయి. ఫోన్ నం.8712472748. సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.3793-PP/CL/Advt/1/2025-26, తేది: 19.06.2025

# 'పెద్ది' ఫస్ట్ షాట్ గ్లింప్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబ రేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని



నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే చిత్రం యూనిట్, విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్లో కీలక సన్నివేశాలతో పాటు ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మ్యాసీవ్ సెట్లో భారత సినిమా చరిత్రలో ఎన్నడూ లేనంత అద్భుతమైన యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది. ఇది ఇండియన్ యాక్షన్ సినిమాల ప్రమాణాలను పెంచేలా ఉన్న హైఆక్టేన్, హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ట్రైన్ ఎపిసోడ్. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అద్భుతంగా సెట్స్‌ని డిజైన్ చేశారు. ఈ ట్రైన్ స్టంట్ కోసం రూపొందించిన సెట్స్ కన్నులకు పండుగగా ఉండబోతున్నాయి. ఈ ఎపిసోడ్ లో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనుంది. పుష్ప 2 వంటి చిత్రాల్లో తనవర్కింగ్ స్టయిల్‌తో ఆకట్టుకున్న నబాకాంత్ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్ కు కొరియోగ్రఫీ వహిస్తున్నారు. పెద్ది ఐకానిక్ క్రికెట్ షాట్ కి ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం పలు హై ప్రొఫైల్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ఆయన, ఈ చిత్రంలోనే అత్యంత భారీగా రూపుదిద్దుకున్న యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నారు.

# డిఫరెంట్ మూవీ 'కుబేర'

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్ ఛేంజర్‌గా నిలవబోతోంది. కుబేర తెలుగు, తమిళం,హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకానుంది. ఈ సందర్భంగా కింగ్ నాగార్జున విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **కుబేర లాంటి మల్టీ స్టారర్ ప్రాజెక్ట్ చేయడానికి కారణం?** మంచి కథలు రావాలంటే స్టార్స్ కలిసి పనిచేయాలి. ఇంతకు ముందు కూడా నేను చాలా సినిమాలు చేశాను. నాన్న(ఏఎన్ఆర్) ఎన్టీఆర్, కృష్ణ, శోభన్ బాబు.. ఇలా అంతమంది కలిసి ఎన్నో సినిమాలు చేశారు. శేఖర్ కమ్ములతో వర్క్ చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. ఆనంద్ దగ్గర నుంచి ఆయన సినిమాలు గురించి మనందరికీ తెలుసు. ఆయన సినిమాలు నాకు బాగా ఇష్టం. ఆయన కథల్లో సోషల్ రెలివెంట్ పాయింట్ ఉంటుంది. మిగతావన్నీ కూడా కమర్షియల్‌గానే ఉంటాయి. అద్భుతమైన పాటలు ఉంటాయి. **కుబేరలో ఉన్న యూనిక్ పాయింట్ ఏమిటి?** కుబేరలో చాలా మంచి యూనిక్ పాయింట్ ఉంది. ఇప్పుడున్న సొసైటీకి ఆ




పాయింట్ చాలా రిలెవెంట్. శేఖర్‌కి ఈ పాయింట్ మైండ్‌లో ఎప్పటినుంచో ఉంది. **ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?** నాది మిడిల్ క్లాస్ క్యారెక్టర్. సిబిఐ ఆఫీసర్ క్యారెక్టర్‌లో కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య ఆ క్యారెక్టర్ ఉంటుంది. నా క్యారెక్టర్‌లో చాలాషేడ్స్ వుంటాయి. శేఖర్ నా క్యారెక్టర్‌ని చాలా అద్భుతంగా రాశారు. పటిల్ పెర్ఫార్మెన్స్‌కి మంచి స్కోప్ ఉండే క్యారెక్టర్. **శేఖర్ మీ ఇమేజ్‌కి తగ్గట్టు స్క్రిప్ట్ లో ఏమైనా మార్పులు చేశారా?** లేదండి. ఆయన ఏమనుకున్నారో అదే చేశారు. నేను కూడా ఎలాంటి మార్పులు అడగలేదు. మారిస్తే చెడిపోతుంది. **మీ ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శేఖర్ కమ్ములతో చేశారు కదా.. ఆయన స్టైల్ గురించి ముందుగా ఎవరినైనా అడిగారా?** చైతన్యని అడిగాను. ఆయన వర్కింగ్ స్టైల్ చాలా బాగుంటుంది. మీరు సినిమా అంతా ఎంజాయ్ చేస్తారని చెప్పాడు. **ఇప్పుడు వరకు మీరు చేసిన క్యారెక్టర్ అన్నిటిలో కుబేరలో క్యారెక్టర్ డిఫరెంట్ గా ఉంటుందా?** ఈ సినిమా కథ డిఫరెంట్. నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్... అవన్నీ కూడా కొత్తగా ఉంటాయి. శేఖర్ కమ్ముల స్టైల్‌లో ఉంటాయి. సినిమాని దాదాపుగా రియల్ లొకేషన్స్‌లోనే షూట్‌చేశాం. తిరుపతి, ముంబై, గోవా, బ్యాంకాక్ ఇలా అన్ని బిగ్ రియల్ లొకేషన్స్‌లో.



# హైదరాబాద్‌లో 'తెలుసు కదా' చివరి షెడ్యూల్

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా తెలుసు కదాతో అలరించబోతున్నారు. ఈ మూవీతో ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా డెబ్యూ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.

ఈ మూవీ చివరి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చివరి షెడ్యూల్ జరుగుతోంది. సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టిలపై కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీనితో సినిమా మొత్తం ప్రొడక్షన్ పూర్తవుతుంది. సైమల్టేనియస్‌గా సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ నెలలో ఈ సినిమా మొదటి పాటను విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించాలని టీం ప్లాన్ చేస్తోంది. ఈచిత్రానికి ఎస్.థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. తెలుసు కదా మనసు హత్తుకునే కథ. ఇది లవ్, పర్శనల్ గ్రోత్, రిలేషన్షిప్స్ మధ్య సాగుతుంది. అద్భుతమైన ఎమోషన్, హ్యూమర్‌తో ప్రేక్షకులని అలరించబోతోంది.

# 'ఉప్పుకప్పురంబు' ట్రైలర్

భారతదేశపు అత్యంత ప్రియ మైన వినోదాల గమ్యస్థానం, ప్రైమ్ వీడియో రెండవ తెలుగు ఒరిజినల్ చిత్రము, నిరంకుశాధికార ప్రభుత్వము ద్వారా మరణించిన వారి సంఖ్య పెరిగిపోయిన కారణముతో శ్మశానములో చోటు తక్కువ అయిన ఒక దక్షిణ భారత పల్లె టూరులో చిత్రీకరించబడిన వ్యంగ్య హాస్యభరిత చిత్రము, ఉప్పు కప్పురంబు యొక్క ట్రెయిలర్‌ను విడుదల చేసింది. ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై లి. బ్యానర్‌పై రాధిక లావూ నిర్మించిన మరియు అని. ఐ.వి. శశి, దర్శకత్వం వహిం చిన మరియు వసంత్ మరింగంటి రచించిన ఈ రాబోయే చిత్రములో సుహాస్, జాతీయ అవార్డు గెలుచు కున్న నటి కీర్తి సురేష్ ప్రధానపాత్రలు పోషించగా, బాబు మోహన్, శత్రు, మరియు తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రలలో నటించారు. ఉప్పుకప్పురంబు చిత్రము భారతదేశము మరియు ప్రపంచవ్యాప్తంగా 240దేశాలు, భూభాగాలలో జులై 4న ప్రైమ్ వీడియోపై ప్రీమియర్‌గా ప్రత్యేక ప్రసారానికి సిద్ధంగాఉంది. తెలుగు భాషలో మరియు హిందీ, తమిళం, మళయాళం మరియు కన్నడ భాషలలో డబ్బింగ్ మరియు ఇంగ్లీష్‌తో కలిపి 12 భాషలలో సబ్ టైటిల్స్‌తో ప్రసారంఅవుతుంది. 1990 ప్రారంభములో సెట్ చేయబడిన ఈ చిత్ర కథ, చిట్టి జయపురం అనే పల్లెటూరిలో ప్రారంభం అవుతుంది. ఈ పల్లెటూరు ఒక చిత్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉంటుంది. ఈ ఊరిలో మరణించినవారిని పూడ్చి పెట్టటానికి చోటు లేదు. కొత్తగా నియమిం చబడిన, ఆదర్శవంతురా లైన గ్రామాధికారి, అపూర్వ (కీర్తి సురేష్) పదవి చేపట్టినప్పుడు ఒక మహిళ అధికారములో ఉండడం జీర్ణించుకోలేని స్థానికులు ఆమెను



అపహాస్యం చేస్తూ ఉంటారు. సమస్యలను పరిష్కరించాలని నిర్ణయిం చుకున్న ఆమె, ఆ ఊరి కాటికాపరి అయిన చిన్న (సుహాస్) సహాయం కోరుతుంది. కాని వీరి ఉద్దేశాలు ఊరిలో గందరగోళాన్ని రేకెత్తిస్తాయి. శ్మశానములో స్లాట్ బుక్ చేసుకోవడానికి లక్కీ డ్రా నుండి పెరుగుతు న్న గ్రామీణ నాటకము వరకు, ఈట్రెయిలర్ చమత్కారం, హాస్యం, భావోద్వేగాల రోలర్ కోస్టర్‌ను అందిస్తుంది. ఈ ట్రెయిలర్ సామాజిక వ్యంగ్యముతో ఊహించని గందరగోళాన్ని సృష్టించే ఒక ప్రపంచములోకి తొంగి చూస్తుంది. ఈ ఉప్పుకప్పురంబు కథ యొక్క వ్యంగ్య మరియు హృద్యమైన సమ్మేళనము నన్ను ఆకట్టుకుంది అని కీర్తి సురేష్ తెలిపారు. తన పాత్ర గురించి మాట్లాడుతూ, ఆమె ఇలా చెప్పుకొచ్చారు, అపూర్వ అనేది ఒక భిన్నమైన పాత్ర.




# 'రాజా సాబ్'తో టాలీవుడ్‌లోకి మాళవిక ఎంట్రీ

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవిక మోహనన్ రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్‌తో టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. రీసెంట్‌గా రిలీజైన ఈ సినిమా టీజర్‌లో మాళవిక స్టన్నింగ్ లుక్స్, బ్యూటిఫుల్ అప్పీయరెన్స్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. రాజా సాబ్ టీజర్‌కు మాళవిక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటున్న నేపథ్యంలో మాళవిక మోహనన్ సోషల్ మీడియా ద్వారా స్పందించింది. రాజా సాబ్ టీజర్‌కు వస్తున్న రెస్పాన్స్‌తో హ్యాపీగా ఫీలవుతున్నట్లు ఆమె తెలిపింది. ప్రభాస్‌ను ఫస్ట్ టైమ్ సెట్స్‌లో కలిసిన సందర్భాన్ని స్పెషల్ మూవ్ మెంట్‌గా తాను ఫీలైనట్లు మాళవిక తెలిపింది. ప్రభాస్ ఎంతో గౌరవంగా, స్నేహంగా ఉంటారని, బాగా మాట్లాడతారని ఆమె పేర్కొంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రాజా సాబ్ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



# '8 వసంతాలు' ఎమోషన్స్ డీప్‌గా కనెక్ట్ అవుతాయి..

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమోతోంది. ఈ చిత్రానికి ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించారు. అనంతిక సునీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్‌ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **మను సినిమా తర్వాత ఆరేళ్ల గ్యాప్ వచ్చింది కదా... ఇంత టైం పట్టడానికి కారణం?** కొన్ని కథలపై వర్క్ చేశాను. అయితే 8 వసంతాలు మెయిన్ ప్రాయారిటీ. స్త్రీ కోణంలోకి వెళ్లి ఆ సున్నితత్వాన్ని పట్టుకోవడానికి, కథ రాయడం కంటే స్త్రీ దృక్కోణాన్ని డెవలప్ చేసుకోవడానికి ఎక్కువ టైం పట్టింది. ఒక బలమైన స్త్రీ పాత్ర చుట్టూ కథను చెప్పాలని అనిపించింది. మా అత్తయ్యలు, ఇంట్లో, చుట్టుపక్కల చాలా బలమైన స్త్రీ పాత్రల మధ్య పెరిగాను. ఎప్పటినుంచో ఆ దృక్కోణం ఉంది. ఈ ఫిల్మ్‌తో ఒక పూర్ణస్థాయి తీసుకోవాలనిపించింది. **ఇంత బరువైన పాత్ర కోసం అనంతిక సునీల్‌కుమార్‌ను ఎంపిక చేయడానికి కారణం?** నేను రాసుకున్న పాత్రకు అనంతిక పర్ఫెక్ట్ యాప్ట్. కేవలం నటిగానే కాదు, దాదాపు 13 కళలలో ఆమెకు ప్రవేశం ఉంది. తనకి మార్షల్ ఆర్ట్స్ వచ్చు. తను ఈ పాత్రను ఎలా చేస్తుందో అనే డౌట్ ఎప్పుడూ లేదు. తను చక్కగా తెలుగు మాట్లాడుతుంది. శుద్ధి అయోధ్య పాత్రకు పూర్తి న్యాయం చేసింది. **టీజర్, ట్రైలర్‌లో వాడిన భాష, కవిత్వం ఇప్పటి జెన్‌జీ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతుందా?** మేము గ్రాంధికం వాడలేదు. ప్రేమంటే మనం చేరాల్సిన గమ్యం కాదు, చేయాల్సిన ప్రయాణం అని ఓ డైలాగ్ ఉంది. ఇందులో గమ్యం, ప్రయాణం పేర్లతో సినిమాలు వచ్చాయి. మేము కొత్తగా తీసుకొచ్చినవి ఏమీ లేవు. సినిమాలో రెండు పాత్రలు కూడా రచయితలే. ఆ పాత్రలు సహజసిద్ధంగా అలానే మాట్లాడుతాయి. భాషను బ్రతికించే శక్తి సినిమాకే ఉంది. సినిమాకి ఒక పవర్ ఉంది. ఎవరో ఒకరు ఆ భాష చూసి ఇష్టాన్ని పెంచుకోవచ్చు. నేను ఒక ప్రయత్నం చేశాను. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత ఎంతోమంది అభినందిస్తూ మెసేజులు చేస్తున్నారు. **8 వసంతాలు ట్రైలర్ చూసిన తర్వాత రెండు ప్రేమకథలు కనిపించాయి... ఇవి కాకుండా ఇంకా ఎలాంటి ఎలిమెంట్స్ చెప్పబోతున్నారు?** ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన డిగ్నిటీ కోల్పోకుండా ఉండే అమ్మాయి ప్రయాణం ఇది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన నిలదొక్కుకుంటుంది. ప్రేమ రెండు దశల్లో జరుగుతుంది. 19 ఏళ్లలో జరిగే ప్రేమ, 27 ఏళ్ల వయసులో జరిగే ప్రేమలో తను మానసికంగా ఉన్న తేడాను చాలా సున్నితంగా ఎక్స్‌ప్లోర్ చేయాలని అనుకున్నాను. దానికి తోడు గురుశిష్య పరంపరను చూపించాలనుకున్నాను.




# 'పాపా' చిత్రానికి ప్రేక్షకుల నీరాజనం

ఈనెల 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన పాపా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు డైనమిక్ లేడీ ప్రొడ్యూసర్ శ్రీమతి నీరజ కోట. తమిళంలో సంచలన విజయం సాధించిన దాదా చిత్రాన్ని జె.కె.ఎంటర్టైన్మెంట్ పతాకంపై తెలుగులో పాపా పేరుతో అనువదించారు నీరజ. ఈ చిత్రానికి ప్రేక్షకులు నీరాజనం పడుతుండడం పట్ల ఆమె హర్షాతిరేకం వ్యక్తం చేశారు. కవిన్ అపర్ణాదాస్ జంటగా భాగ్యరాజా, విటివి గణేష్ కీలక పాత్రల్లో రూపొంది తమిళంలో వసూళ్ల వర్షం కురిపించిన ఈ చిత్రానికి గణేష్.కె.బాబు దర్శకత్వం వహించారు. హైదరాబాద్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న సంధ్య థియేటర్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నీరజ కోట మాట్లాడారు. ఇంత మంచి చిత్రంతో సినిమా నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టడం చాలా గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సినిమా చూస్తున్నవారంతా స్ట్రెయిట్ సినిమా చూస్తున్నట్లుగా ఉందని చెబుతుంటే, ఈ సినిమా కోసం తాము పడిన కష్టమంతా మర్చిపోయేట్టు చేస్తోందని తెలిపారు. జెన్.మార్టిన్ సంగీతం, ఎలిల్ అరసు ఛాయాగ్రహణం.. ముఖ్యంగా గణేష్ బాబు దర్శకత్వం పాపా విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని నీరజ అన్నారు. కవిన్ అపర్ణాదాస్‌ల మధ్య కెమిస్ట్రీ, కాన్ఫ్లిక్ట్ అందరినీ కట్టిపడేస్తోందని ఆమె వివరించారు. ఈ సినిమా విజయం ఇస్తున్న ఉత్సాహంతో త్వరలో ఒక స్ట్రెయిట్ సినిమా ప్లాన్ చేస్తున్నామని నీరజ ప్రకటించారు. ఈ సక్సెస్ మీట్‌లో.. ఎన్నారై శశికాంత్, ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో 236 థియేటర్లలో విడుదల చేసిన ఎమ్.జి.ఎమ్ మూవీస్ ఎమ్.అచ్చిబాబు, ప్రముఖ ఆర్జే లక్ష్మీ పెండ్యాల, బిజినెస్ కోఆర్డినేటర్ నారాయణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ పాల్గొని, పాపా వంటి హార్ట్ టచ్చింగ్ ఫిల్మ్ తెలుగు ప్రేక్షకులకు అందించిన నీరజ కోటను అభినందించారు.




# 'సోలో బాయ్' ట్రైలర్ లాంచ్

సెవెన్ హిల్స్ బ్యానర్‌పై వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా నటిస్తుండగా పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి తనతో జంటగా నటించారు. పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, షఫీ, ఆర్కే మామ, భద్రం ఆనంద్ చక్రపాణి, సూర్య, ల్యాబ్ శరత్, అరుణ్ కుమార్, రజిని వర్మ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి త్రిలోక్ సిద్దు సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జుడా సంధ్య చిత్రానికి సంగీతం అందించారు. జులై 4వ తేదీన వెండి ధరపై ప్రేక్షకులను పలకరించనున్న సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేయడం జరిగింది. అయితే ఇటీవలే భారతదేశ రక్షణాదనం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ లో అమరుడైన తెలుగు జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మురళి నాయక్ తల్లిదండ్రులు మాట్లాడుతూ, మేము ఎంతో పేద కుటుంబం నుండి వచ్చాము. మాకు ఉన్న ఒక్క కొడుకు దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మా కొడుకు ఈరోజు మాకు దూరమైనప్పటికీ గౌతమ్ లాంటి మరొక కొడుకు మాకు దొరికాడు అనుకుంటాము. గౌతమ్ మాట్లాడుతుంటే మా అబ్బాయి మాట్లాడుతున్నట్లే ఉంది. అందుకే నేడు వేరే పని ఉన్నా కూడా కేవలం ఈ చిత్రం కోసం వచ్చాము. గౌతమ్ కృష్ణ హీరోగా నటిస్తూ రాబోతున్న ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాము అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, చిత్ర ట్రైలర్ ఎంతో బాగుంది. చాలా మంచి విజువల్స్ కనిపించాయి. సాధారణంగా ఎవరైనా కొత్త నిర్మాతలు చిత్ర పరిశ్రమంలోకి వచ్చినప్పుడు ప్యాషన్ తో వచ్చాము అంటారు కానీ ఒకటి రెండు సినిమాలు తీసిన తర్వాత వెళ్ళిపోతారు. కానీ సతీష్ అలా వెళ్ళిపోయేవాడు కాదు. ప్రస్తుత రోజులలో ఏదైతే మంచి విజయం సాధిస్తుందో అదే పెద్ద సినిమా. అంతేకానీ ఇక్కడ చిన్న సినిమా అంటూ ఏమీ లేదు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫ్రేమ్ సుధాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిన చిత్ర బృందానికి నా కృతజ్ఞతలు. నా మొదటి సినిమా లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ కూడా ఇక్కడే ట్రైలర్ లాంచ్ చేసాము. చిత్రం మంచి విజయం సాధించింది. అలాగే సోలో బాయ్ చిత్రం కూడా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన సతీష్ సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో నిర్మాతగా మారారు. చిత్రానికి ఎంతో గొప్పవారు పాటల అందించారు. చిత్రానికి గౌతమ్ కూడా కొంత డబ్బు ఖర్చుపెట్టడం జరిగింది.



అలాగే మురళి నాయక్ కుటుంబాన్ని ఆహ్వానించినందుకు చిత్ర బంధాన్ని అభినందిస్తున్నాను అన్నారు. దర్శకుడు యాట సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి హాజరైన అందరికీ నా నమస్కారం. ముందుగా దేశ రక్షణ కోసం తన ప్రాణాలను నడిపించిన మురళి నాయక్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఎంతో చిన్న వయసులోనే తనకు వేరే ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ వారిని కాదనుకుని మిలటరీకి వెళ్లి దేశం కోసం తన ప్రాణాలను అర్పించారు మురళి నాయక్. అటువంటి వ్యక్తిని ఈ దేశానికి అందించినందుకుగాను ముందుగా ధన్యవాదాలు అన్నారు.

పుట్టిన పాపాయికి ఆరు నెలల వరకూ తల్లిపాలే అన్నీ. ఇక ఆ తర్వాత నుంచీ వాళ్లకు పోషకాహారం ఏం ఇవ్వాలి? ఎంత ఇవ్వాలి? ఎన్నో ప్రశ్నలు.. రకరకాల రెడీమేడ్ ఉత్పత్తులూ పెట్టేస్తుంటారు కొందరు తల్లులు. కానీ అవి బుజ్జాయిల



# బుజ్జాయిలకు పోషకాల జావ

ఆరోగ్యానికి మేలు చేయవు. బదులుగా పోషకాల సమ్మేళనం..సూపర్‌ఫుడ్ అయిన రాగిజావను చంటి పిల్లలకు ఇవ్వమంటున్నారు నిపుణులు. పురాతన కాలంలో విరివిగా వాడే ఈ జావ మళ్లీ ఇప్పుడు పిల్లలకు సూపర్‌ఫుడ్‌గా ఎందుకు మారిందో తెలుసుకుందాం పదండి.

✦ పసిపిల్లల్లో జీర్ణవ్యవస్థ రోజురోజుకూ వృద్ధి చెందుతుంటుంది. అందుకే తేలిగ్గా జీర్ణమయ్యే ఈ రాగిజావను పిల్లలకు తాగించడం వల్ల పొట్టకు ఏ ఇబ్బంది కలగదు. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియని పెంచి మలబద్దకం రాకుండా నిరోధిస్తుంది. పైగా ఆకలి పెరుగుతుంది. దాంతో శరీరానికి కావాల్సిన పోషకాలు అంది ఆరోగ్యంగా ఎదుగుతారు.

✦ముఖ్యంగా ఎదిగే పిల్లలకు కాల్షియం అవ సరం. ఇందులో మిగతా తృణధాన్యాల కంటే 5-30రెట్లు అధికంగా కాల్షియం ఉంటుంది. కాబట్టి రాగిజావ వారికి మంచి ఎంపిక.

✦ ముఖ్యంగా ఎదిగే పిల్లలకు కాల్షియం అవసరం. ఇందులో మిగతా తృణధాన్యాల కంటే 5-30 రెట్లు అధికంగా కాల్షియం ఉంటుంది. కాబట్టి రాగిజావ వారికి మంచి ఎంపిక.

✦ కణాల అభివృద్ధికి ప్రోటీన్ చాలా అవసరం. రాగిలో అధికంగా ఉండే ప్రోటీన్ కండపుష్టిని పెంచుతుంది. పైగా మొలకెత్తించి చేసిన రాగిపిండిలో ప్రోటీన్ రెండు రెట్లు అధికంగా ఉంటుంది. ఇది పిల్లల్లో పోషకాహారలేమి రాకుండా అడ్డుకుంటుంది.

✦ ఇందులోని ఐరన్ రక్తహీనత రాకుండా నిరోధిస్తుంది. అందుకే రోజూ తగిన మోతాదులో పిల్లలకు దీన్ని ఇవ్వమని సూచిస్తున్నారు.

✦ రాగిజావలో ఉండే పోషకాలు, మంచి కొవ్వులు పిల్లలు ఆరోగ్యకరమైన బరువుతో ఎదగడానికి సహకరిస్తాయి.

✦ రాగుల్లోని యాంటీ ఆక్సిడెంట్ గుణాల వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీన్ని క్రమం తప్పకుండా ఇస్తే పిల్లల్లో దగ్గు, జలుబు, జ్వరం లాంటివి రాకుండా ఉంటాయి.

✦ రాగిలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం నరాలను ప్రభావితం చేసి, మంచినిద్రను అందిస్తుంది. కాబట్టి వాళ్లు రాత్రుళ్లు బాగా నిద్రపోతారు.

ఎప్పుడు ఇవ్వొచ్చంటే... ఆరు నుంచి ఎనిమిది నెలల మధ్యలో పిల్లలకు రాగిజావ అలవాటు చేయొచ్చంటున్నారు నిపుణులు. ఈ సమయానికల్లా పిల్లల్లో చాలావరకు తల నిలబెట్టడం, సపోర్టుతో కూర్చోవడం లాంటి మోటార్ స్కిల్స్ డెవలప్ అయి ఉంటాయి. కాబట్టి వాళ్లు ఆ రుచిని, టెక్స్చర్‌ని గ్రహిస్తారు. మొదట తక్కువ పరిమాణంతో మొదలు పెట్టి, అలవాటయ్యే కొద్దీ పరిమాణం పెంచుకుంటూ వెళ్ళొచ్చు. చంటిపిల్లల నుంచి ఎదిగే వయసు పిల్లలందరికీ రాగిజావను ఇవ్వొచ్చు. మొలకెత్తించి తయారుచేసిన రాగిపిండి అయితే చాల మంచిది. మొలకెత్తించడం వల్ల అందులో ఉండే ప్రోటీన్లు అమైనో ఆమ్లాల రూపంలోకి మారి తేలిగ్గా జీర్ణం అవుతుంది. మరి జావ ఎండల్లోనే కాదు, అన్ని కాలాల్లోనూ పోషకాల రారాజైన రాగిజావను పిల్లలకు అందిద్దామా!

# హురున్ మెచ్చిన మహిళామణులు

ప్రపంచం ఇప్పుడు మహిళా నాయకత్వంవైపు ఆశగా, ఆసక్తిగా చూస్తోంది. సునిశిత పరిశీలన, సానుభూతి, స్పష్టత.. వంటి విలువైన లక్షణాలు మహిళల్ని సహజసిద్ధ మైననాయకురాళ్లుగా నిలబెడుతున్నాయి. సంపద సృష్టి, వ్యాపారం, వినోదం, కళలు, సేవ.. రంగం ఏదైనా ఆమెది చెరగని ముద్ర. అలా తమ ప్రత్యేకతను చాటుకున్నారీ మహిళామణులు. అందుకే తాజా హురున్ ప్రభావవంత భారతీయ నాయకురాళ్లలో స్థానం సంపాదించారు.

**.బ్యాంకింగ్ రాణి..** ముంబయిలోని సిడెన్‌హామ్ కాలేజీ నుంచి బీకామ్, తర్వాత సీఏ పూర్తి చేశారు.



ఆర్థిక రంగంలో తవ ఫైనల్ ఫలితాల కోసం వేదిక చూస్తున్న సమయంలో ముంబయిలోని ఓ విదేశీ బ్యాంకు ఇంటర్వ్యూకి వెళ్లి ఎంపికయ్యారు. నాలుగున్నరేళ్లు పని చేశారు. కోటక్ బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్‌తో పరిచయం అక్కడే. పెద్ద బ్యాంకు మారాలనుకుంటున్నా, ఎక్కడ బాగుంటుందని ఉదయ్‌ని సలహా అడిగారట. బదులుగా తమ బ్యాంకులోనే చేరమన్నారాయన. అలా 1991లో కోటక్‌లో చేరారు. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ఐపిఓలూ, మెర్జర్లు- అక్విజిషన్లు, ప్రైవేట్ ఈక్విటీ, కార్పొరేట్ బ్యాంకింగద్ విభాగాల్లో నిపుణురాలు 2013లో 'సీఏ విమెన్ బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుని అందుకున్నారు. వ్యాపార ఆలోచనలూ, వినియోగదారుడి కోణంలో ఆలోచించడం, తక్షణమేనిర్ణయాలు తీసుకోవడం, అంకితభావంతో పనిచేయడం శాంతి ప్రత్యేకతలు 'ప్రొఫెషనల్స్' విభాగంలో ఈమెకు చోటిచ్చింది హురున్. తక్కువ మంది ఉద్యోగులు ఉండటం, బ్యాంకు కొత్తది కావడంతో ప్రారంభంలో కోటక్‌లో ఎక్కువగా నేర్చుకోవ డానికి అవకాశం ఉండేది. ప్రతి విభాగంలో టాప్-3లో నిలవడమే లక్ష్యంగా పనిచేసేవాళ్లం. నేను గానీ, సంస్థగానీ జెండర్ అంశాన్ని ప్రస్తావించింది లేదు. పని మీద దృష్టి పెట్టాక దాన్ని ఎలా పూర్తిచేయాలనే ఆలోచించేదాన్ని. అవసరమైనప్పుడు అదనపు సమయం పనిచేసే దాన్ని. ఓసారి అమెరికా నుంచి 22 గంటలు ప్రయాణం చేసొచ్చాక.. ఆఫీసులో పని ఉందంటే, వెంటనే వచ్చేశా' అని చెప్పే శాంతి.. మారథాన్ రన్నర్. బుద్ధిమాంద్య పిల్లల కోసం పనిచేసే 'సోపాన్' సహా పలు స్వచ్ఛంద సంస్థలకు నిధులు ఇవ్వడం, సమీకరణ చేస్తారు. ఈ అక్టోబరు చివరకు రిటైర్ కానున్నారు.

**టిక్‌టాక్ నుంచొచ్చిన స్టార్ .......** చదవే లోకంగా సాగిన మధ్యతరగతి అమ్మాయి మృణాల్ పాంచాల్. పిహెచ్‌డి చేస్తున్నప్పుడు అందిరలాగే టిక్‌టాక్‌తో ప్రేమలో పడింది. ఈమెది గుజరాత్,స్థిరపడింది మాత్రం పుణెలో. తను చేసిన లిప్‌సింక్ వీడియోలకు అభిమానులు పోటెత్తారు. పేరుకు పేరు, లక్షల్లో ఫాలోయర్లు, సెలెబ్రిటీ హోదా వచ్చిందనగా టిక్‌టాక్ కాస్తా బ్యాన్ అయ్యింది. దీంతో 'గుజ్జు యూనికార్న్' పేరుతో యూట్యూబ్‌లోకి ఆపై ఇన్‌స్టాగ్రామ్‌లోకి వచ్చింది. ఫ్యాషన్, మేకప్, ట్రావెల్ వీడియోలెన్నో చేసింది. తన మేకప్, స్టైల్ చిట్కాలకు యువతలో క్రేజ్ ఎక్కువ. దీంతో కొలాబరేషన్స్, ఎండార్స్ మెంట్‌లు వెల్లువెత్తాయి. వాటిల్లో దేశీవే కాదు.. విదేశీ బ్రాండ్‌లూ ఉన్నాయి. హాలీవుడ్ గాయని, నటి సెలెనా గొమెజ్ బ్యూటీ సంస్థ 'రేర్ బ్యూటీ' నుంచి మృణాల్‌కి పిలుపొచ్చింది. ఏకంగా సెలెనాతో కలిసి యాడ్‌లో నటించింది. ఈమె పాపులారిటీకి ఇదో ఉదాహరణ. తగ్గట్టే 'బెస్ట్ బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్'గా అవార్డులూ దక్కాయి.



సోషల్‌మీడియాలో దూసుకెళోనతన్న మృణల్ గత నవంబరులో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. 'మృచా బ్యూటీ' పేరుతో బ్యూటీ ఉత్పత్తుల సంస్థను ప్రారంభించింది. యువత పల్స్ తెలుసు, మార్కెటింగ్ కిటుకులూ నేర్చుకుని రూ.లక్షతో దీన్ని ప్రారంభించింది. నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల అమ్మకాలు చేపట్టింది. వయసు 26, కేవలం ఇన్‌స్టాలోనే 54 లక్షలకు పైగాఫాలోయర్లున్నారు. చిన్న వయసులో ఇంత పాపులారిటీ, భిన్న రంగాల్లో దూసుకెళ్తోందనే హురున్ ఇండియా 'లీడింగ్ విమెన్ ఇన్‌ఫుయెన్సర్ ఫౌండర్స్ జాబితాలో ఈమెను ఎంపికచేసింది. దానిలో టాప్ ర్యాంకు మృణాల్‌దే. ఈసారి హురున్ ఇండియా జాబితాకి ఎక్కిన వారిలో అతి పిన్నవయస్కురాలూ మృణాలే!

**వ్యాపారంలోనూ ముందంజ ....** బాలీవుడ్‌లో పెద్ద హీరోయిన్ల అంటే శ్రద్ధాకపూర్ పేరేమీ తక్కువగా వినిపించదు. సినిమా రంగంలోకి రావ డమే బ్లాక్‌బస్టర్ హిట్‌లతో ఏమీ రాలేదు. అయినా



సోషల్‌మీడియాలో పాపులారిటీ మాత్రం తనకే. దేశంలో ఎక్కువమంది ఫాలోవర్లు ఉన్న హీరోయిన్ ఇన్‌ఫ్లుయెన్సర్ శ్రద్ధానే! గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, దీపిక, ఆలియా... వీళ్లంతా తన వెనకే ఇదంతా తన కష్టంతోనే సాధించింది శ్రద్ధా కపూర్. తండ్రి శక్తికపూర్ నటుడు. కాబట్టి, కోరుకున్న కెరియర్ సినిమాల్లోకి సులువుగానే రాగలిగింది. వరుసగా రెండు ఫ్లాప్‌లు. ఎన్ని ఆడిషన్స్‌కి వెళ్లినా తిరస్కరణలే. ఒకనొక దశలో కుంగు బాటుకీ గురైంది. కానీ దాన్నుంచి బయటపడి అవకాశాలను అందిపుచ్చుకుంది. తనను తాను మార్చుకుని... నటిగా గుర్తింపు తెచ్చుకుంది. తెరపై నటే.. తెరవెనక మాత్రం పక్కింటి అమ్మాయి తరహానే, తన రోజువారీ సంగ తులు, మెచ్చే ఆహారం, కుక్కపిల్లతో ఆటలు, సాధారణంగా ఇవే తను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకు నేది. ఆ సింప్లిసిటీకి మెచ్చే కోట్లమంది ఉన్నారు. తన ఫాలోయర్ల సంఖ్య ఎంతో తెలుసా? 9.4 కోట్లకు పైమాటే! ఒకానొక దశలో ప్రధాని మోదీనీ దాటేసిందామె. శ్రద్ధ... మైగ్లామ్, పవర్ గమ్మీస్, బెల్లా కాసా, పల్మోనాస్, షున్యా... వంటి లైఫ్‌స్టైల్ బ్యూటీ రంగాల్లో పెట్టుబడులు పెట్టింది. వ్యాపారంలోనూ దూసుకెళుతోంది. కాబట్టి తాజాగా హురున్ ఇండియా 'ఎక్కువ మంది అనుసరిస్తున్న సెలెబ్రిటీ ఇన్వెస్టర్ జాబితాలో తొలిస్థానంలో నిలిచింది. 'పోలికలు పక్కన పెట్టాలి బయటి ఒత్తిళ్లనూ పట్టించు కోవద్దు. మన బలాలు, సౌకర్యం వీటికి ప్రాధాన్య మిస్తూ నచ్చింది చేస్తూ ముందుకు సాగాలి' అనే శ్రద్ధ కెరియర్ ఏదైనా ఫిట్‌నెస్, ప్రియమైన వాళ్లతో సమయాన్ని గడపడాన్ని ఆశ్రద్ధ చేయొద్దన్న సలహా ఇస్తోంది.

**స్క్రీన్ సమయం తగ్గించాలని...** ఇటీవల కాలంలో ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అతుక్కు పోతున్న పిల్లలే ఎక్కువ. డిజిటల్ యుగం కదా... అందుకే ఇలా ఉన్నారంటూ సరిపెట్టుకుంటున్నారు కొందరు తల్లిదండ్రులు. ఫోన్లు, టీవీ, కాలక్షేపంగా చేసుకుని... అల్లరి చేయడం లేదు కదా అని అంటున్నారు ఇంకొంతమంది. కానీ దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు. న్యూయార్క్ బిజినెస్ స్కూల్లో చదువుతున్న దేవాన్షి కేజీవాల్‌ని ఈ అంశం ప్రభావితం చేసింది. పెళ్లాల స్క్రీన్ సమయాన్ని తగ్గించేందుకు ఏదైనా చేయాలను కున్నా. నా ఆలోచనలకు తగిన కమ్యూనిటీని వెతకడం ప్రారంభించా. 2016లో ధావనీల్ సేత్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరం కలిసి 2017లో 'స్కిల్‌మాటిక్స్'ను ప్రారంభించాం. మేం ఏం తయారుచేసినా... పిల్లల్ని స్క్రీన్ నుంచి దూరం చేసేవిగా, ఆసక్తిగా ఉండాలి. ఉత్పత్తి రంగు నుంచీ కంటెంట్ అంతా వాళ్లని ఆకర్షించాలి. అలా జరగాలంటే వాళ్ల అవసరాలు తెలియాలి. అందుకే



60 మంది పిల్లలతో ఒక సర్వే నిర్వహించా అని చెప్పే దేవాన్షి దీనికోసం ఏడాది సమయం కేటాయించింది. పైగా, తానేం చేసినా పర్యావరణానికి ముప్పు కలగకూడదనుకుంది. అందుకే కార్బన్ -న్యూట్రల్, బీపీఏ లేని మెటీరియల్‌తో ఉత్పత్తులు తయారు చేయాలని నిశ్చయించుకుంది. అలా 2018లో స్కిల్‌మాటిక్స్ తీసుకొచ్చిన 'గెస్' ప్లే కార్డ్స్ పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. మూడొందల కోట్ల మందికి చేరువయ్యాయి. ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఆదిమొదలు ఈమె వెనుదిరగలేదు. 235 రకాల ప్రొడక్ట్స్‌ని డిజైన్ చేసి అంకురం. పదిహేను దేశాల్లో వీళ్ల ఉత్పత్తులు లభ్యమవుతున్నాయి. ఆ మార్కెటింగ్ బాధ్యతలూ ఈమెవే ఈ నైపుణ్యాలే 28 ఏళ్ల దేవాన్షిని తాజా హురున్ ఇండియా 'యంగ్ విమెన్ లీడర్స్' కేటగిరిలో చోటు దక్కించుకునేలా చేశాయి.

# డైటింగ్ అతి అయ్యిందేమో !

**బరువు పెరిగితే ఎక్కువ తినేస్తున్నామేమో అన్న కంగారు. నిద్ర పట్టకపోతుంటే ముందే మెనోపాజ్ వస్తోందేమో అన్న భయం, గాయాలు మానకపోతేమధుమేహమేమో ఇలా అనుమానించుకుంటూ పోతుంటాం. అయితే ఒత్తిడి కలిగించే హార్మోను**



పెరిగిందేమో గమనించుకోమంటు న్నారు నిపుణులు.

✦ మెటబాలిజం సరిగా ఉండాలన్నా.. రక్తంలో చక్కెరలు, హార్మోన్ల స్థాయుల్లో సమన్వయం జరగాలన్నా కాస్త ఒత్తిడి మంచిదే. అంటే దానికి కారణమయ్యే కార్టిసాల్ కొద్దిస్థాయుల్లో విడుదలైతే ఆరోగ్యమే. అది హద్దు దాటితేనే అనారోగ్యం పొట్ట పెరిగిపోతోంది. దుస్తుల్లోంచి కనిపిస్తోందంటూ తెగ ఇబ్బంది పడిపోతాం కదా! అది పెరుగుతూ వస్తోన్నా అనుమానించాల్సిందే. ఒత్తిడితో తెలియకుండానే స్వీట్లు, చిరుతిళ్లవైపు ఆకర్షితులం అవుతాం. అదేమో బరువు పెరగడానికి కారణమవుతుంది. ఒత్తిడి పెరిగేకొద్దీ శరీరంలో నిల్వ ఉండే గ్లూకోజు ఎక్కువగా ఉత్తపత్తి అవుతుంది. అదీ పొట్ట దగ్గర కొవ్వుగా చేరుతుం దట.

✦రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం పట్టినా పదే పదే మెలకువ రావడమూ కార్టిసాల్ పెరిగడానికి సూచనలే. పదే పదే ముఖం వాయడం, నీరు చేరినట్లుగా అనిపించినా తేలిగ్గా తీసుకోవద్దు. అంతెందుకు శరీరంపై ఏవైనా గాయాలైతే కొన్ని రోజుల్లో మానడం మామూలే. గాయం తీవ్రతను బట్టి నయమయ్యే సమయంలో మార్పు ఉంటుంది. చిన్నచిన్నవీ తగ్గడం లేదంటే దానికి కారణమయ్యే సైటోకైన్స్ సరిగా పనిచేయడం లేదని అర్థం పెరిగిన ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తి సైటోకైన్స్ పని తీరుకు అడ్డుపడి, శరీరం లో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమవుతాయి.

✦ తిండి పడలేదు, జీర్ణవ్యవస్థలో ఏదో ఇబ్బంది.. గ్యాస్ పడే పదే పలకరిస్తోంటే మనం చెప్పుకొనే కారణాలే ఇవి. కొన్నిసార్లు నెలసరి రాబోతోందని సర్దిపుచ్చుకుంటాం కూడా. కానీ అతి ఒత్తిడి కూడా జీర్ణప్రనక్రియపై ప్రభావం చూపు తుంది.

# వడ లాంటి ఇడ్లీ



ఇంట్లో చేసుకునేవే కావాలో లేదా వడ లాంటి ఇడ్లీ ఎప్పుడైనా తిన్నా ఇప్పుడు ప్రయత్నించండి.

కప్పు, పెరుగు, ఉప్మారవ్వ కప్పు చొప్పున, ఉప్పు రచికి సరిపడా, పచ్చిమిరపకాయలు 2, కొత్తిమీర తరుగు చెంచా, పుదీనా తరుగు 2 చెంచాలు,

నూనె రెండు చెంచాలు కరివేపాకు రెబ్బలు తారగాలి. గట్టిగా పిండేయాలి అందుటి పుదీనా తరుగు. పెరుగు, ఉప్పు, అల్లం పచ్చిమిచ్చి ముద్ద, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి గారెలు చేసి కోటెడ్ పేపర్ పరిచిన ఇడ్లీ పాత్రలో సుమారు పావుగంట ఉడికించాలి. కళాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపట లాడాక ,చీల్చిన పచ్చిమిరపకాయలను జోడించాలి. అవి వేగాక కరివేపాకు, పసుపు వేయాలి. తర్వాత ఉడికించిన గారెలను జతచేయాలి. వాటిని నాలుగైదు నిమిషాలు వేయించి.. కొద్దిగా మీద చల్లాలి. అంతే వెరైటీ వంటకం తయారై పోతుంది. వీటిలోకి పల్లీ, కొబ్బరి, పచ్చడితో బాగుంటుంది.

టొమాటో లేదా చిల్లీ సాస్తోనూ తినొచ్చు.

# స్వీయ నియంత్రణ అవసరం

కొంత మంది దంపతుల్దిరూ నింపాదిగా చర్చించుకోరు ఒకరిపై మరొకరు కోపంతో రగిలిపోతారు. ఒకరినొకరు నిందించుకోవడం మొదలుపెడతారు. ఇటువంటి వాతావరణం కుటుంబ సంతోషాన్ని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు. కాబట్టి..

కోవాలి. స్వీయ నియంత్రణ ఉండాలి. అవతలి వారెందు కలా మాట్లాడు తున్నారని ఆలోచించాలి. ఇలా ఇరువురూ చేస్తే సమస్య తేలికవుతుంది కోపానికి తావుండదు.



ఎదుటివారితో మాట కలపడం ఓ కళ. అందులోనూ జీవిత భాగస్వామితో మరింత అపురూపంగా మాట్లాడాలి. అప్పుడే ఆ వైవాహికబంధం సాఫీగా సాగిపోతుంది. అలా జరగలంటే ఎదుటివారికన్నా తామే ఎక్కువ, నాకే అన్నీ తెలుసనే ఆలోచన భార్యాభర్తల్లో ఎవరికీ ఉండకూడదు. లేదంటే భాగస్వామిపై చులకన భావం పెరుగతుంది. అలాకాకుండా అవతలివారిలోనిప్రత్యేకతను గుర్తించి విలువనివ్వండి. ఇద్దరి మధ్యా అసమానతలకు చోటుండదు.

**నియంత్రించుకోవాలి....** దంపతులు ఏదైనా విషయంపై చర్చించుకున్నప్పుడు..ఎదుటివారు చెప్పింది నచ్చకపోతే కోపాన్ని ప్రదర్శించొద్దు. కూల్‌గా ఆ సంద ర్భాన్ని డీల్ చేయడం నేర్చు

**మృదువైన మాటలతో..** ఏ విషయాన్నైనా చర్చించాలనుకున్నప్పుడు మృదువైన మాటలతోనే సంభాషణ కొనసాగించాలి. ఎదుటివారి అభిప్రాయానికి విలువనిస్తూ, వారు చెప్పేది పూర్తిగా వినాలి. ఆ తర్వాత మీ ఆలోచననీ మృదువుగా చెప్పగలగాలి. ఇది అవతలివారికి ఒత్తిడి కలిగించదు. పైగా ఒకరికొకరు సానుకూలంగా అభిప్రాయాలను పంచుకునే వాతావరణం ఏర్పడుతుంది. ఇక కోపాలకు తావేది?

**అవతలివారి గురించి ఆలోచించి..** భార్యాభర్తల్లో ఏ ఒక్కరు కోపాన్ని ప్రదర్శించినా ఎదుటివారు దాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. మీరు బాధపడుతూ కూర్చోక. భాగస్వామికి ఎలా అనిపించిందో అన్న కోణంలో ఆలోచించాలి. వారి స్థానంలో ఉండి ఆలోచించాలి. అవతలివారి అర్థమవడమే కాదు. సమస్యా తీరుతుంది.

# వ్యాక్సింగ్ సులువుగా..

**దీర్ఘ కాలం పాటు అవాంఛిత రోమాలు రాకుండా ఉంటాయని చాలామంది వ్యాక్సింగ్ చేయించుకుంటారు. కానీ అన్నిసార్లూ పార్లర్‌కి వెళ్లడం కుదరకపోవచ్చు. ఇంట్లోనే చేసుకుందామంటేనేమో.. వాక్స్ ఆరిపోతోంటే పదే పదే వేడిచేయడం దగ్గర్నుంచి పూర్తయ్యాక ఆ పాత్రని శుభ్రపరచడం వరకు పెద్ద తతంగంలా తోస్తుంది. కానీ ఈ ప్రక్రియనూ సులువు చేస్తూ కొన్ని మార్గాలున్నాయని తెలుసా?**



**పెదాల కోసం...** పెదవి పైభాగం, కనుబొమలకీ వ్యాక్స్ చేయించు కుంటారా? అయితే వాటికోసం ప్రత్యేకంగా వ్యాక్సింగ్ స్ట్రిప్స్ ఉన్నాయని తెలుసా? వీటిని కావాల్సిన ప్రదేశంలో అతికించుకుని, కొద్దిసేపయ్యాక లాగేస్తే సరిపోతుంది. చిన్నగా ఉంటాయి కాబట్టి, ఇబ్బందీ ఉండదు. పైగా కూల్ వ్యాక్స్ కాబట్టి, కాలుతుందన్న భయమూ అక్కర్లేదు. వ్యాక్సింగ్ పెన్ అయినా ఉత్తమ ఎంపికే! దీన్ని కాసేపు వేడినీటిలో వేసి ఉంచితే.. లోపలి పదార్థం సులువుగా బయటకు వచ్చేలా తయారవుతుంది. కావాల్సిన ప్రదేశంలో రాసి, స్ట్రిప్‌తో లాగేస్తే సరి. పై పెదవి, కనుబొమలు, గడ్డం వంటి ప్రదేశాలకు చక్కని ఏర్పాటు కదూ.

**రోల్ చేయడమే...** కాళ్లు, చేతులకు కాస్త ఎక్కువ మొత్తంలోనే వ్యాక్స్ కావాలి. అలాగని పాత్రలో ఎప్పటికప్పుడు వేడిచేసుకుంటూ వాడుకోవాలంటే చిరాకే దాన్ని సులువు చేస్తుందీ వ్యాక్సింగ్ రోలర్. ఇదో ఎలక్ట్రిక్ పరికరం కరెంటులో పనిచేస్తుంది. దీనిలో వ్యాక్స్‌తో నిండిన కాట్రిడ్జ్ ఉంటుంది. అవసరమైనప్పుడు బటన్ ఆన్ చేసుకుంటే వ్యాక్స్ వేడవుతుంది. దాన్ని కావాల్సిన ప్రదేశంలో రోల్ చేసుకుంటే వ్యాక్స్ పలుచని పొరలా అంటుకుంటుంది. స్ట్రిప్స్ సాయంతో అవాంఛిత రోమాలను లాగేయడమే. ఇదైతే అతిగా వేడెక్కడం, కాలుతుందేమో అన్న భయం ఉండదు. కావాల్సినప్పుడు స్విచ్ ఆన్ చేసుకుంటే సరిపోతుంది.

**నొప్పి ఉండదు...** చాలకాలం పాటు రోమాలు రావన్నది వాస్తవమే కానీ, వ్యాక్సింగ్ చేయించుకునేప్పుడు కలిగే నొప్పి, మంటలను భరించడమే కష్టం కదూ. అయితే ఈ వ్యాక్సింగ్ పౌడర్లు ప్రయత్నించేయండి. చాక్లెట్, గంధం, రోజ్, పసుపు వంటి ఫ్లేవర్లలో. సహజ పదార్థాలతో చేస్తున్నారు. వేడిచేయాల్సిన పని ఉండదు నొప్పి భయం అసలే లేదు. కావాల్సినంత పొడిని తీసుకుని నీళ్ల లేదా పాలల్లో కలపాలి. ఈ మిశ్రమాన్ని సమస్య ఉన్నచోట రాసి, ఆరనివ్వాలి. ఆపై తడి వస్త్రం లేదా టిష్యూతో తుడిస్తే చాలు వెంట్రుకలన్నీ ఊడొచ్చేస్తాయి. చర్మానికీ పోషణ.



# కురుక్షేత్రం

ఆధ్యాత్మికం

కురుక్షేత్రం అంటేనే మనకు కౌరవ, పాండవ మహా యుద్ధం గుర్తుకు వస్తుంది. ఆ క్షేత్రం లోనే శ్రీకృష్ణుడు, అర్జునునికి భగవద్గీత బోధించాడు. అదే నేటికీ మనకు మూలం అయింది. భగవద్గీత ద్వారానే అర్జునుడు విజయం సాధించాడని మహాభారతం చెబుతోంది. ఈ కురుక్షేత్రం సంగ్రామం అంటుంచితే నిజ జీవితంలో ప్రతి ఇల్లు కూడా పెద్దలు, పిన్నలతో ఏవో మాటలు అనుకుని యుద్ధ వాతావరణాన్ని కల్పిస్తుంది. అదే తీవ్ర రూపం దాల్చి కుటుంబాలు వేరు పోవడం జరుగుతోంది. నేడు కులాల కురుక్షేత సంగ్రామంలో ప్రేమికులు హతమవడం బాధాకరం. ఒకరిని ఒకరు చంపుకోవటం దానికి యువతీ యువకులు బలి కావటం శోచనీయం. కన్న వారే తమ సంతానాన్ని చంపుకోవటం దారుణం. వెర్రి తలలు వేస్తున్న ఈ విష సంస్కృతి సమిసి పోవాలి. నేడు చదువుకున్న కుటుంబాలు, చదువు లేని కుటుంబాలు ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నాయి. కొండొకచో కొన్ని కుటుంబాల వాళ్ళు పిల్లల సంతోషమే మాకు ఆనందం అని గ్రాండ్‌గా వివాహం చేసిన వాళ్ళు ఉన్నారు. ఈ రోజుల్లో కులాలు ఎవరూ పట్టించుకోవడం లేదు. పట్టించుకునే వాళ్ళు మాత్రమేదారుణాలకు ఒడిగడుతూ మా కులం, మీ కులం అంటూ పంతాలకు పోతున్నారు. నిజానికి మనకు కులాలతో పని లేదు. పిల్లలు సంతోషంగా ఉండి, అర్థం చేసుకుంటే ఈ ఆటంకాలు ఉండవు. అప్పుడు ప్రతి ఇల్లు ఆనందాల కురుక్షేత్రం అవుతుంది.

- కనుమ ఎల్లారెడ్డి.



**లేత కొబ్బరిల తియ్యగా ఉంటే తాటి ముంజలు రుచిలోనే కాదు.. మేలు చేయటంలోనూ మేటి అనిపించుకుంటాయి. వీటిలో ఎన్ని సుగుణాలున్నాయో చూడండి..**

# ఇవి కాలేయానికి మేలుచేస్తాయి..

✦ తాటి ముంజలు తింటే ఎండల వల్ల కలిగే తాపం తగ్గుతుంది. ఇవి మంచి పోషకాహారం. శరీరానికి అవసరమైన ఎ, బి, సి విటమిన్లు, భాస్వరం, పొటాషియం, ఐరన్, జింక్లు అందుతాయి.

✦చాలామంది వీటిని పొట్టు తీసి తింటారు. నిజానికి అందులోనూ మందులున్నాయని చెబుతున్నారు. ఆహార నిపుణులు,

✦ చర్మం పొడిబారదు. ముఖానికి మెరుపు వస్తుంది. మచ్చలు, దద్దుర్లు, మొటిమలు ఉంటే తగ్గుతాయి.

✦. గర్భిణులకు మరింత మేలు చేస్తుంది.

✦ జీర్ణప్రక్రియ బాగుంటుంది. వేళకు ఆకలి వేస్తుంది. మలబద్ధక సమస్య ఉత్పన్నం కాదు. ✦ బరువు పెరిగిపోతున్నామని భయపడే వారు ఈ కాలంలో ముంజలు తినటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. వీటిలో క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ కనుక ఊబకాయాన్ని నివారిస్తాయి. ✦ ఇవి ఎసిడిటిని తరిమికొడతాయి. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ముంజలు తినటం వల్ల శరీరంలో చేరిన వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్తాయి. ఇవి ట్యూమర్‌లు, క్యాన్సర్‌లను సైతం తగ్గిస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కనుక ఈ కాలంలో తరచుగా తింటే ప్రయోజనం ఉంటుంది. ✦ కాలిన గాయాలు, చర్మం మీద పొక్కుల్లాంటివుంటే ముంజలను మెత్తగా గుజ్జులా చేసి లేపనంలా రాస్తే ఉపశమనం కలుగుతుంది. చికెన్‌పాక్స్ వల్ల కలిగే దురదను తగ్గిస్తాయి.

### ఆసియా కప్ స్టేజ్ 2లో

# ఫైనల్స్‌కు భారత్ ఆర్చర్లు

### 5-1తో ఓడిన జపాన్




**న్యూఢిల్లీ:** ఆసియా కప్ స్టేజ్ 2లో భారత జూనియర్ ఆర్చర్లు దూసుకుపోతున్నారు. సింగపూర్‌లో గురువారం జరిగిన ఆసియా కప్ స్టేజ్ 2లో భారత జూనియర్ ఆర్చర్లు మూడు టీమ్ ఫైనల్స్‌కు దూసుకెళ్లడం ద్వారా తమ ఆధిపత్య పరుగును కొనసాగించారు. పురుషుల రికర్వ్ విభాగంలో రెండో సీడ్ గా నిలిచిన భారత జట్టు, ఐదో సీడ్ బంగ్లాదేశ్ ను 5-1 తేడాతో ఓడించి, మూడో సీడ్ జపాన్ తో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. విష్ణు చౌదరి, పరాస్ హుడా, జుయెల్ సర్కార్ త్రయం ప్రారంభం నుండే ఆధిపత్యం చెలాయించి, తొలి సెట్‌ను 55-48తో కైవసం చేసుకుంది. రెండవ సెట్ 55-55తో సమంగా ఉన్నప్పటికీ, భారత్ ఆర్చర్లు బలంగా పుంజుకున్నారు,
మూడవ సెట్‌లో కేవలం ఒక పాయింట్ మాత్రమే కోల్పోయి 59-56తో గెలిచి పోటీని ముగించారు. నాలుగు సెట్ల తర్వాత రెండు జట్లు 232 పాయింట్లతో సమంగా నిలిచిన తర్వాత షూట్ఆఫ్ ద్వారా నిర్ణయించబడిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్లో కుశాల్ దలాల్, గణేష్ తిరుమురు మరియు మిహిర్ అపార్ త్రయం ఐదవ సీడ్ ఆస్ట్రేలియాను ఓడించడంతో కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారతదేశం కూడా పతకాన్ని ఖాయం చేసుకుంది. ఫైనల్లో భారత్ ఆర్చర్లు కజకిస్తాన్‌తో తలపడనున్నారు. ఇక షణ్ముఖి బుద్దే, తేజల్ సాల్వే మరియు తనిష్కా తోకల్‌లతో కూడిన టాప్‌సీడ్ భారత కాంపౌండ్ మహిళల జట్టు నాల్గవ సీడ్ కజకిస్తాన్‌ను 230-229 తేడాతో ఓడించి మరో పతకాన్ని నిర్ధారించుకుంది. వారు ఫైనల్‌లో మలేషియాతో తలపడతారు. అయితే, భారత మహిళల రికర్వ్ జట్టు నిరాశపరచింది. ఐదో సీడ్ వైష్ణవి పవార్, కీర్తి, తమన్నాతో కూడిన జట్లు ఐదు సెట్ల పోరాటం తర్వాత షూట్‌ఆఫ్‌లో నాల్గవ సీడ్ జపాన్ చేతిలో 4-5 తేడాతో ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయారు. వారు తొలి సెట్‌ను 47-49 తేడాతో కోల్పోయారు. జపాన్ 5-5తోను, రెండవ సెట్‌లో 3-4 మాత్రమే చేయగలిగిన తర్వాత మరింత దిగజారిపోయారు. భారత్ జట్టు మూడవ సెట్‌ను 55-53తోను, నాల్గవ సెట్‌ను 54-52తో కైవసం చేసుకున్న తర్వాత స్కోర్‌లను 4-4తో సమం చేయడానికి గొప్ప స్థితిని ప్రదర్శించారు. షూట్‌ఆఫ్‌లో జపాన్ కేవలం రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉంది.

### ఫుట్‌బాల్ టోర్నీ: తజకిస్థాన్ చేతిలో

# భారత్ ఓటమి



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఫుట్‌బాట్ టోర్నమెట్‌లో భారత పురుషుల జట్టు ఓటమిపాలైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఎఎఫ్‌సి అండర్23 ఆసియా కప్-2026 క్వాలిఫైయర్స్ సన్నాహాల్లో భాగంగా తుర్సుంజోడాలోని టాల్కో అరీనాలో గురువారం జరిగిన అండర్ 23 భారత్ పురుషుల జట్టు తజికిస్తాన్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయింది. మోహన్ బగాన్ సూపర్ జెయింట్ ఫార్వర్డ్ సుహైల్ అహ్మద్ భట్ 33వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత అన్సోర్ ఖబిబోవ్ గంట సమయంలో తజికిస్తాన్ తరపున గోల్ చేసి గోల్‌ను సమం చేశాడు. అయితే, నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫార్వర్డ్ పార్థిబ్ గొగోయ్ 85వ నిమిషంలో భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. భారత్ మొదటి గోల్ కోసం, మాకార్టన్ కుడివైపు నుండి వేగంగా దూసుకుపోతూ, దూసుకు వస్తున్న సుహైల్ పిన్‌పాయింట్ తక్కువ క్రాస్ పంపాడు, అతను ఒకే టచ్‌తో బంతిని గోల్ కీపర్ దాటి వెళ్ళేలా చేశాడు. తజికిస్తాన్ తొలి గోల్ చేయడానికి కొన్ని నిమిషాల ముందు, ఇండియన్ సూపర్ లీగ్‌లో ఎఫ్‌సి గోవా తరపున ఆడుతున్న ఆయుష్ దేవ్ ఛెత్రికి రెడ్ కార్డ్ చూపించాడు. మ్యాన్ అడ్వాంటేజ్‌తో, 59వ నిమిషంలో ముసో ఖఖోరోవ్ ఇచ్చిన క్రాస్‌లో ఖబిబోవ్ టర్నింగ్ చేయడంతో ఆతిథ్య జట్టు స్కోరును సమం చేసింది. భారత్ రెండవసారి ఆధిక్యంలోకి వెళ్ళగలిగింది, మహమ్మద్ ఐమెన్ హాఫ్‌లైన్ దగ్గర బంతిని అడ్డగించి, పార్థిబ్‌కు ఖచ్చితమైన త్రూ బాల్ ఆడాడు, అతను కీపర్‌ను చుట్టుముట్టి గోల్ చేశాడు. అయితే, ఆతిథ్య జట్టు ఇంజురీ టైమ్‌లో రెండు సెట్‌పీస్‌ల నుండి గోల్స్ చేయడంతో భారత్ ఆశ ఎక్కువసేపు నిలవలేదు. అబుబకర్ సులేమోనోవ్ ఇచ్చిన ఫ్రీకిక్‌ను ముహమ్మదిక్‌బోల్ టర్నింగ్ చేయడం ద్వారా తజికిస్తాన్‌ను సమం చేశాడు, ఆ తర్వాత అజీజ్‌బోవ్ ఒక కార్నర్‌లో ఆతిథ్య జట్టుకు అద్భుతమైన పునరాగమనాన్ని పూర్తి చేశాడు.





# నేటి నుండి ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్

### బ్యాటింగ్, బౌలింగ్‌లో సమస్యలు

### టీమిండియాను వేధిస్తున్న బలహీనతలు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌జట్టు 5మ్యాచ్‌ల టెస్ట్‌సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమైంది. ఈ సిరీస్ ఈ నెల 20 నుండి ప్రారంభమవుతుంది. అయితే టీమిండియాకు ఇంగ్లాండ్ పర్యటన ఎప్పుడూ పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. మరోపక్క ఈ సిరీస్‌కు ముందు, టీమ్ ఇండియాలో కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. టీమిండియాకు తలనొప్పిగా ఐదుప్రధాన బలహీనతలు ఉన్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి అనుభవజ్ఞులు టెస్ట్ ల నుంచి రిటైర్ అయిన తర్వాత, టీం ఇండియా బ్యాటింగ్ చాలా సమస్యలను ఎదుర్కొంటోంది. టీం ఇండియా బ్యాటింగ్ లైనప్‌లో అనుభవం లేదు. సాయిసుదర్శన్, కరుణ్‌నాయర్, శుభ్‌మాన్ గిల్, ఇంగ్లాండ్‌లో ప్రతి ఒక్కరూ బ్యాటింగ్ చేయడంలో ఇబ్బంది పడవచ్చు. ఆస్ట్రేలియాలో బుమ్రాపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది.మరే ఇతర బౌలర్‌వికెట్లు తీయడం కనిపించలేదు. మహ్మద్‌షమీ కూడా ఈ పర్యటనలో లేడు, కాబట్టి బుమ్రా మరియు మహ్మద్ సిరాజ్‌లను ఆడించిన తర్వాత ఇంగ్లాండ్ పరుగులు సాధించే అవకాశం ఉంటుంది. బుమ్రా ఐదు టెస్ట్ మ్యాచ్‌లూ ఆడకపోవచ్చని భారత చీఫ్‌సెలెక్టర్ అగార్కర్ స్పష్టం చేశారు. అటువంటి పరిస్థితిలో, భారత యువ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ మరియు అనుభవజ్ఞుడైన శార్దూల్ ఠాకూర్ వంటి ఆటగాళ్ళు బాగా రాణిస్తారని ఆశిస్తున్నాడు. కుల్దీప్ యాదవ్‌కు కూడా బాధ్యత ఉంటుంది. భారత కొత్త కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ స్వదేశానికి వెలుపల బ్యాటింగ్ రికార్డు ప్రశ్నార్థకంగా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో గిల్ సగటు 35, ఇది అంత బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న దేశానికి సరిపోదు. స్వింగ్ బాల్‌పై అతని బలహీనత కూడా అందరికీ తెలిసిందే. గిల్ కెప్టెన్సీకి పదోన్నతి పొందడంపై చాలా మంది మాజీ క్రికెటర్లు సందేహం వ్యక్తం చేశారు. అలాగే ఇంగ్లాండ్‌లో బ్యాటింగ్ చేసే పాత పద్ధతి చాలా సులభం. ముఖ్యంగా బంతి స్వింగ్ అవుతున్నప్పుడు. వారు స్వింగ్ ముందు తమ సమతుల్యతను కోల్పోతారు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ స్వయంగా స్వింగ్ ముందు అంత బలంగా కనిపించడు. అయితే, కెఎల్ రాహుల్‌కు ఇంగ్లాండ్‌లో ఆడటంలో చాలా అనుభవం ఉంది. బ్యాటింగ్ సరిగా లేకపోవడంతో పాటు, భారత క్రికెటర్లు ఫీల్డింగ్ కూడా సరిగా లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు, సులభంగా క్యాచ్‌లు వదులుకుంటారు. స్లిప్ కార్డన్ కారణంగా ఇంగ్లాండ్‌లో భారత్ చాలా టెస్ట్ మ్యాచ్‌లను కోల్పోయింది. ఇంగ్లాండ్‌లో స్లిప్ క్యాచింగ్ అంత సులభం కాదు. డ్యూక్స్ బంతి కూడా చాలా స్వింగ్ అవుతుంది, బంతి స్టంప్‌లను దాటిన తర్వాత కీపర్ చాలా సమస్యలను ఎదుర్కొంటాడు. స్లిప్ ఫీల్డర్లకు కూడా ఇదే సమస్య వర్తిస్తుంది. బంతి అంచుకు చేరుకున్న తర్వాత కూడా స్వింగ్ అవుతుంది. కాబట్టి క్యాచింగ్ ప్రాక్టీస్ చాలా ముఖ్యం. ఇంగ్లండ్‌ను ఢీకొట్టే ముందు వీటన్నింటినీ టీమిండియా అధిగమించాల్సి ఉంటుంది.

### ఆసియా స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో

# క్వార్టర్ ఫైనల్స్‌కు వేలవన్

### నిరాశ పరచిన అనాహత్, జోష్నా, ఆకాంక్ష

**న్యూఢిల్లీ:** ఆసియా స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025లో మూడో సీడ్ భారత ఆటగాడు వేలవన్ సెంథిల్‌కుమార్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మలేషియాలోని కుచింగ్‌లో జరిగిన ఈ టోర్నీలో 16వ రౌండ్‌లో తన జపాన్ ప్రత్యర్థి టోమోటకా ఎండోను తేలికగా ఓడించి, మూడు ఆటలలో (11-3, 11-1, 11-4) కేవలం 8 పాయింట్లు మాత్రమే కోల్పోయి మ్యాచ్‌ను కైవసం చేసుకుని చివరి 8లో తన స్థానాన్ని నిర్ధారించుకున్నాడు. ప్రస్తుత రజత పతక విజేత వేలవన్, గత ఎడిషన్ నుండి తన స్వర్ణం సాధించడంతో పాటు, సౌరవ్ ఘోషల్ తర్వాత ఆసియా వ్యక్తిగత టైటిల్‌ను గెలుచుకున్న రెండవ భారతీయుడిగా అవతరించాలని పట్టుదలతో ఉన్నాడు.



అంతకుముందు, వేలవన్ మొదటి రౌండ్‌లో బై పొందిన తర్వాత రెండో రౌండ్‌లో చైనాకు చెందిన లి హైజెన్‌పై వరుస గేమ్ విజయంతో పోటీని ప్రారంభించాడు. సూరజ్ చంద్ తన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హోమ్ ఫేవరెట్ అమీషేన్‌రాజ్ చందరన్ చేతిలో నాలుగు గేమ్‌లలో (11-5, 3-11, 4-111, 3-11) ఓడిపోవడంతో క్వార్టర్ ఫైనల్స్‌లో ఉన్న ఏకైక భారతీయుడు అతనే అయ్యాడు. క్వార్టర్ ఫైనల్లో అతను మలేషియాకు చెందిన జోచిమ్ చువాతో తలపడనున్నాడు, ఈ మ్యాచ్ విజేత అతనికి కనీసం కాంస్య పతకాన్ని నిర్ధారిస్తాడు. కాగా మహిళల సింగిల్స్‌లో జరిగిన 16వ రౌండ్‌కు చేరుకోకపోవడంతో భారతదేశం నిరాశపరిచింది. అనాహత్ సింగ్ మరియు జోష్నా చినప్ప వైదొలిగిన తర్వాత, ఆకాంక్ష సలుంఖే భారత డబ్ల్యుఎస్ బృందానికి నాయకత్వం వహిస్తోంది. కానీ ఆమె రెండవ రౌండ్‌లో మలేషియాకు చెందిన విట్నీ ఇసాబెల్లె విల్సన్ చేతిలో ఓడిపోయి ఘోర పరాజయం పాలైంది. ఫలితంగా వరుసగా మూడో ఎడిషన్‌లో మహిళల సింగిల్స్‌లో భారత్‌కు ఆసియా పతకం చేజారినట్లే అయింది. 2019లో టైటిల్ గెలుచుకున్న జోష్నా చిన్నప్ప భారతదేశం తరపున చివరిగా ఆసియా పతకం గెలుచుకుంది.





# పట్టుబిగిస్తున్న శ్రీలంక

### తొలి ఇన్నింగ్స్‌లో 127 రన్స్‌తో బంగ్లా ఆధిక్యం

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక పట్టు బిగిస్తోంది. నాలుగో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు నష్టానికి 368 పరుగులు చేసింది. క్రీజులో కమిందు మెండిస్ (37), ధనుంజయ డి సిల్వా (17) ఉన్నారు. లంక బ్యాటర్లలో ఓపెనర్ ఫాథుమ్ నిస్సాంక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ తృటిలో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 256 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 187 పరుగులు చేసి ఔటయ్యాడు. నిస్సాంక చండీమాల్ (54)తో కలిసి రెండో వికెట్‌కు 157 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 495 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 9 వికెట్లు నష్టానికి 484 పరుగులతో ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లా జట్టు కేవలం 11 పరుగులు మాత్రమే చేసి తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. బంగ్లా బ్యాటర్లలో ముష్ఫికరల్ రహీమ్ (350 బంతుల్లో 163 పరుగులు, 9 ఫోర్లు), కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (279 బంతుల్లో 148 పరుగులు, 15 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరితో పాటు వికెట్ కీపర్, బ్యాటర్ లిటన్ దాస్ (123 బంతుల్లో 90 పరుగులు, 11 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంక బౌలర్లలో అశిత ఫెర్నాండో 4 వికెట్లు, మిలన్ రత్నానాయకే 3 వికెట్లు, తరిందు రత్ననాయకే 3 వికట్లు పడగొట్టారు.

## వాణిజ్యం

# నష్టాలను వీడని స్టాక్ మార్కెట్లు




**ముంబై, జూన్ 19:** ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మన సూచీలు మరోసారి నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, క్రూడాయిల్ ధరల్లో హెచ్చుతగ్గులు దీనికి తోడయ్యాయి. ప్రతీకార సుంకాల అమలుకు ట్రంప్ విధించిన 90 రోజుల విరామం గడువు సమీపిస్తుండడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బ్లూచిప్ స్టాక్స్ స్వల్ప స్థాయిలో కదలాడగా.. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ మాత్రం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,403.94 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,444.66) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,191.04 81,583.94 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 82 పాయింట్ల నష్టంతో 81,361.87 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24,793.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.72గా ఉంది. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా షేర్లు నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ బ్యారెల్ 76.90 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్సు 3,392 డాలర్ల వద్ద ట్రేడయింది.

# గోల్డ్ ఈటీఎఫ్‌లతో రెట్టింపు రాబడులు

**న్యూఢిల్లీ, జూన్ 19:** ఎల్ఐసీ ఎంఎఫ్ గోల్డ్ ఈటీఎఫ్ మూడు సంవత్సరాల కాలంలో 23.32 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. దీని నిర్వహణలో ఉన్న ఆస్తులు రూ.330 కోట్లు కాగా మే 9, 2025 నాటికి దాని నికర ఆస్తి విలువ (ఎన్ఏవీ) రూ. 8,848.3616గా ఉంది. దేశీయ బంగారం ధరతో పోలిస్తే ఈ ఈటీఎఫ్ నవంబర్ 2011లో ప్రారంభమైనప్పటి నుంచి 8.42 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. యూటీఐ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ మూడు సంవత్సరాల కాల వ్యవధిలో 23.14 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. దీని ఏయూఎం రూ.1,983 కోట్లు కాగా మే 9, 2025 నాటికి దాని ఎన్ఏవీ రూ.82.5825గా ఉంది. బంగారం దేశీయ ధరతో పోలిస్తే ఈ ఫండ్ మార్చి 2007లో ప్రారంభమైన ప్పటి నుంచి 12.65 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. ఇన్వెస్కో ఇండియా గోల్డ్ ఈటీఎఫ్ 3 సంవత్సరాలలో 22.84 శాతం వార్షిక రాబడిని అందించింది. దీని ఆస్తి బేస్ రూ. 277 కోట్లు కాగా, మే 9, 2025 నాటికి దాని యూనిట్ ధర రూ.8,528.7274గా ఉంది. దేశీయ బంగారం ధరతో పోలిస్తే ఈ ఫండ్ మార్చి 2010లో ప్రారంభించినప్పటి నుండి 11.24 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. క్వాంటం గోల్డ్ సేవింగ్స్ ఫండ్ మూడు సంవత్సరాల కాల వ్యవధిలో గోల్డ్ ఇటిఎఫ్ 22.69 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. దీని ఏయూఎం రూ.192 కోట్లుగా ఉంటే మే 9, 2025 నాటికి దాని ఎన్ఏవీ రూ. 37.5149గా ఉంది. బంగారం దేశీయ ధరతో పోలిస్తే ఈ ఫండ్ మే 2011లో ప్రారంభమైనప్పటి నుంచి 9.86 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ మూడు సంవత్సరాలలో 22.65 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. దీని నిధి పరిమాణం రూ. 3,871 కోట్లు కాగా, మే 9, 2025 నాటికి దాని యూనిట్ ధర రూ. 30.6635గా ఉంది. దేశీయ బంగారం ధరతో పోలిస్తే ఈ ఫండ్ జనవరి 2013లో ప్రారంభమైనప్పటి నుండి 8.55 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది.



# వారెన్ బఫెట్ రూ.52వేల కోట్ల విరాళం!

**న్యూఢిల్లీ, జూన్ 19:** ప్రపంచ కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. దాతృత్వ కార్యక్రమాల కోసం ఈ ఏడాది 6 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.52వేల కోట్లు) విలువైన బెర్క్‌షైర్ హాథ్‌వే వాటాలను విరాళంగా ప్రకటించనున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. బెర్క్‌షైర్ హాథ్‌వే సీఈఓ అయిన బఫెట్ 2006 నుంచి ఏటా జూన్‌లో ఇలా దాతృత్వ కార్యక్రమాల కోసం తన వాటాల్లో కొంత విరాళంగా ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్‌తో పాటు తన కుటుంబానికి చెందిన నాలుగు ఫౌండేషన్లకు అందజేస్తున్నారు. ఏటా తాను విరాళమిచ్చే వాటాల్లో 5శాతాన్ని బఫెట్ తగ్గిస్తూ వస్తున్నారు. అయితే, బెర్క్‌షైర్ కంపెనీ షేర్ల విలువ పెరుగుతుండటంతో ఈ విరాళాల మొత్తం కూడా పెరుగుతోంది. గతేడాది జూన్‌లో ఆయన విరాళాల ప్రకటన చేసిన తర్వాత నుంచి ఇప్పటివరకు కంపెనీ షేరు విలువ 19శాతం పెరిగింది. 2006 నుంచి ఇప్పటివరకు బెర్క్‌షైర్ కంపెనీల్లో తన వాటా నుంచి సగానికంటే ఎక్కువే బఫెట్ విరాళంగా ఇచ్చేశారు. దీంతో ఆయనకు ఇప్పుడు కంపెనీలో 198119 క్లాస్‌ఎ షేర్లు ఉన్నాయి. వీటి విలువ ప్రస్తుతం దాదాపు 144 బిలియన్ డాలర్లుగా ఉంది. బఫెట్ ఏటా ఇచ్చే విరాళాల్లో అత్యధికం అంటే దాదాపు 75శాతం గేట్స్ ఫౌండేషన్‌కే వెళ్తుంది. మిగతా మొత్తం తన కుటుంబానికి చెందిన స్వచ్ఛంద సంస్థలకు కేటాయించారు.



# సాఫ్ట్ డ్రింక్స్‌పై రిలయన్స్ దృష్టి..

**ముంబై, జూన్ 19:** ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ కన్జ్యూ మర్ ప్రోడక్ట్స్ సంస్థ శీతల పానీయాల వ్యాపారంపై దృష్టిసారించిం ది. ఈ వ్యాపారంపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది. రాబోయే 1215 నెలల్లో దాదాపు రూ.8 వేల కోట్లకు వరకు పెట్టుబడులు పెట్టాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తద్వారా శీతల పానీయాల విభాగంలో పెప్సీ, కోకాకోలా వంటి బహుళజాతి సంస్థల తోపాటు దేశీయంగా ఉన్న చిన్న బ్రాండ్లకు సైతం సవాలు విసరా లని చూస్తోంది. రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ ద్వారా 2022లో శీతల పానీయాల విభాగంలోకి రిలయన్స్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాంపా కోలా, సోస్యో సాఫ్ట్‌డ్రింక్స్‌తో పాటు స్పిన్నర్ స్పోర్ట్స్ డ్రింక్, సన్‌క్రష్ జ్యూస్, ఇండిపెండెన్స్ వాటర్ బాటిళ్లను విక్రయి స్తోంది. వీటి ఉత్పత్తిని మరింత పెంచేందుకు 1012 గ్రీన్‌ఫీల్డ్, కోప్యాకింగ్ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని కంపెనీ భావిస్తోంది. ఇందుకోసం రూ.68వేల కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలనుకొంటోంది. రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ పెట్టబోయే పెట్టుబడుల్లో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం గమనార్హం. రిలయన్స్‌తో పాటు, భాగస్వామ్య కంపెనీలు కలిసి ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో గువాహటిలో జెరిఖో ఫుడ్స్ అండ్ బేవరేజస్ ఎల్ఎల్‌పీతో కలిసి సాఫ్ట్ డ్రింక్స్, వాటర్ బాటిళ్ల ఉత్పత్తి ప్లాంట్‌ను నెలకొల్పింది. ఈశాన్య ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ ప్లాంట్‌ను కంపెనీ ఏర్పాటు చేసింది. త్వరలో బిహార్‌లోనూ ఇలాంటి ప్లాంట్ అందుబాటులోకి రాబోతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.